అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 25-3-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

సంపుటి : 09 | సంచిక : 83 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



రాహుల్‌పై అనర్హత వేటు

లోక్‌సభ సచివాలయం సర్క్యులర్ జారీ

సూరత్‌కోర్టు తీర్పునిచ్చిన తర్వాతి రోజే చర్యలు

ఖండించిన అన్ని పార్టీల నేతలు



రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడింది. దీనికి సంబంధించి లోక్‌సభ సెక్రెటేరియట్ నుంచి సర్క్యులర్ జారీ అయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 8(3) ప్రకారం ఆయనపై వేటు వేశారు. సూరత్‌కోర్టు తీర్పు ప్రకారం లోక్‌సభ సెక్రెటేరియట్ ఆయనపై వెంటనే చర్యలకు దిగింది. "కేరళలోని వయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ గాంధీని సూరత్‌కోర్టు చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేటు దోషిగా తేల్చడంతో లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. దోషిగా తేలిన 2023 మార్చి 23 నుంచి అనర్హత వర్తిస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 102(1)(ఈ), ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 8 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నాం" అని పేర్కొంటూ లోక్‌సభ సచివాలయం సెక్రెటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ సర్క్యులర్ జారీ చేశారు. మరిన్ని వివరాలు 5లో



ప్రజాస్వామ్య చరిత్రలో చీకటిరోజు..

- మోడీ దురహంకారానికి పరాకాష్ట : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ సెక్రటరీ జనరల్ తీసుకున్న నిర్ణయాన్ని సీఎం కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో శుక్రవారాన్ని చీకటిరోజుగా అభివర్ణించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ప్రధాని నరేంద్రమోడీ దురహంకారానికి, నియంతృత్వానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాజ్యాంగబద్ధ సంస్థలను దురుపయోగం చేయడమే కాకుండా అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటును సైతం తమ హేయమైన చర్యలకోసం మోడీ ప్రభుత్వం వినియోగించుకోవడం ...5లో

దేశం కోసమే నా పోరాటం

భారత్ గళాన్ని వినిపించేందుకే నేను పోరాటం చేస్తున్నాను. ఈ క్రమంలో ఎంత మూల్యం చెల్లించడా నికైనా సిద్ధమే.

- రాహుల్

నియంతలకు తలొంచం

ఒక అమరవీరుడి కొడుకును మోడీ భజన బృందం దేశ ద్రోహిగా అభివర్ణిస్తున్నది. మీరు ఏం చేయగలరో చేసుకోండి. కానీ.. ఒక పిరికిపంద, అధికార యావ ఉన్న మీ లాంటి నియంతముందు గాంధీ కుటుంబం తలవంచదు.

- ప్రియాంక



నిరంకుశ దాడులను ప్రతిఘటిద్దాం : ఏచూరి



రాహుల్ గాంధీ మాదిరిగానే ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని వారిపై అనర్హత వేటు వేయడానికి బీజేపీ నేరపూరిత పరువు నష్టం మార్గాన్ని ఉపయోగిస్తుండడం ఖండించదగినది. ఇటువంటి నిరంకుశ దాడులను ప్రతిఘటించి ఓడించాలి.

ప్రజాస్వామ్య శక్తులపై దాడి



భారత యువ నాయకుడు రాహుల్ గాంధీని అనర్హుడిగా ప్రకటించే ఫాసిస్టు చర్యను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ చర్యను ఉపసంహరించుకోవాలి.

- తమిళనాడు సీఎం స్టాలిన్

షాక్‌కు గురి చేసింది

రాహుల్ గాంధీని లోక్‌సభ నుంచి బహిష్కరించడం విస్మయాన్ని కలిగిస్తున్నది. దేశం చాలా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. వారు (బీజేపీ) దేశం మొత్తాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. ఈ అహంకార శక్తులకు వ్యతిరేకంగా 130 కోట్ల మంది ప్రజలు ఏకం కావాలి.

- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

రాష్ట్రపతి భవన్‌కు ప్రతిపక్ష ఎంపీల మార్చ్

అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు

న్యూఢిల్లీలో టెన్షన్...టెన్షన్...





వివరాలు 5లో..

ఛాందసవాద శక్తులను

నిలువరించండి

ప్రతిగ్రామంలో పోరాటం మొదలవ్వాలి



- లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేస్తాం
- ప్రజావ్యతిరేక మోడీని గద్దెదించాలి
- కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు నూతన చరిత్రను లిఖించాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్
- ఘనంగా నిజామాబాద్‌లో జనచైతన్య యాత్ర ప్రారంభం
- భారీ బైక్ ర్యాలీ..ఆకట్టుకున్న కళారూపాలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి(భాస్కర్)

మతఛాందసవాద శక్తులు తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, ఆ శక్తులు అధికారంలోకి రాకుండా నిలువరించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ పిలుపునిచ్చారు. లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో కలిసి దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన చరిత్ర ఈ గడ్డకు ఉందని, అదే స్ఫూర్తితో ప్రజాస్వామ్య వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు నూతన చరిత్రను లిఖించాలని పిలుపునిచ్చారు. బీజేపీని గద్దెదించడంలో అందరం ఐక్యంగా ముందుకు సాగాలని, ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్దామని అన్నారు.

సీపీఐ(ఎం) మూడో జనచైతన్య యాత్ర శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమయ్యింది. సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ నేతృత్వంలో హైదరాబాద్ వరకు ఈ జాతా సాగుతుంది. యాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కారు ప్రజా వ్యతిరేక పాలన చేస్తోందని విమర్శించారు. యావత్ ప్రపంచంలో అత్యంత పేదరికం, నిరుద్యోగం భారతదేశంలోనే ఉందని వివరించారు. ఈ పేదల అభ్యున్నతికి, మోడీ సర్కారు వద్ద ఎలాంటి కార్యక్రమాలు లేవన్నారు. పేదలు తినే బియ్యంపై, ఉప్పుపై పన్నులు వేసిన ఘనుడు మోడీ అని మండిపడ్డారు. బ్రిటిష్ పాలనలో ఉప్పుపై పన్ను వేస్తే నాడు మహాత్మాగాంధీ నేతృత్వంలో దేశ ప్రజలు పోరాటం చేశారని, మళ్లీ మోడీ సర్కారు బ్రిటీష్ పాలనను తలపిస్తోందని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీచట్టంలో భాగంగా 100 రోజులు పని కల్పించాల్సి ఉండగా.. కేవలం 20 రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారని, పని దినాలను తగ్గించారని అన్నారు.

దేశంలో దేశ సమైక్యతను కాపాడే సర్కారు లేదని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి దేశాన్ని విభజించే సర్కారు ఉందని ...12లో

నల్లధనం తెస్తామన్న హామీపై

బీజేపీని నిలేయండి

ఆ పార్టీ పాలనలో ఆర్థిక సార్వభౌమత్వం ధ్వంసం

- జీఎస్టీ పేరుతో రాష్ట్రాల ఆదాయాలకు గండి
- గతంలో గెలిచిన స్థానాల్లో ఎర్ర జెండా ఎగరేస్తాం : తమ్మినేని వీరభద్రం
- బీజేపీ విధానాల వల్లే ధరల పెరుగుదల : మల్లు లక్ష్మి
- జనచైతన్య యాత్రకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సంఘీభావం



వివరాలు 7లో..

ప్రతిపక్షాల న్యాయ పోరాటం

సీబీఐ, ఈడీ దుర్వినియోగంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన 14 ప్రతిపక్షాలు

- ఏప్రిల్ 5న పిటిషన్ విచారణకు న్యాయస్థానం అంగీకారం 5లో..



40% పెరిగిన బ్యాంక్ ఎగవేతలు

రెండేండ్లలో రూ.94వేల కోట్లకు కన్నం

న్యూఢిల్లీ : భారత్‌లో రుణాల ఎగవేతలు భారీగా పెరుగుతున్నాయి. కేవలం రెండేండ్లలోనే ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన రుణాలు 38.5 శాతం లేదా 11.4 బిలియన్ డాలర్లు (దాదాపు 94వేల కోట్లు) ...5లో



డిస్కంల ట్రూ అప్స్..సర్కారే చెల్లిస్తుంది

ఐదేండ్లలో రూ.12,718 కోట్లు చెల్లిస్తామని టీఎస్ఈఆర్సీకి లేఖ 2లో..

- వచ్చే ఆర్థిక సంవత్సరంలో కరెంటు చార్జీల పెంపు లేదు :ఏఆర్ఆర్ టారిఫ్ ఆర్డర్ ప్రకటించిన చైర్మెన్ శ్రీరంగారావు



ఏ-1 ప్రవీణ్, ఏ-2 రాజశేఖర్...

పేపర్ లీకేజీ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు

- 19 మంది సాక్షులను విచారించినట్టు వెల్లడి
- ఆ ముగ్గురిని కస్టడీకి ఇవ్వండి : సిట్ 5లో..



పీఆర్సీ ఇవ్వాల్సిందే..

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఈపీఎఫ్ టు జీపీఎఫ్ మార్పు చేయాలి
- విద్యుత్ కార్మికుల మహాధర్నాలో నేతల డిమాండ్
- జనసంద్రమైన విద్యుత్ సౌధ
- భారీగా తరలివచ్చిన విద్యుత్ ఉద్యోగులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ తక్షణం చేపట్టాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) ఆధ్వర్యంలో జరిగిన 'మహాధర్నా' డిమాండ్ చేసింది. జేఏసీ పిలుపులో భాగంగా వేలాదిమంది విద్యుత్ ఉద్యోగులు చలో హైదరాబాద్ పేరుతో విద్యుత్ సౌధ కార్యాలయానికి చేరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది ఉద్యోగులు తరలిరావడంతో ఖైరతాబాద్ ప్రాంతం జనసంద్రంగా మారింది. విద్యుత్ సౌధ ఎదుటి రోడ్లు కిక్కిరిసిపోయాయి. తమ డిమాండ్లను వెల్లడిస్తూ ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు. గతంలో ప్రమోషన్లను రివర్షన్ చేస్తూ ఇచ్చిన ఆర్డర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2022 ఏప్రిల్ 1 నుంచి తమకు నూతన వేతన సవరణ రావల్సి ఉందనీ, ఇప్పటి వరకు దాన్ని ప్రకటించలేదన్నారు. భారీగా తరలివచ్చిన విద్యుత్ ఉద్యోగులతో రోడ్లు నిండిపోవడంతో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు సవాలుగా నిలిచింది. డీజీపీ అంజన్‌కుమార్ విద్యుత్ సౌధ చుట్టుపక్కల ఏరియల్ సర్వే చేశారు. మహాధర్నాలో జేఏసీ చైర్మెన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకరరావు, కో చైర్మెన్ ఎన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి, జాయింట్ సెక్రటరీ గోవర్ధన్, తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వరరావు, పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సదానందం, 1104 యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు సహా మొత్తం 24 సంఘాల నాయకులు మాట్లాడారు. 1999 నుంచి 2004 వరకు నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్, జీపీఎఫ్ అమలు చెయ్యాలని కోరారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం, విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డితో జరిపిన చర్చలు కొలిక్కి రాలేదన్నారు. ఇంకా సమయం కావాలని అడుగుతున్నారనీ, ఇప్పటికే తాము ఏడాది వేచి చూశామని ...2లో

ఓయూలో ఉద్రిక్తం

ఇరువర్గాల ఆందోళన

- ఒక జేఏసీ నిరుద్యోగ మార్చ్,.. మరో జేఏసీ నిరసన దీక్ష .. విద్యార్థి నాయకుల అరెస్ట్
- కిరోసిన్ పోసుకున్న ఇద్దరు విద్యార్థులు.. అడ్డుకున్న పోలీసులు
- రేవంత్‌రెడ్డి రాకను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్‌వీ నాయకుల నిరసన



నవతెలంగాణ-ఓయూ

పేపర్ లీకేజీకి నిరసనగా ఉస్మానియా యూనివర్సిటీలో ఒక విద్యార్థి జేఏసీ నిరుద్యోగ మార్చ్‌కు పిలుపు ఇవ్వగా, మరొక జేఏసీ నిరసన దీక్షకు పిలుపునిచ్చింది. దాంతో శుక్రవారం ఓయూలో ఆర్ట్స్ కళాశాల వద్ద రోజంతా ...2లో



ఓయూ దీక్షకు వెళ్లకుండా రేవంత్ హౌస్ అరెస్టు

పలువురు నేతలు గృహ నిర్బంధంలోనే... వివరాలు 2లో..



డిస్కంల ట్రూ అప్స్...సర్కారే చెల్లిస్తుంది

- ఐదేండ్లలో రూ.12,718 కోట్లు చెల్లిస్తామని టీఎస్ఈఆర్సీకి లేఖ
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో కరెంటు చార్జీల పెంపు లేదు : ఏఆర్ఆర్ టారిఫ్ ఆర్డర్ ప్రకటించిన చైర్మెన్ శ్రీరంగారావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై కరెంటు చార్జీల పిడుగు పడలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుతం అమల్లో ఉన్న టారిఫ్ ఆర్డరే వర్తిస్తుంది. కేవలం ప్రార్థనా మందిరాలకు గతంలో అధికంగా ఉన్న కరెంటు చార్జీలను లోడ్‌తో సంబంధం లేకుండా యూనిట్ సరాసరి ధరను రూ.5గా నిర్ణయించారు. ఇంతకు మించి వచ్చే ఆర్థిక సంవత్సరం టారిఫ్ ఆర్డర్‌లో ఎలాంటి మార్పు లేదు. 2022-23లో కరెంటు చార్జీలు పెంచిన విద్యుత్ సంస్థలు 2023-24లో చార్జీల పెంపుపై ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. దాన్ని యథాతథంగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) ఆమోదించింది. ఈ మేరకు శుక్రవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఈఆర్సీ చైర్మెన్ టీ శ్రీరంగారావు, సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు (టెక్నికల్), బండారు కృష్ణయ్య ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిస్కంల ఆదాయ లోటు రూ.10,890.51 కోట్లు ఉంటుందని వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనల్లో (ఏఆర్ఆర్) ప్రతిపాదించాయి. దాన్ని పరిశీలించిన కమిషన్ ఆదాయ లోటు రూ.9,124.82 కోట్లుగా ఉంటుందని నిర్ధారించి ఆమోదించింది. అలాగే విద్యుత్ కొనుగోలు ధరను 2022-23లో యూనిట్‌కు రూ.4.49 పైసలుగా నిర్ధారించగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి దీన్ని రూ.4.39 పైసలుగా ప్రకటించారు. కాస్ట్ ఆఫ్ సర్వీస్ కూడా రూ.7.03 పైసల నుంచి రూ.7.02 పైసలుగా నిర్ధారించారు. 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు రూ.9,124.82 కోట్ల సబ్సిడీ ఇస్తామని ప్రకటించింది. దీనిలో ఎల్‌టీ-1 కేటగిరి గృహ వినియోగానికి సంబంధించి రూ.1,381.02 కోట్లు, ఎల్‌టీ-5 కేటగిరిలో వ్యవసాయానికి రూ.9,124.82 కోట్లు సబ్సిడీ ఇస్తామని ప్రకటించింది. దీన్ని టీఎస్ఈఆర్సీ టారిఫ్ ఆర్డర్‌లో పరిగణనలోకి తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ప్రభుత్వ సబ్సిడీ రూ.8,221.17 కోట్లు ఇచ్చింది. దీనికంటే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.903.65 కోట్లు (11శాతం) అధికంగా సబ్సిడీని ప్రకటించిందని కమిషన్ వెల్లడించింది.

ట్రూ అప్ భారాలు... ప్రభుత్వానికే...

వివిధ పేర్లతో వినియోగదారుల నుంచి ట్రూఅప్ చార్జీలు వసూలు చేసుకొనేందుకు అనుమతించమని విద్యుత్ పంపిణీ సంస్థలు టీఎస్ఈఆర్సీకి గతంలో దరఖాస్తు చేసుకున్నాయి. వీటిని పరిశీలించిన కమిషన్ ఆ చార్జీలను రూ.12,718.40 కోట్లకు ఖరారు చేసింది. ఈ మొత్తాన్ని ఐదేండ్లలో దశలవారీగా విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ఈఆర్సీకి లేఖ రాసింది. దీనితో ఈ భారం నేరుగా విద్యుత్ వినియోగదారులపై పడలేదు. ఎన్నికల సంవత్సరం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం కరెంటు చార్జీలు పెరగకుండా జాగ్రత్త పడింది. 2016-17 నుంచి 2022-23 వరకు మొత్తం ఏడేండ్ల విద్యుత్ కొనుగోలు ట్రూ అప్ రూ.12,514.57 కోట్లకు కమిషన్ ఆమోదం తెలిపింది. అలాగే ~~2006-07 నుంచి 2018-19 వరకు విద్యుత్ పంపిణీ వ్యాపార వీలింగ్~~ చార్జీల ట్రూ అప్ పేరుతో డిస్కంలు రూ.4,578.41 కోట్లను క్లెయిం చేశాయి. దీనిలో కూడా ఉదయ్ స్కీం ద్వారా లభించిన ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని రూ.203.83 కోట్లకు మాత్రమే టీఎస్ఈఆర్సీ ఆమోదం తెలిపింది. మొత్తంగా రూ.12,718.40 కోట్లు ట్రూ అప్ చార్జీలను కమిషన్ ఆమోదించింది. ఈ సొమ్మును ఐదేండ్లలో డిస్కంలకు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌కు లేఖ రాయడంతో దాన్ని పరిగణనలోకి తీసుకొని, వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారాలు వేయలేదని కమిషన్ చైర్మెన్ వివరించారు.

పీఆర్సీ ఇవ్వాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఆర్టిజన్ కార్మికులకు నగదు రహిత అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీని అమలు చెయ్యాలనీ, కోటి రూపాయల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ ఉద్యోగులకు కూడా రిటైర్మెంట్ తర్వాత వైద్య సదుపాయాలు కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు ఇవ్వాలని కోరారు. భారీ ఎత్తున జరిగిన మహాధర్నాలో జేఏసీ వైస్ చైర్మెన్లు అనీల్, వజీర్, జాయింట్ సెక్రటరీలు శ్యామ్ మనోహర్, వెంకన్న గౌడ్, సుధాకర్ రెడ్డి, తులసి నాగరాణి, ఫైనాన్స్ సెక్రటరీ కరుణాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రాంజీ, నెహ్రూ, లోహిత్ ఆనంద్, నాగరాజు , సత్యనారాయణ రావు, మురళి, మోజెస్, గిరిధర్, శ్రీనివాస్, ఖాజా మొయినుద్దీన్, సతీష్ కుమార్, అరవింద్ కుమార్, రవీందర్, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు సత్వరం పరిష్కరించకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- 64 అధికారిక సవరణలు
- ఎలాంటి చర్చా లేకుండానే ముగిసిన తంతు
- సభ్యుల గందరగోళం నడుమనే మూజువాణి ఓటుతో ఆమోదం

న్యూఢిల్లీ : 2023 సంవత్సరం ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సభ్యుల గందరగోళం నడుమనే మూజువాణి ఓటుతో సభ ఈ బిల్లును ఆమోదించింది. దీంతో 2023-24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తును లోక్‌సభ పూర్తి చేసింది. ఈ బిల్లులో మొత్తం 64 అధికారిక సవరణలు చోటు చేసుకున్నాయి. అయితే, ఎలాంటి చర్చా లేకుండానే ఆర్థిక బిల్లు ఆమోదం పొందటం గమనార్హం. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కాబోయే ఆర్థిక సంవత్సరానికి ఈ బిల్లు పన్ను ప్రతిపాదనలను అమలు చేయనున్నది. ఈ బిల్లు ఆమోదం సమయంలో ప్రతిపక్ష నాయకులు అదాని గ్రూపు కంపెనీలపై వచ్చిన ఆరోపణల మీద జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పట్టుబట్టారు. దీంతో సభలో సభ్యుల గందరగోళం నడుమనే బిల్లు పాసైంది. ఆర్థికశాఖ కార్యదర్శి నేతృత్వంలో ప్రభుత్వ ఉద్యోగులో పెన్షన్ సమస్యల గురించి కమిటీ ఏర్పాటుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన చేశారు. విదేశీ పర్యటనల్లో క్రెడిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపుల విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) దృష్టి సారిస్తుందని ఆమె అన్నారు. కాగా, ఆర్థిక బిల్లులో సవరణలతో కొత్తగా 20 సెక్షన్లు వచ్చి చేరాయి. లోక్‌సభలో ఆమోదం తర్వాత ఆర్థిక బిల్లు రాజ్య సభకు వెళ్లనున్నది.

ఇంటర్ ఆన్‌లైన్ మూల్యాంకనం టెండర్‌ను రద్దు చేయండి

- మంత్రి సబితకు మధుసూదన్‌రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనానికి సంబంధించిన టెండర్‌ను రద్దు చేయాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. కోసైన్ అనే సంస్థకు టెండర్‌ను కట్టబెట్టారని తెలిపారు. ఈ టెండర్‌లో అనేక లోపాలున్నాయని పేర్కొన్నారు. అనుభవం, ప్రతిష్ట ఉన్న సంస్థలు కాకుండా కొన్ని సంస్థలకు అనుకూలంగా ఈ టెండర్ దరఖాస్తు పత్రాన్ని రూపొందించారని తెలిపారు. గతంలో ఈ సంస్థ టెండర్లలో పాల్గొన్నా ఒడిశా రాష్ట్ర సాంకేతిక విద్యా కౌన్సిల్, పాలమూరు విశ్వవిద్యాలయం అనుభవం లేదంటూ దరఖాస్తును తిరస్కరించాయని గుర్తు చేశారు. పది లక్షల మంది విద్యార్థుల విలువైన ఇంటర్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రక్రియను కోసైన్ సంస్థకు అప్పగించడం సరైంది కాదని తెలిపారు. ఆ సంస్థతో ఇంటర్ బోర్డు అధికారులు లోపాయికారి ఒప్పందం చేసుకుని ఈ టెండర్‌ను కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి టెండర్‌ను రద్దు చేయాలనీ, టీసీఎస్ వంటి అనుభవం ఉన్న సంస్థలకు అప్పగించాలని కోరారు.

పేరుకే ఎయిమ్స్ సేవలు ఏరియాస్పత్రి తరహా..

2019లో ప్రారంభమైనా అమల్లోకి రాని పూర్తి స్థాయి సేవలు

- ఏరియా ఆస్పత్రిలో విద్యార్థుల ప్రాక్టికల్ బోధన
- సమకూరని యంత్ర పరికరాలు



ఎయిమ్స్.. దేశంలోనే పేరుగాంచింది.. అలాంటి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)ను యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఏర్పాటు చేయడంతో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కానీ పేరుకే ఎయిమ్స్.. అక్కడ ఎలాంటి సౌకర్యాలూ ఏర్పాటు చేయలేదు కేంద్ర ప్రభుత్వం. 2019లో నామమాత్రంగా ప్రారంభించినా.. పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి రాలేదు. విద్యాబోధనా సక్రమంగా అందడం లేదు. యంత్ర పరికరాలూ సమకూర్చలేదు. అనుకున్న లక్ష్యం చేరుకోలేదు. ఉమ్మడి జిల్లాలైన నల్లగొండ, వరంగల్, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజలు ఎయిమ్స్ వైద్యంపై పెట్టుకున్న ఆశలు అడియాశలైనాయి. అత్యాధునిక అత్యుత్తమ వైద్య సేవలు అందాల్సిన ఎయిమ్స్‌లో ఏరియా ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. 2019లో ప్రారంభమై.. 2020 నుంచి ఓపీ సేవలు అందిస్తున్నా నేటికీ వైద్యం సేవలు ఇన్ పేషెంట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. మరోవైపు ఎయిమ్స్ వరకు రైలు సదుపాయం కల్పించాలని డిమాండ్ ఉన్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. అందులో చదివే వైద్య విద్యార్థులకు విద్యాబోధన ప్రాక్టీస్ కోసం పేషెంట్లు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం భువనగిరి వైద్యశాలలో వైద్య విద్య నేర్చుకోవడానికి అనుమతిచ్చింది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లోనూ ఎయిమ్స్‌కు నామమాత్రంగానే నిధుల కేటాయింపు జరిగింది.

నవతెలంగాణ - భువనగిరి

2014లో ఎయిమ్స్ గురించి కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. జనవరి 2017లో నిమ్స్ క్యాంపస్‌ను ఎయిమ్స్‌గా స్థాపించడానికి కేంద్రానికి నివేదికలు పంపించారు. కేంద్ర ప్రభుత్వం 2016లో భువనగిరిలో ఎయిమ్స్ ప్రారంభించాలనుకున్నా వసతులు లేకపోవడంతో.. జిల్లాలోని నిమ్స్ వైద్యశాలలోనే ఎయిమ్స్ ఏర్పాటు చేయడానికి 2018లో కేంద్ర ప్రభుత్వం సూత్ర పాయంగా ఆమోదం తెలిపింది. బీబీనగర్ క్యాంపస్‌లో 49 ఎకరాలు అదనంగా ఇవ్వాలని రాష్ట్రాన్ని కోరింది. అదనపు భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరణ చేసింది. జులై 3న యూనియన్ క్యాబినెట్ ఆమోదించింది. 17 డిసెంబర్ 2018న రూ. వెయ్యి 28 కోట్లు అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 2019 మేలో బీబీనగర్‌లో 50 మంది ఎంబీబీఎస్ విద్యార్థులతో కూడిన మొదటి బ్యాచ్‌ను ప్రారంభించింది. ఆగస్టు 2019లో చేరిన విద్యార్థుల కోసం ఎయిమ్స్‌లో సేవలు లేకపోవడంతో భువనగిరి ఏరియా ఆస్పత్రిని వైద్య విద్యార్థుల కోసం కేటాయించారు. 2020లో ఇన్ పేషెంట్ ప్రారంభిస్తామని చెప్పినా నేటికీ పూర్తిస్థాయిలో ఇన్ పేషెంట్ సేవలు అందడం లేదు. ఆధునిక యంత్ర పరికరాలు పరిమితంగా ఉండటం, డాక్టర్లు, సిబ్బంది కొరత ఉంది. దీంతో శస్త్ర చికిత్సలు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. కేంద్ర మంత్రులు ఎయిమ్స్‌లో పర్యటనలకే పరిమితం అవుతున్నారు తప్ప నిధులు తేవడం లేదు..

హెల్త్ హబ్ పై వెనుకడుగు వేసిన రాష్ట్రం

ఎయిమ్స్‌లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందితే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీగా నిర్మించాలనుకుంది. అందులో భాగంగా హెల్త్ హబ్ తయారవుతుందని ప్రజలు ఆశించారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్‌కు నిధులు కేటాయించడం.. నాలుగేండ్లవుతున్నా వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లలేక పోతుంది. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో, బోధన సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం అడుగడుగునా కనబడుతోంది.

అందని ద్రాక్షలా ఎయిమ్స్ సేవలు



ఎయిమ్స్ ఉన్నది పేరుకే తప్ప సేవలు చెప్పుకొనే విధంగా లేవు. ఉమ్మడి ఐదు జిల్లాలకు అత్యాధునిక పరి జ్ఞానంతో అందాల్సిన వైద్యం అందని ద్రాక్షలా మారింది. శస్త్ర చికిత్స లు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. వైద్య పరికరాలు వెంటనే కొనుగోలు చేసి శస్త్ర చికిత్సలు చేయాలి. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ ఎయిమ్స్‌పై వివక్ష ఉంది. ఓపీకి రోగులు వస్తున్నా సరైన యంత్రాలు లేవు. వైద్య నమోదు కేంద్రాలు లేకపోవడం, సమయం తక్కువగా ఉండటంతో రోగులు తిరిగి వెళ్లి పో తున్నారు. నియామకాలలో ఇతర రాష్ట్రాల వ్యక్తులకు ఇస్తున్న ప్రాధాన్యత స్థానిక నిరుద్యోగులకు ఇవ్వడం లేదు. దూర ప్రాంతాల నుంచి ఎయిమ్స్‌లో వైద్య సేవల కోసం వచ్చే వారి కోసం బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి. ఈ మార్గంలో ఎంఎంటీఎస్ రైలును అందుబాటులోకి తేవాలి. జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేయాలి.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

- సీఐటీయూ నాయకులు రాజారావు, మధు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదం, ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సీఐటీయూ సీనియర్ నాయకులు పి రాజారావు, రాష్ట్ర కార్యదర్శి బి మధు పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోస 23 ఏండ్ల చిరుప్రాయంలోనే ఉరికంబమెక్కిన షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతి కార్యక్రమం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు రాజారావు పూలమాలవేసి నివాళులర్పించారు. సీఐటీ యూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాజారావు, మధు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలు ఇంకా మిగిలే ఉన్నాయని చెప్పారు. వారు కలలు కన్న భారతదేశం ఇంకా నిర్మించలేదన్నారు. బ్రిటీష్ ప్రభుత్వా న్నే క్షమాభిక్ష కోరి ప్రభుత్వానికి సహకరించిన వారి వారసులు నేడు దేశంలో అధికారంలో ఉన్నారని విమ ర్శించారు. ఈ దేశాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదం ఎంత ప్రమాదమో ఆనాడే దానికి వ్యతిరేకంగా నికరంగా పోరా డిన వ్యక్తి భగత్‌సింగ్ అని చెప్పారు. దేశ రక్షణ కోసం, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతులు ఐక్య పోరాటా లకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రమ, రాష్ట్ర కమిటీ సభ్యులు పి సుధాకర్, ఆఫీసు కార్య దర్శి సునీత, నాయకులు భారతి, సందీప్, అనిల్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 13 నుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) ప్రక్రియ వచ్చేనెల 13 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు జి రమేష్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పరీక్షలు వచ్చేనెల మూడు నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చేనెల 13 నుంచి 21వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. 11 జిల్లాల్లో 18 స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఓయూలో ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే దీక్షకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని ఆహ్వానించడంతో బీఆర్ఎస్‌వీ విద్యార్థులు రేవంత్ రాకను నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో విద్యార్థుల నిరసనలు, అరెస్టులతో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం అట్టుడికింది.

తెల్లవారుజాము నుంచే అరెస్టులు

పేపర్ లీకేజీ పట్ల నిరసన వ్యక్తం చేస్తూ పలు విద్యార్థి నిరుద్యోగ సంఘాలు శుక్రవారం నిరుద్యోగ మార్చ్, దీక్ష, ధర్నాలకు పిలుపునివ్వడంతో తెల్లవారుజామున నుంచే హాస్టళ్లలో ఉన్న పలువురు విద్యార్థి నాయకులను ఓయూ పోలీసులు అరెస్టు చేశారు. అయితే కొందరు విద్యార్థి నాయకులు ఆర్ట్స్ కళాశాల నుంచి గన్ పార్క్ వరకు మార్చ్ చేయడానికి సిద్ధం కాగా వారిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భ ంగా నాయకులు మాట్లాడుతూ. పేపర్ల లీకేజీకి కార కులైన చైర్మెన్, సభ్యులను వెంటనే తొలగించాలన్నా రు. లీకేజీ వ్యవహారంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఉద్యోగాల భర్తీ క్యాలెండర్ ప్రకటించాలన్నారు.

ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల అధ్వర్యంలో దీక్ష...అరెస్టు

ఇదిలా ఉండగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల అధ్వర్యంలో విద్యార్థి నాయకులు ఆర్ట్స్ కళాశాల ఎదుట దీక్షకు దిగడంతో వెంటనే వారిని పోలీసులు అడ్డుకొని ఓయూ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. లీకేజీపై సీబిఐతో సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనానికి యత్నించిన బీఆర్ఎస్వీ నాయకులు..

మరోవైపు రేవంత్‌రెడ్డి ఓయూకు వస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్‌వీ సంఘం నాయకులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి వారు యత్నించగా పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి చటారి దశరథ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి విద్యార్థులతో రాజకీయాలు చేస్తూ చిచ్చు పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల గురించి రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నిం చారు.

పెట్రోల్ పోసుకున్న ఇద్దరు.. అడ్డుకున్న పోలీసులు

పేపర్ లీకేజీ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓయూ విద్యార్థి నాయకులు నగేష్, శ్రీకాంత్‌లు పెట్రోల్ పోసుకోగా మరో ఇద్దరు కూడా అందుకు యత్నించారు. అయితే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. పరీక్ష పేపర్లు లీక్ అవుతుంటే తాము ఇంత కష్టపడి ఏం లాభమని అవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించి దోషులను శిక్షించాలన్నారు. బోర్డును ప్రక్షాళన చేసి మళ్లీ నోటిఫికేషన్ వేయాలని, నష్ట పోయిన వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఓయూ ఎన్‌సీసీ గేట్ వద్ద కూడా ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓయూ, నల్లకుంట, అంబర్‌పేట్, లాలాగూడా పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్టయిన వారిలో ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్ కూడా ఉన్నారు. ఓయూలో ఆందోళన నేపథ్యంలో ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్ దత్, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, కాచిగూడ ఏసీపీ ఆకుల శ్రీనివాస్, ఓయూ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్‌లు యూనివర్సిటీలోనే ఉన్నారు. వీరితోపాటు ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 15 మంది ఎస్ఐలు, నలుగురు ఏఆర్ ప్లెటున్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓయూ దీక్షకు వెళ్లకుండా రేవంత్ హౌస్ అరెస్టు

- పలువురు నేతలు గృహ నిర్బంధంలోనే...

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన మహా దీక్షకు హాజరయ్యేందుకు ప్రయత్నించిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయన ఇంటి వద్ద టెన్షన్ పరిస్థితులు నెలకొన్నాయి. బారికేడ్లు ఏర్పాటు చేసి రహదారులన్నీ మూసివేశారు. దీక్షకు అనుమతి లేదంటూ రేవంత్‌ను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. నాయకులు, కార్యకర్తలను రేవంత్ ఇంటి వైపు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసి విలేకర్లతో రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్‌కు దమ్ముంటే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల కుంభకోణంపై ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల సమక్షంలో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. 'మీరు సచ్ఛీలురైతే, స్కాంలో మీ పాత్ర లేకపోతే నా సవాల్‌ను స్వీకరించాలి' అని ట్వీట్ చేశారు. పార్టీ నేతలు షబ్బీర్ అలీ, మల్లు రవి, చామలకిరణ్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, సునీతారావు, ఓయూ నేతలు తదితరులు గృహ నిర్బంధంలో ఉన్నారు.

లీకేజీపై సిట్ విచారణ నిర్లక్ష్యం

- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంపై సిట్ విచారణ నిర్లక్ష్య పూరితంగా ఉన్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, ఉచిత కోచింగ్, వసతి ప్రభుత్వమే కల్పించాలని కోరారు. లీకేజీకి సంబంధించి టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, కార్యదర్శి, సభ్యులందరినీ విచారణ చేయాలని తెలిపారు. చైర్మెన్‌ను వెంటనే తొలగించి టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని పేర్కొన్నారు.

మత్స్యకారులకు పది టికెట్లు ఇవ్వండి

- ఫిషర్మెన్ చైర్మెన్ మెట్టుసాయికుమార్ విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మత్స్యకారులు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్నారని ఫిషర్మెన్ చైర్మెన్ మెట్టుసాయికుమార్ చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వారికి పది టికెట్లు ఇవ్వాలంటూ రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రేను కోరారు. శుక్రవారం హైదరబాద్‌లోని ఇందిరాభవన్‌లో ఫిషర్మెన్ రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వారి పక్షాన నిలబడి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతీనెల ఒకటిన వేతనాలు విడుదల చేయాలి

- ఎయిడెడ్ టీచర్ల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్
- యూఎస్‌పీసీ నాయకులు
- యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో పీఏవో ఆఫీస్ ఎదుట నిరసన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు విడుదల చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అబిడ్స్‌లోని పీఏవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ నిరసనలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు హరికిషన్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్‌లు పాల్గొనారు. అంతకుముందు యూఎస్‌పీసీ ప్రతినిధుల బృందం పీఏవో అధికారి హనుమంతుని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నెల మొదటి తేదీన చెల్లించాల్సిన వేతనాలు ప్రతినెలా 15వ తేదీ వరకు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రతినెల మొదటి తేదీన వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించలేదని.. తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వేతనాలను, జీపీఎఫ్ క్లైములు, మెడికల్, టీఎస్‌జీఎల్ఐ బిల్లులు, ఈఎల్ బిల్లులు, పీఆర్సీ, పెన్షనరీ బకాయిలు తదితర బిల్లులన్నీ ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ.. ఏడు నెలలుగా సంబంధిత ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ కాలేదని.. సదరు పెండింగ్ బిల్లులన్నింటినీ మార్చి 31లోగా క్లియర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మరో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఎయిడెడ్ టీచర్ల వేతనాలు, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు సింహాచలం, శారద, రాజారావు, శ్యామ్ సుందర్, రాంబాబు, సీతారామ శాస్త్రి, సోమిరెడ్డి, లక్ష్మణ్ రాథోడ్, శ్రీనివాస్ రాథోడ్, రేణుక, శశికళ, రేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీనెల మొదటి తేదీన వేతనాలు విడుదల చేయాలి

- ఎయిడెడ్ టీచర్ల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్
- యూఎస్‌పీసీ అధ్వర్యంలో పీఏవో ఆఫీస్ ఎదుట నిరసన ప్రదర్శన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు విడుదల చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అబిడ్స్‌లోని పీఏవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ నిరసనలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్, టీటీప రాష్ట్ర అధ్యక్షుడు హరికిషన్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్‌లు పాల్గొనానరు. అంతకుముందు యూఎస్‌పీసీ ప్రతినిధుల బృందం పీఏవో అధికారి హనుమంతుని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నెల మొదటి తేదీన చెల్లించాల్సిన వేతనాలు ప్రతినెలా 15వ తేదీ వరకు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రతినెల మొదటి తేదీన వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించలేదని.. తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వేతనాలను, జీపీఎఫ్ క్లైములు, మెడికల్, టీఎస్‌జీఎల్ఐ బిల్లులు, ఈఎల్ బిల్లులు, పీఆర్సీ పెన్షనరీ బకాయిలు తదితర బిల్లులన్నీ ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ.. ఏడు నెలలుగా సంబంధిత ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ కాలేదని.. సదరు పెండింగ్ బిల్లులన్నింటినీ మార్చి 31లోగా క్లియర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మరో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఎయిడెడ్ టీచర్ల వేతనాలు, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు సింహాచలం, శారద, రాజారావు, శ్యామ్ సుందర్, రాంబాబు, సీతారామ శాస్త్రి, సోమిరెడ్డి, లక్ష్మణ్ రాథోడ్, శ్రీనివాస్ రాథోడ్, రేణుక, శశికళ, రేణు పాల్గొన్నారు.

ఉమ్మడిగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ - హైదరాబాద్

తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈసారీ ఉమ్మడిగా హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. ప్రతినిధుల సభకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 15 వేల మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ ప్రతినిధుల సభ ఏర్పాట్లపై అందుబాటులో ఉన్న రాష్ట్ర ముఖ్య నాయకులతో కాసాని భేటి అయ్యారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఇంటింటికీ టీడీపీ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 92 అసెంబ్లీ నియోజకవర్గాలలో పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకం అవుతుండటం సంతోషమని అన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ శతజయంతి వేడుకల నేపథ్యంలో 41వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ ప్రతినిధుల సభకు హైదరాబాద్ వేదిక కానుండటం తెలంగాణ రాష్ట్ర టీడీపీ శ్రేణులకు గర్వకారణమన్నారు. ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయ వంతం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పార్టీ నాయకులు తప్పనిసరిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవ నేపథ్యంలో హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో అన్ని ప్రధాన రహదారులపై స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ప్రధాన కూడళ్లను పార్టీ తోరణాలు, జెండాలతో నగరం మొత్తం పసుపు మయం అయ్యేలా చూడాలని జీహెచ్ఎంసీ పరిధిలోని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానికంగా ఎక్కడికక్కడా ఘనంగా జెండా ఆవిష్కరణలు చేసుకొని మధ్యాహ్నం 3 గంటల వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకోవాలని పార్టీ శ్రేణులను కాసాని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, వరంగల్ పార్లమెంట్ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, నగర నాయకులు రవీంద్రచారి, డాక్టర్ ఏ ఎస్ రావు, సాంబశివరావు, కోదాడ నియోజకవర్గ నాయకులు సైదేశ్వర్‌రావు, తదిరులు పాల్గొన్నారు.

సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా లేకపోతే
రాజకీయ ప్రజాస్వామ్యానికి మనుగడలేదు - డా॥ అంబేద్కర్

సంపాదకీయం

బట్టకాల్చి మీదేస్తే చెల్లదు!

'అమ్మ పెట్టదు.. అడుక్కు తిన్నివ్వదు...' తెలుగు రాష్ట్రాల్లో ఈ సామెత చాలా పాపులర్. ఇప్పుడు బీజేపీ పరివారం మాటలు వింటుంటే ఇదే సామెత గుర్తుకొస్తున్నది. తాను చేయాల్సిన పని చేయకుండా... చేసే వాణ్ని చేయనివ్వకుండా... ముందుకు పోకుండా, వెనక్కు రాకుండా ప్రతీ దానికీ అడ్డుపుల్లలేయటమే ఆ పరివారానికి ఉన్న ఏకైక పని. ఇటీవల

> అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనే హామీనిచ్చి గద్దెనెక్కిన మోడీ... ఆచరణలో వ్యవసాయ రంగానికి సంబంధించిన బడ్జెట్‌కు కోతలు పెట్టి తన రైతు వ్యతిరేకతను బయటపెట్టుకున్నారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ.1,15,531 కోట్లను వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్నామంటూ ప్రకటించిన కేంద్రం... అందులో ఆ రంగానికి కేవలం రూ.71,378 కోట్లనే విదిల్చి మిగతా నిధులను ఇతర పథకాలకు కేటాయించటం అత్యంత దారుణం.

రాష్ట్రంలో కురిసిన వడగండ్ల వానకు అనేక జిల్లాల్లో రైతన్న ఆగమాగమైపోయిండు. మామిడి, వరి, మొక్కజొన్న, మిరప తోటలతో పాటు టమాట తదితర కాయగూరల పంటలు సైతం నేల పాలయ్యాయి. దీంతో అన్నదాత దిక్కుతోచక విలవిల్లాడాడు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ స్పందించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ జిల్లాల్లో పర్యటించారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. అయితే ఇక్కడ కూడా కాషాయ దళం తన కుత్సితత్వాన్ని మరోసారి బయట పెట్టుకుంది. పరిహారం విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని అపహాస్యం చేస్తూ రంధ్రాన్వేషణ మొదలెట్టింది.



ఇలా బొక్కలు వెతకటంలో సిద్ధహస్తుడైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్... 'ఎన్నికల ఏడాది కాబట్టే రైతులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎనలేని ప్రేమ పుట్టుకొచ్చింది.. కేంద్రానికి నివేదిక పంపకుండానే బద్‌నాం చేస్తున్నారు...' అంటూ ఆడిపోసుకున్నారు. ఇలా సుద్దపూసలు మాటలు మాట్లాడటం ద్వారా 'గురివింద తన నలుపెరుగదన్నట్టు...' ఆయన వ్యవహరించారు. వాస్తవానికి గత ఎనిమిదిన్నరేండ్ల బీజేపీ పాలనలో రైతన్నలకు ఒరగబెట్టింది ఏమీ లేకపోగా దివాళాకోరు విధానాలతో వారిని నట్టేట ముంచింది. అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనే హామీనిచ్చి గద్దెనెక్కిన మోడీ... ఆచరణలో వ్యవసాయ రంగానికి సంబంధించిన బడ్జెట్‌కు కోతలు పెట్టి తన రైతు వ్యతిరేకతను బయటపెట్టుకున్నారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ.1,15,531 కోట్లను వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్నామంటూ ప్రకటించిన కేంద్రం... అందులో ఆ రంగానికి కేవలం రూ.71,378 కోట్లనే విదిల్చి మిగతా నిధులను ఇతర పథకాలకు కేటాయించటం అత్యంత దారుణం. మొత్తం బడ్జెట్‌లో ఆ రంగానికి కేవలం రూ.3.2శాతం నిధులనే కేటాయించి చేతులు దులుపుకోవటం ద్వారా మోడీ సర్కారు 'కార్పొరేట్ వ్యవసాయానికి' రూట్ క్లియర్ చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రకృతి విపత్తుల వల్ల ప్రతీ యేటా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతున్నప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో అందుకోసం ఎలాంటి నిధులూ కేటాయించకపోవటం అత్యంత దారుణం. వరి, పత్తి, సోయా, పప్పులు, వేరుశనగ లాంటి పంటలు చీడపీడలతోపాటు విపత్తుల వల్ల తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఫలితంగా వాటి దిగుబడులు ఏడాదికేడాది తగ్గిపోతున్నాయి. దీనిపై బీజేపీ సర్కారు కనీస సోయి లేకపోవటం శోచనీయం. ఇదే సమయంలో భారీ వర్షాలు, తుపాన్లు, వరదలు, కరువు కాటకాలు, ప్రకృతి విపత్తులకు సంబంధించిన నిధుల్లో అత్యధికం గుజరాత్‌కు తరలిపోతున్నాయి. ఇతర రాష్ట్రాల గురించి కేంద్రం కనీసం పట్టించుకున్న దాఖలాలు కనబడటం లేదు. గతంలో కేరళలో వరదలు సంభవించినప్పుడు, తెలంగాణను భారీ వర్షాలు ముంచెత్తినప్పుడు ప్రధానికి ఈ రెండు రాష్ట్రాలపై కనీస దయకలగకపోవటమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ.

వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల చిట్టా... బీజేపీ పాపాల పుట్ట ఇంతలా ఉంటే... ఇలాంటి వాస్తవాలన్నింటినీ పట్టించుకోని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుల వారు అదే పనిగా పనిగట్టుకుని రాష్ట్ర ప్రభుత్వంపై బట్ట కాల్చి మీదేయటం విజ్ఞత అనిపించుకోవటం లేదు. 'ముందు నీ ఇంటిని చక్కదిద్దుకున్న తర్వాత.. పక్కోడి ఇంటి గురించి మాట్లాడితే బావుంటుంది...' అనే విషయాన్ని ఆయన గుర్తెరగాలి. ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా, బాధ్యతగల పార్లమెంటు సభ్యుడిగా ఆయన రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవటానికి, పంట నష్టపరిహారం, రుణమాఫీలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, మద్దతు ధరలు ఇప్పించటానికి వీలుగా కేంద్రంపై పోరాడితేనే జనం హర్షిస్తారు. లేదంటే ఆయన మాటలకు ఎలాంటి విలువా ఉండబోదు.

ఇక రాష్ట్ర ప్రభుత్వం సైతం రైతులు, కౌలు రైతుల విషయంలో ఒక అంశాన్ని స్పష్టంగా గుర్తించాలి. 'వాస్తవ సాగుదారుడైన కౌలు రైతుకు పంట నష్ట పరిహారం ఇవ్వాలి...' అంటూ వామపక్షాలు సూచించిన నేపథ్యంలో సీఎం సానుకూలంగా స్పందించటం హర్షణీయం. అయితే అక్కడితో ఆగకుండా దుక్కి దున్ని, పంట పండించే అసలు సిసలైన కౌలు రైతును అన్ని విధాలా ఆదుకోవాలి. వారికి రైతు బంధు, రైతు బీమాను అమలు చేయాలి. అప్పుడే బీజేపీకి మరింత ధీటైన సమాధానం ఇవ్వగలరు.

సంపద సృష్టికర్తలకు పోరాటాలే మార్గం

> కుల, మత అస్థిత్వ రాజకీయాల ఆధారంగా బీజేపీ, శ్రామికుల మధ్య అనైక్యతను సృష్టిస్తుంది. భారత రాజ్యాంగానికి వ్యతిరేకమైన హిందూత్వ ఎజెండాను కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా అమలు చేస్తుంది. భారతీయ సమాజంలో హిందూత్వ ప్రాజెక్టును రుద్దేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్ని ఉపయోగిస్తున్నారు. రాజ్యాంగాన్ని అమలు చేసి, దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత గల వ్యక్తులే దానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకాశ్మీర్ విభజన లాంటి చర్యలు రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాల ఉల్లంఘనల్ని సూచిస్తాయి.

అఖిల భారత వ్యవసాయకార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభ, సీఐటీయూ నిర్వహిస్తున్న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీకి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు లక్షల సంఖ్యలో ఢిల్లీకి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మూడు సంఘాలు గత కొన్నేళ్ళుగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉమ్మడి పోరాటాల్ని నిర్వహిస్తున్నాయి. మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ ఒక కీలకమైన సమయంలో నిర్వహించబడుతుండడంతో ఈ ర్యాలీ చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. దీన్ని విజయవంతం చేయడానికి పాదయాత్రలు, ఇంటింటి ప్రచారం, సైకిల్ జాతాలు, వీధి మీటింగులతో పాటు అనేక ఉమ్మడి కార్యక్రమాల ద్వారా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో భారీగా జరుగుతున్న ఏర్పాట్లలో మిలియన్ల సంఖ్యలో ప్రజలు భాగస్వాములవుతున్నారు.



బి. వెంకట్

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని గత ప్రభుత్వాలు అమలు చేసిన ప్రజావ్యతిరేక విధానాలు ప్రజల్లో అసంతృప్తిని మిగిల్చాయి. పెట్టుబడిదారీ విధానం లక్షణమైన అవినీతి చాలా విశృంఖలంగా ఉండేది. ఈ పరిస్థితుల్ని అవకాశంగా తీసుకొని, పెద్ద ఎత్తున వాగ్దానాలు చేసి బీజేపీ అధికారం చేజిక్కించుకుంది, నరేంద్రమోడీ ప్రధాని అయ్యాడు. అయితే, బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవే నయా ఉదారవాద విధానాలను కొనసాగించడమే కాక వాటి అమలును కూడా వేగవంతం చేస్తుంది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టుబడి ఉండేందుకు ప్రయత్నం చేస్తుంది, ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి కష్టకాలంలో నయా ఉదారవాద విధానాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం ముమ్మరం చేసింది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో సమాజంలోని భిన్న వర్గాల ప్రజా సమస్యలు, డిమాండ్లు లేవనెత్తబడ్డాయి. బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం సాధించడంతో పాటు స్వాతంత్ర్యోద్యమ నాయకులు ప్రజాసమస్యలకు స్వాతంత్ర్య భారతదేశంలో వాటికి పరిష్కారాల్ని కూడా చర్చించారు. ఈ చర్చ భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో సహాయపడింది. ఈ రాజ్యాంగం స్వాతంత్ర్యోద్యమ విలువల్ని వారసత్వంగా పొంది, సమానత్వ సూత్రాల ఆధారంగా దేశాన్ని నిర్మించే వాగ్దానం చేసింది. ఈ సందర్భంగానే స్వాతంత్ర్యం తరువాత అనేక చట్టాలు, సంస్థలు, పథకాలు అభివృద్ధి చేయబడ్డాయి. కానీ అవి నిజమైన స్ఫూర్తితో అమలు చేయబడలేదు. అయినప్పటికీ, మన హక్కులు రాత రూపంలో రాజ్యాంగం ద్వారా సాధించాం, ఆ రాజ్యాంగమే మన పోరాటాలకు ఆధారం. కార్మికవర్గం, రైతాంగం, గ్రామీణ కూలీల సంరక్షణ హామీ కోసం అనేక చట్టాలు చేశారు. సాంఘిక సంక్షేమ రాజ్య నిర్మాణాన్ని నెలకొల్పారు. అయితే కార్మికవర్గ సంరక్షణా చట్టాల్ని నీరుగార్చే క్రమంలో బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్యోద్యమ విలువలకు వ్యతిరేకంగా పని చేస్తూ, సాంఘిక సంక్షేమ రాజ్య నిర్మాణాన్ని ధ్వంసం చేస్తుంది. ఈ బీజేపీ ప్రభుత్వం డెబ్బై సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశం సాధించిన అభివృద్ధిని నాశనం చేస్తూ, భారతదేశ కార్మికవర్గం చెమటోడ్చి నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థల్ని కారుచౌకగా అమ్ముతుంది.

బీజేపీ ప్రభుత్వ కార్పోరేట్ అనుకూల విధానాలు శ్రామికులకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఓవైపు కార్పొరేట్లు అధిక లాభాల్ని గడిస్తుంటే సామాన్య ప్రజలు పొట్టకూటి కోసం పోరాటాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా నిరంతర వ్యవసాయ సంక్షోభం, భారీ స్థాయిలో నిరుద్యోగం నెలకొనడంతో దినసరి కూలీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితికి నెట్టబడ్డారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో, 2021 లెక్కల ప్రకారం వ్యవసాయ రంగంలో పని చేస్తున్న 10,881 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 2014 నుండి దినసరి వేతన జీవుల ఆత్మహత్యలు క్రమంగా పెరుగుతూవచ్చాయి. 2021లో నమోదైన 1,64,033 మంది ఆత్మహత్యా బాధితుల్లోని ప్రతీ నలుగురిలో ఒకరు దినసరి వేతన కూలీ అని ఎన్సీఆర్బీ తాజా నివేదిక పేర్కొంది.

బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, భారత ప్రజల ఆస్తులైన ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రయివేట్ కంపెనీలకు దారాదత్తం చేస్తుంది. దానితోపాటు సాంఘిక సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయడం లేదు. ఎంఎన్ఆర్ఈజీఏకు నిధుల కోతను ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎంఎన్ఆర్ఈజీఏకు 2.72లక్షల కోట్ల రూపాయల కేటాయింపు డిమాండ్ ఉండగా ప్రభుత్వం నేరపూరితంగా కేవలం 60 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది. ఇది 2023 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ 98 వేల కోట్ల రూపాయల కన్నా చాలా తక్కువ.

మోడీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని కార్పొరేట్ శక్తులు లూటీ చేయడానికి అవకాశం కల్పిస్తూ అనేక చట్టాల్ని సవరించడం లేదా కొత్తగా చట్టాల్ని తెస్తుంది. ప్రస్తుత కార్మిక చట్టాల్ని నీరుగార్చేందుకు, దారి మళ్ళించడానికి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు, ప్రభుత్వం నుండి ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేకుండా కార్మికవర్గాన్ని దోపిడీ చేయడానికి కార్పొరేట్లకు కల్పించే పూర్తి స్వేచ్ఛ తప్ప మరొకటి కాదు. మూడు వ్యవసాయ చట్టాల్ని కూడా ఇలాంటి లక్ష్యంతోనే తెచ్చారు.ఇది వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ల ప్రవేశానికి చేసే ప్రయత్నమే. ప్రజాపంపిణీ వ్యవస్థను నాశనం చేసి, కార్పొరేట్లకు ఆహార మార్కెట్‌ను తెరవడమే ఈ కొత్త చట్టాల లక్ష్యం.

శ్రామికులు స్వాతంత్ర్యోద్యమం సాధించిన విజయాలను ఎలా కోల్పోతున్నారో చెప్పడానికి గడిచిన కొన్ని దశాబ్దాల్లో భూసంస్కరణలు ఎలా తలకిందులయ్యాయో ఉదాహరణగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యోద్యమ పోరాటానికి మిలియన్ల సంఖ్యలో గ్రామీణ శ్రామికుల్ని ఆకర్షించిన స్వాతంత్ర్యోద్యమ ప్రధాన నినాదాల్లో "దున్నే వానికి భూమి" నినాదం ఒకటి. అయితే స్వాతంత్ర్యానంతరం పాలకవర్గం ప్రజల్ని వంచించింది. కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపుర, జమ్మూకాశ్మీర్ మినహా దేశంలో ఎక్కడా భూసంస్కరణల్ని అమలు చేయలేదు.



నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా భారతీయ సమాజంలో అసమానతలు పెరుగుతున్నాయి. ధనవంతులు, కార్పొరేషన్లు మరింత ధనవంతులుగా మారుతుంటే పేద ప్రజలు బతుకుదెరువుకు అవసరమయ్యే వేతనాల కోసం పోరాటాలు చేస్తున్నారు. ప్రాథమిక ప్రభుత్వ సేవలు,విద్య,వైద్యంలోకి వారికి ప్రవేశం లేకుండా పోయింది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం భారతదేశ సంపదలో 40శాతం పైగా, జనాభాలోని కేవలం 1శాతం మంది చేతిలో కేంద్రీకృతమై ఉంది. మన దేశంలో 10మంది సంపన్నుల సంపద 2022లో 27.52 లక్షల కోట్లు పెరిగింది. దీనికి భిన్నంగా జనాభాలో దిగువనున్న 50శాతం ప్రజలు, మొత్తం సంపదలో కేవలం 3శాతం సంపద మాత్రమే కలిగి ఉన్నారు. 2021లో 102 మందిగా ఉన్న బిలియనీర్ల సంఖ్య 2022 నాటికి 166కి పెరిగింది. ప్రపంచంలోనే అధికంగా దాదాపు 23కోట్ల మంది ప్రజలు భారతదేశంలో పేదరికంలో జీవిస్తున్నారు. పైనున్న 10శాతం వారితో పోలిస్తే, దిగువనున్న 50శాతం మంది ప్రజలు, 10శాతం వారు చెల్లించే పన్నుల కన్నా 6 రెట్లు పరోక్ష పన్నులు చెల్లిస్తున్నారని, ఆహారం, ఆహారేతర నిత్యావసరాల నుండి వసూలైన మొత్తం పన్నుల్లో దిగువనున్న 50శాతం ప్రజలు చెల్లించే మొత్తం 64.3శాతంగా ఉంది.

అదేవిధంగా దేశంలో అన్ని రంగాలు దాడికి గురవుతున్నాయి. కుల, మత అస్థిత్వ రాజకీయాల ఆధారంగా బీజేపీ, శ్రామికుల మధ్య అనైక్యతను సృష్టిస్తుంది. భారత రాజ్యాంగానికి వ్యతిరేకమైన హిందూత్వ ఎజెండాను కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా అమలు చేస్తుంది. భారతీయ సమాజంలో హిందూత్వ ప్రాజెక్టును రుద్దేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్ని ఉపయోగిస్తున్నారు. రాజ్యాంగాన్ని అమలు చేసి, దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత గల వ్యక్తులే దానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకాశ్మీర్ విభజన లాంటి చర్యలు రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాల ఉల్లంఘనల్ని సూచిస్తాయి.

మైనారిటీలు, దళితులు, గిరిజనులే లక్ష్యంగా నిత్యం హింసలకు పాల్పడుతున్నారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న ప్రభుత్వ పెద్దలు పథకం ప్రకారం ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. మనుస్మృతి ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి దళితులకు వ్యతిరేకంగా ఒక క్రమపద్ధతిలో హింసను సృష్టిస్తున్నారు. దళితులకు వ్యతిరేకంగా నమోదవుతున్న నేరాల సంఖ్య పెరుగుదలలో ఇది ప్రతిబింబిస్తుంది. రిజర్వేషన్లపై కూడా తీవ్రమైన దాడి జరుగుతుంది. అణగారిన వర్గాల వారికి చేసే బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధిస్తున్నారు. మతోన్మాద, కులోన్మాద హింసలకు బాధ్యులైన వ్యక్తులు వీధుల్లో స్వేచ్ఛగా విహరించడమే కాక వారి చర్యల్ని సమర్థిస్తూ, బహిరంగ వేదికలపై వారిని సన్మానిస్తున్నారు. సమాజంలో అణగారిన వర్గాల వారికి అభద్రతా భావాన్ని కలిగించే విధంగా దేశంలో ద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

వ్యవసాయరంగ నిరంతర సంక్షోభం వ్యవసాయ కార్మికుల్ని కష్టాల పాల్జేస్తుంది. కొనసాగుతున్న ఈ వ్యవసాయ సంక్షోభం చిన్న సన్నకారు రైతులు వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితుల్లోకి నెట్టివేస్తుంది. కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వ్యవసాయ పనిదినాల సంఖ్య గణనీయంగా తగ్గాయి. ఫలితంగా వ్యవసాయ కార్మికుల్లో నిరుద్యోగం పెరిగి, గ్రామీణ నిరుద్యోగులు, ఇతర పేదలు వలస పోతున్నారు. ఆర్థిక సంక్షోభం ఫలితంగా మందగించిన పారిశ్రామిక వృద్ధి ఈ ప్రజలకు ప్రత్యామ్నాయ గ్రామీణ, పట్టణ ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైంది. వ్యవసాయకార్మికుల నిజ వేతనాలు కాలానుగుణంగా పెరగడం లేదు. ఇంతకు ముందు పేర్కొన్నట్లు, నయా ఉదారవాద విధానాల ప్రభావం వల్ల భూమిలేని, ఇళ్ళులేని వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సాంఘిక సంక్షేమ రాజ్యం క్షీణించడంతో వ్యవసాయ కార్మికుల జీవితాలు మరింత అనిశ్చితంగా, అభద్రతగా మారుతున్నాయి. వ్యవసాయ కార్మికులకు తగిన పని, సరైన పని పరిస్థితులు, వేతనాలు, సామాజిక భద్రతా చర్యలకు హామీ ఇచ్చే సమగ్ర కేంద్ర చట్ట రూపంలో ఓ చట్టబద్ధమైన భద్రత కోసం డిమాండ్ చేసే కీలక సమయమిది. వ్యవసాయ కార్మికుల ఉనికి కోసం పోరాటం చేయడం తప్ప వేరే మార్గం లేదు.

ఇలాంటి పరిస్థితుల్లో మన జీవనాధారాల్ని కాపాడుకోవడమే కాక లౌకిక, ప్రజాస్వామ్య, భిన్నత్వంతో కూడిన భారతదేశాన్ని కూడా రక్షించుకోవడం మనందరి బాధ్యత. ఇవే ప్రస్తుతం కార్మికవర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్ళు. సామాజిక సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్య పోరాటాలే దీనికి సరైన సమాధానం.

- అనువాదం:బోడపట్ల రవీందర్, 9848412451



పేపర్ లీకేజీలతో పేద విద్యార్థుల భవిష్యత్ లాక్

కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాలు సాధించి, తమ కలలను సాకారం చేసుకోవాలనుకున్న నిరుద్యోగుల ఆశలు ఆవిరైపోయాయి. నాడు స్వరాష్ట్ర సాధన కోసం అగ్రభాగాన ఉండి పోరాడిన నిరుద్యోగులు, విద్యార్థులు నేడు సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కూడా పోరాడుతున్నారు. తెలంగాణ సాకారమైతే మా నీళ్ళు మాకే, మా నిధులు మాకే, మా నియామకాలు మాకే అంటూ కేంద్రంతో ఆత్మహత్యల యుద్ధం చేసిన యువత, నేడు ఉద్యోగాలు భర్తీ ప్రక్రియ చేస్తారో లేదో అనే ఆందోళనలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో నీళ్ళు, నిధులు, నియామకాలు అనే ఎజెండాలో నియామకాలు అనే నినాదాన్ని ప్రధాన ఎజెండాగా చర్చ జరిగేలా చేసింది విద్యార్థులే. ఎంతలా అంటే ఉమ్మడి రాష్ట్రంలో నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్ విడుదల చేస్తే 'మా తెలంగాణ వచ్చినంకా పరీక్షలు రాసి మా రాష్ట్రంలో మేమే ఉద్యోగాలు చేస్తామని' వాటిని బహిష్కరించేంతగా విద్యార్థులు నియామకాలను ఉద్యమ ఎజెండా చేశారు.

తెలంగాణ రాష్ట్రం సాధించినంక ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న విద్యార్థులకు స్వరాష్ట్రంలో కనీసం ఉద్యోగాలు ఎలా భర్తీ చేయాలో ప్రణాళికలు లేకుండా తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ పనిచేసింది. జాబ్ క్యాలెండర్ లేదు. గ్రూప్స్ స్థాయి పోస్టుల భర్తీ లేదు. ఘంటా చక్రపాణి చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన గ్రూప్-2 కూడా అనేక వివాదాల నడుమ కోర్ట్ మెట్లెక్కింది. గత 8 ఏండ్లు నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు 165 ఇస్తే టీఎస్‌పీఎస్సీ ద్వారా 145 నోటిఫికేషన్లు ఇచ్చారు. వాటిలో 109 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్స్, 46 డిపార్టమెంటల్ రిక్రూట్మెంట్స్ నోటిఫికేషన్లు, వీటిలో భర్తీ చేసింది కేవలం సుమారుగా 79 వేల పోస్టులు మాత్రమే. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. చేసిన ఒక్క నోటిఫికేషన్ కూడా పేపర్ లీకేజీల పేరుతో రద్దైంది. మనతో పాటు విడిపోయిన ఆంధ్ర రాష్ట్రంలో రెండు సార్లు గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తే మనరాష్ట్రంలో ఒక్కటి నిర్వహించలేదు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి సర్వీస్ కమిషన్‌ని దేశంలో ఎక్కడలేని విధంగా తీర్చిదిద్దుతామనీ, యూపీఎస్సీ మాదిరి క్యాలెండర్ ఇయర్ అమలు చేస్తామనీ పలికిన ప్రగల్భాలు నీటి మూటలే అయ్యాయి. కనీసం ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలేని స్థితిలో సర్వీస్ కమిషన్ ఉంది. అసెంబ్లీలో సాక్షతూ ముఖ్యమంత్రి శుభవార్త చెబుతున్న అని చేసిన ప్రకటన కూడా నేరవేర్చకుండానే రద్దై పోయాయి.



టి. నాగరాజు
9490098292

పరీక్షలు నిర్వహణలో అతి ముఖ్యమైనది పేపర్ల తయారీ, ప్రింటింగ్, భద్రపర్చడం సాధారణంగా పాఠశాల స్థాయిలో జరిగే పరీక్షలు, ఎంట్రన్స్ పరీక్షలకే అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహణ ఉంటుంది. కానీ రాష్ట్ర స్థాయిలో అత్యంత ముఖ్యమైన పరీక్ష నిర్వహణలో చాలా నిర్లక్ష్యంగా కమిషన్ చైర్మన్ ఉన్నారు. ఎవరికి తెలియ పర్చకూడని కాన్ఫడెన్సియల్ విభాగం పనులు సాధరణ సెక్షన్ ఆఫీసర్‌గా బాధ్యతలు చూసే వ్యక్తికి పేపర్లు పోల్డర్‌లో ఉంటాయో కూడా తెలిసి దొంగలించేంత నిర్లక్ష్యంగా కమిషన్ ఉందంటే వారికి ఈ రాష్ట్ర నిరుద్యోగుల పట్ల, ఉద్యోగాల భర్తీ పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. పరీక్ష ఆన్‌లైన్ కాకుండా భౌతికంగా జరిగితే కమిషన్ చైర్మెన్‌కు పేపర్ ఇతర రాష్ట్రాల నుండి ఎంచుకున్న పేపర్ సెట్టర్స్ 3 పేపర్లను సీల్డ్ కవర్‌లో పంపితే వాటిలో రెండింటిని కమిషన్ చైర్మన్ పేపర్ చూడకుండా ఎంచుకోని కేంద్ర ప్రభుత్వ ఆథరైజిడ్ ప్రింటింగ్ కేంద్రాలకు పంపి అక్కడ పేపర్ ఓపెన్ చేసి పరీక్ష ముందు డైరెక్ట్‌గా జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు పంపాలి. అదే కంప్యూటర్ టెస్టు అయితే ఇతర రాష్ట్ర పేపర్ సెట్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించుకోని చైర్మన్ తన అధీనంలో ఉండే ల్యాప్ ట్యాప్, లేదా కంప్యూటర్లోకి పాస్ వర్డ్ పెట్టుకుని తన దగ్గరే భద్రంగా ఉంచుకుని పరీక్ష రోజు మాత్రమే ఓపెన్ చేయాలి. ఇన్ని పద్ధతులు పాటించాల్సిన దగ్గర తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పని చేస్తున్న చిన్నస్థాయి ఉద్యోగికి ఎలా పాస్‌వర్డ్ తెలిసింది. అతను కంప్యూటర్ లోనుండి పేపర్ ఎత్తుకెళ్ళిన గమనించలేని స్థితిలో కమిషన్ ఉందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

నేడు తెలంగాణలో ఉన్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ కాస్త పర్సనల్ సర్వీస్ కమిషన్‌గా మారింది. ఉద్యోగాలు భారీగా భర్తీ చేస్తాం అని ప్రకటించిన ప్రభుత్వం అసలు ఉద్యోగాలు భర్తీ చేసే కమిషన్‌లో ఉద్యోగాలు భర్తీ చేయడంలేదు. టీఎస్‌పిఎస్‌లో 450 శాంక్షన్ పోస్టులు ఉండే దగ్గర కేవలం 125పోస్టులు ఉన్నాయి. అందులో 82 మంది రెగ్యూలర్ ఉద్యోగులు. 20 మంది మాత్రమే ఆఫీసర్ స్థాయి ఉద్యోగులు ఉన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం తెలంగాణ వచ్చినంకనే మొదటిసారి 23వేల ఉద్యోగాలకు భారీ నోటిఫికేషన్లు ఇచ్చింది. ఇక్కడ ఉన్న ఉద్యోగులు న్యాయ, ఇతర పనులు చూసుకోవడానికే సమయం సరిపోతుంటే పరీక్షలు పారదర్శకంగా జరగడానికి అవకాశం ఎలా ఉంటుంది. ఇక్కడ ఉద్యోగులు లేకుండా ఎలా భర్తీ చేసే పక్రియ అమలవుతుంది. దేశంలోనే నెం.1 సర్వీస్ కమిషన్ అయితే మరీ దీనిపై దృష్టి ఏది? వీటి గురించి ఎనాడు మాట్లడరు. ఎవరు స్పందించరు. కింది స్థాయి ఉద్యోగులే పై స్థాయి అధికారి పని చేస్తుంటే అనేకతప్పులు దొర్లుతున్న ప్రభుత్వం పట్టించునే స్థితిలో లేదు.

గర్భసంస్కారాలు - ఒక పరిశీలన

'గర్భ సంస్కార్' పేరిట గర్భిణులకు శిక్షణ ఇవ్వడం ద్వారా పుట్టబోయే పిల్లలకు దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు ఏర్పడతాయన్న ప్రచారం గత కొద్ది సంవత్స రాలుగా మన దేశంలో సాగుతోంది. అందుకోసం శిక్షణా శిబిరాలు కూడా వెలుస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఈ నెల 5వ తేదీన... ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ "సంవర్ధిని న్యాస్"... ఢిల్లీలోని జేఎన్‌యూ (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటి)లో "గర్భ సంస్కార్" పేరిట ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో కొందరు గైనకాలజిస్టులు, ఆయుర్వేద వైద్యులు కూడా పాల్గొన్నారు. దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం పెంపొందాలంటే మహిళలు తమ గర్భధారణ సమయంలోనే భగవద్గీత, రామాయణ శ్లోకాలు పఠించాలని 'సంవర్ధిని న్యాస్' జాతీయ కార్యదర్శి మాధురి మరాఠే ఉద్బోధించారు. ఈ పఠనం వలన తల్లి గర్భంలోని శిశువుకు భారతీయ సాంస్కృతిక విలువలు అలవడతాయని ఆమె వ్యాఖ్యానించారు. గర్భధారణ సమయంలో ఇలాంటి గీతాలాపన చేయడం వలన గర్భస్థ శిశువులోని డీఎన్ఎ (జన్యువు)లో మార్పులు జరుగుతాయని కూడా కొందరు వక్తలు వ్యాఖ్యానించారు. మరికొందరు వక్తలు సంస్కృత శ్లోకాలు చదవడం వలన తల్లి గర్భాశయం, శిశువు మెదడు ప్రక్షాళన చేయబడతాయని కూడా వ్యాఖ్యానించారు. ప్రతి సంవత్సరం వెయ్యి మంది గర్భిణీలకు గర్భ సంస్కార్ శిక్షణ గరపాలని అక్కడ హాజరైనవారు తీర్మానించారు.

దేశమంతటా గర్భిణులు అవలంబించాలంటూ ప్రవచించబడుతున్న ఈ "గర్భ సంస్కార్" సిద్ధాంతానికి ఉన్న శాస్త్రీయత ఏమిటనేది పరిశీలించాల్సి ఉంది. కొన్ని అంశాల ప్రాతిపదికగా దీనికి సమాధానాలు వెతికే ప్రయత్నం చేయాలి.

గర్భస్థ శిశువుకు వినికిడి శక్తి ఎప్పుడు వస్తుంది?

వైద్య శాస్త్ర పరిజ్ఞానం ప్రకారం అండం, శుక్ర కణం ఫలదీకరణ చెందిన నాటి నుండి మొదటి ఎనిమిది వారాలు పూర్తయ్యేసరికి అన్ని ముఖ్య అవయవాలు ప్రాథమికంగా ఏర్పడతాయి. ఈ మొదటి ఎనిమిది వారాల కాలాన్ని "పిండం" (ఎంబ్రియో)గా పరిగణిస్తారు. తొమ్మిదో వారం నుండి శిశుజననం వరకూ ఉండే కాలాన్ని "శిశువు" (ఫీటస్)గా పరిగణిస్తారు. తల్లి గర్భంలో 22 నుండి 24 వారాల సమయంలో గర్భం బయట తల్లి శరీరంలో రక్తనాళాల్లోని రక్త ప్రసరణ, శ్వాస ప్రక్రియ వంటి 'లో ఫ్రీక్వెన్సీ' శబ్దాలను శిశువు వినగలగడం ప్రారంభమవుతుంది. 25 వారా ల తర్వాత వినికిడి శక్తి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే ప్రక్రియ కొనసాగుతుంది.



డాక్టర్ కె. శివబాబు

ఎపిజెనెటిక్స్ అంటే ఏమిటి?

అండం ఫలదీకరణం చెందిన తొలి రోజుల నుండి పిండ దశ పూర్తయ్యే మొదటి 8వారాల పాటు బాహ్య కారకాల ప్రభావం గర్భంలో ఎదుగుతున్న పిండంపైన ఉంటుంది. ఉదాహరణకు తల్లికి మధుమేహం వ్యాధి లేదా స్థూలకాయం లేదా మానసిక వ్యాధి ఉన్నప్పుడు, తల్లి తినే ఆహారంలో లేదా పరిసర వాతావరణంలో అననుకూల పరిస్థితులు లేదా ప్రమాదకరమైన ఔషధాలు లేదా రసాయనాల ప్రభావం పడ్డప్పుడు పిండంలోని డిఎన్ఎ మిథిలేషన్ వంటి ప్రక్రియలలో మార్పులు జరిగే అవకాశం ఉంది. వీటిని ఎపిజెనెటిక్ మార్పులుగా వైద్య పరిభాషలో పేర్కొంటారు. తత్ఫలితంగా జీన్స్ వ్యక్తీకరణలో జరిగే మార్పుల ప్రభావం శిశువు జన్మించిన తర్వాత పెరిగి పెద్దయ్యాక కూడా ఉంటుందని వైద్య శాస్త్ర అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఎపిజెనోమ్ ఫలితంగా జీన్స్ వ్యక్తీకరణలో మాత్రమే మార్పులు జరుగుతాయి తప్పితే డి.ఎన్.ఎ నిర్మాణం (సీక్వెన్స్)లో కాదనే విషయం గుర్తించాలి.

శ్లోకాలు, మంత్రోచ్ఛారణ శబ్దాలు శిశువుకు వినపడి ఎపిజెనెటిక్ మార్పులు జరుగుతాయా?

ఫలదీకరణం పూర్తయిన తొలి రోజుల నుండి మొదటి 8వారాల పిండ దశలోనే బాహ్య కారకాల వలన సంభవించే ఎపిజెనెటిక్ మార్పులు చోటుచేసుకుంటాయని ఇంతకుముందే తెలుసుకున్నాం. కాబట్టి ఈ దశలోనే జెనెటిక్ ప్రోగ్రామింగ్ పూర్తవుతుంది. గర్భస్థ శిశువు శ్లోకాలు, మంత్రోచ్చారణ లాంటి బాహ్య శబ్దాలను వినగలగడం 25 వారాల తర్వాత మొదలవుతుందని తెలుసుకున్నాం.



వాదన కోసం... శ్లోకాలు లేదా మంత్రోచ్చారణ వంటి బాహ్య శబ్దాల వలన ఎపిజెనెటిక్ మార్పులు జరిగే అవకాశం ఉన్నదని అనుకుందాం. గర్భస్థ శిశువు 25వారాలు పూర్తయిన తర్వాత మాత్రమే శ్లోకాలు లేదా మంత్రోచ్చారణ లాంటి బాహ్య శబ్దాలను వినగల్గి నప్పుడు, మొదటి 8వారాలలోపు పూర్తయ్యే ఎపిజెనెటిక్ మార్పులు తర్వాత కాలంలో జరగడం సాధ్యం కాదు కదా! ఆ దశలో బాహ్య శబ్దాలకూ లేదా తల్లి పలుకులకూ, కదలికలకూ స్పందనగా గర్భస్థ శిశువు కదలికలు చోటుచేసుకోవడం మాత్రమే జరుగుతుంది.

మంత్రోచ్చారణలు, మత గ్రంథ పఠనాలతో దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు ఏర్పడతాయా?

దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు అనే అంశాలు మన దేశంలోనే కాదు... ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ అత్యంత ఆవశ్యకమైనవి. అలాగే ఈ సద్భావనలు దేశంలోని అన్ని మతాల, కులాల ప్రజలలో పెంపొందించబడాలి. ఆయా దేశాల్లో నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, లింగ వైరుధ్యాలను బట్టి వ్యక్తుల ప్రతిస్పందనలు రూపొందుతాయి. అలాగే తల్లిదండ్రుల పెంపకం, ఉపాధ్యాయుల బోధనలో విలువలు, పరిసరాలు, సాహచర్యం ప్రభావం, ఆయా దేశాల్లో అమలయ్యే నియమ నిబంధనలు, సాంప్రదాయాలు, చట్టాలు వంటి అంశాలన్నీ వ్యక్తుల సంస్కారం, ప్రవర్తన రూపొందడంలో ముఖ్య పాత్ర వహిస్తాయి.

ఏ దేశంలో అయినా, ఏ మతానికి చెందిన వారైనా, వాళ్ల వ్యక్తిగత విశ్వాసాల వలన ఆయా మత గ్రంథాలను పఠించినప్పుడు, ఆయా పద్యాలు లేదా సూక్తులు ఉచ్చరించినప్పుడు వారి మనసు ప్రశాంతంగా ఉండటం, వారికి స్వాంతన కలగడం సహజమే. ఇంపైన, మధురమైన సంగీతానికి మానసిక అలజడిని తగ్గించే స్వభావం ఉన్నదన్న విషయాన్ని ఎవరూ కాదనలేరు. అందుకే మనం వాడుక పరిభాషలో "సంగీతంలో ఓలలాడారు, పారవశ్యం చెందారు" అంటుంటాం. బాధలు మరచి పారవశ్యం చెందేలా చేయగల్గిన ఏ మతంలోని ఏ ప్రార్థనైనా, ఏ జానపద గీతమైనా, ఏ మెలొడియస్ రాగమైనా సగటు మనిషికి ఉపయోగమే. అందులోనూ విశ్వాసంతో కూడినప్పుడు ఖచ్చితంగా మేలు చేకూరుస్తుంది. మనిషి ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నప్పుడు డోపమిన్, ఎండార్ఫిన్స్ వంటి హార్మోన్లు విడుదలై ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకానీ ఆ పేరిట మతగ్రంథాలు పఠిస్తే, శ్లోకాలు వల్లిస్తే దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు ఏర్పడతాయనీ, డి.ఎన్.ఎ.లో మార్పులు జరుగుతాయనీ సిద్ధాంతీకరించడం అశాస్త్రీయం, కుట్రపూరితం. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాల్ని తణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి అమరవీరులు తమ తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఏ గర్భ సంస్కారాలు చేయించుకున్నారు? స్త్రీల హక్కుల్ని కాపాడే బిల్లును ఆమోదించనందుకు నిరసనగా కేంద్ర న్యాయశాఖామంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయుడు బి.ఆర్.అంబేద్కర్ తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఏ మతగ్రంథాల పఠనం గావించారు?

గర్భధారణ సమయంలో ఏం చేయాలని వైద్యశాస్త్రం చెప్తోంది?

గర్భధారణ సమయంలో మానసికంగా ప్రశాంతంగా ఉండటం, అవసరమైన మేరకు తేలికపాటి వ్యాయామం చేయడం, చెవులకు ఇంపైన, మృదువైన సంగీతం వినడం, పాజిటివ్ ఆలోచనలు కలిగివుండటం, పజిల్స్ పూరించడం, ప్రకృతిలో గడపడం, మంచి విషయాలు మాట్లాడటం, సమతుల ఆహారం తీసుకోవడం, కాలుష్య రసాయనాలకు, కల్తీ ఔషధాలకు దూరంగా ఉండటం... వంటి అన్ని అంశాలు పాటించాలనీ, తద్వారా తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్యానికి కూడా సానుకూల ఫలితాలు కల్గుతాయనీ ఎప్పటి నుండో వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇవన్నీ శాస్త్రీయమైనవి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు ఏ మత గ్రంథాల పఠనంతోనూ, గర్భ సంస్కారాలతోనూ సంబంధం లేదు.

వ్యక్తి సంస్కారం, ప్రవర్తనలు రూపొందడంలో కీలకమైన అనేక అంశాల్ని కావాలని పక్కకు పెట్టి... రుజువు చేయలేని, శాస్త్ర విజ్ఞాన ప్రాతిపదిక లేని సంకుచిత భావోద్వేగాలతో మిళితమైన సిద్ధాంతాల్ని ప్రజలందరి పైనా రుద్దడానికి ప్రయత్నించడం వెనుక విభజన రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనేది సుస్పష్టం. సైన్సు పురోగతితో స్వేచ్ఛ, సమానత్వం, విశాల దృక్పథం కల్గిన ఆరోగ్యకరమైన సమాజం రావాలని ఆశించే ప్రజాహితులందరూ ఇలాంటి అశాస్త్రీయ తిరోగమన సిద్ధాంతాల్ని తిప్పికొట్టాల్సి ఉంది.

స్త్రీ శక్తికి చిహ్నం గులాబీ దండు



గులాబీ దండు సభ్యులు గులాబీ రంగు చీరలు ధరించి, చేతిలో గులాబీ లాఠీతో అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతూ 2006లో యుపీలోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని బందా జిల్లాలో గృహ హింసతో పాటు మహిళలపై జరుగుతున్న వివిధ రకాల హింసకు వ్యతిరేకంగా, ప్రతిస్పందనగా ఈ గులాబీ దండు ముందుకు వచ్చింది. వారి పోరాటాని చిహ్నంగా వారు ధరించే గులాబీ రంగుకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. సమకాలీన డిజైన్లకు కేరాఫ్ అడ్రస్‌గా గుర్తించబడిన లండన్ మ్యూజియం గులాబీ గ్యాంగ్ ధరించే 'పింక్ చీర'ను ఈ ఏడాది సోదరీమణుల కథగా జరుపుకోవడానికి సిద్ధమవుతుంది.

శతాబ్దాలుగా భారతీయ మహిళ వ్యక్తిత్వాన్ని సూచించే గులాబీ రంగు ఆరు గజాల తెరపై స్త్రీ శక్తిగా సమ్మిళితం చేయబడుతుంది. ఈ ఏడాది మేలో ప్రారంభం కానున్న డిజైన్ మ్యూజియం ఆఫ్ లండన్‌లో భారతీయ ఫ్యాషన్‌పై నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌లో 'గులాబీ గ్యాంగ్' అనే మహిళా విజిలెంట్ గ్రూప్ పింక్ చీరను వారి పోరాటానికి గుర్తుగా "ఆఫ్‌బీట్ చీర"గా ప్రదర్శించడానికి ఎంపిక చేశారు.

11 లక్షల మంది సభ్యులతో...

సంపత్ పాల్ దేవి ప్రారంభించిన ఈ అసాధారణ మహిళా ఉద్యమం ఇప్పుడు అంతర్జాతీయ ఖ్యాతి పొందిన సంస్థగా మారింది. "ఇప్పుడు మేము ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాము. మహిళల హక్కుల కోసం పోరాడుతున్న మా ప్రయత్నాలను గుర్తించిన మొదటి విదేశీ దేశం ఫ్రాన్స్. వారు 2008లో నన్ను ఆహ్వానించారు. ప్రస్తుతం 18-60 ఏండ్ల లోపు 11 లక్షల మంది సభ్యులతో కూడిన సంస్థగా మేము ఎదిగాము. మహిళలపై ఎక్కడ హింస జరిగినా మా దండు అక్కడ ప్రత్యక్షమవుతుంది" అని సంపత్ పాల్ దేవి చెప్పారు. ఫోన్.

ప్రతిఘటనకు గుర్తుగా...

ఈసారి డిజైన్ మ్యూజియంలో ప్రదర్శన కోసం తన సంస్థ సంతకమైన 'పింక్ చీర', బ్లౌజ్, పెటికోట్‌తో పాటు గులాబీ లాఠీని కొరియర్ ద్వారా లండన్‌కు పంపుతున్నట్లు సంపత్ పాల్ దేవి చెప్పారు. లండన్‌లోని డిజైన్ మ్యూజియం సమకాలీన చీర వేడుకను జరుపుకోవడానికి మే నుండి సెప్టెంబర్, 2023 వరకు ప్రదర్శనను నిర్వహిస్తుంది. ప్రియా ఖంచందానీచే నిర్వహించబడిన ఈ ప్రదర్శనలో భారతదేశంలో హింసకు వ్యతిరేకంగా మహిళలు చేస్తున్న పోరాట నిర్వచనాలకు ఒక రూపకం వలె ఈ చీరను ప్రదర్శిస్తారు. అయితే ఈ-మెయిల్ ద్వారా గులాబీ గ్యాంగ్ వ్యవస్థాపకురాలు సంపత్ పాల్ దేవిని సంప్రదించిన ఖంచందానీ, చీర కూడా భారతీయ మహిళకు ఒక ప్రతిఘటన గుర్తుగా మారిందనడానికి ఉదాహరణగా గులాబీ దండుకు చెందిన ఒక పింక్ చీర'ని ఎగ్జిబిషన్ కోసం పంపమని కోరింది.



కర్రసాములో శిక్షణ తీసుకుంటున్న గులాబీ దండు

అమ్మ ఎందరికో ఆదర్శం

ఉద్యోగం రాలేదని, పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, అప్పుల బాధతో, తల్లిదండ్రులు మందలించారని ఇలా అనేక చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్న యువతకు ఈ అమ్మ ఆదర్శం... తన కుటుంబంలో ఒక్కరు తప్ప మిగిలిన వారందరూ వివిధ కారణాలతో మరణించారు. తాను కన్న పిల్లలు ఒక్కొక్కరుగా కంటి ముందే మరణిస్తుంటే భరించలేక పోయింది. కడుపు కోతను భరిస్తూ గుండె దిటవు చేసుకుంది. అక్షర జ్ఞానం కూడా లేని ఆమె తనకు ఎవరూ లేరని పిరికిదానిలా ఆత్మహత్య చేసుకోలేదు. ధైర్యంగా విధితో పోరాడుతోంది... ఈమె పేరు మాలోతు రాణి.



రాణి వయసు ప్రస్తుతం 65. అడ్డబట్ట తండా (అమీనాబాద్), (గ్రామం మండలం, చిన్నారావు పేట, వరంగల్ జిల్లాకు చెందిన ఆమెకు 14 ఏండ్లకే రాజు అనే వ్యక్తితో పెండ్లి జరిగింది. నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుర్లు. కానీ భర్త, నలుగురు కొడుకులు, ఒక బిడ్డ వివిధ కారణాలతో మరణించారు. అయినా ఆ బాధని భరిస్తూ ధైర్యంతో రోజంతా కష్టపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది. నలుగురు కొడుకుల్లో మొదటి కొడుకు ఏడాది వయసులోనే పసకలతో చనిపోయాడు. రెండవ కొడుకు 14 ఏండ్ల వయసులో గుండెజబ్బుతో మరణించాడు. మూడవ కొడుకు పెండ్లయిన తర్వాత 25 ఏండ్ల వయసులో లివర్ పాడవడంతో చనిపోయాడు. ఇక నాలుగవ కొడుకు పెండ్లి అయిన తర్వాత అత్త మామలు తిట్టడంతో విషం తాగి చనిపోయాడు.

మనువరాలి కోసం...

మూడో కొడుకు కూతురూ, తన మనమరాలికి ఆరోగ్యం బాలేక పోవడంతో తనకున్న రెండు ఎకరాల్లో ఎకరం అమ్మి ఆమెకు చికిత్స చేయించింది. ఇక ఆమె పెండ్లి ఉన్న ఎకరం అమ్మి పెండ్లి చేసింది. నలుగురు కొడుకులు చనిపోయిన తర్వాత భర్త కూడా అనారోగ్యంతో కన్నుమూశాడు. ఇక ఇద్దరు కూతుర్లలో పెద్ద కూతురు పెండ్లయిన తర్వాత భర్త తిట్టడంతో ఉరివేసుకొని మరణించింది. పెద్ద అల్లుడు కూడా చనిపోయాడు. చిన్న అల్లుడు కూడా రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఉన్న ఒక్కగానొక్క కూతురు ఒంటరిగా జీవితం వెల్లదిస్తుంది.

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తే...

65 ఏండ్ల వయసులోను ఇప్పటికీ ఆమె ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఆర్ట్స్ కాలేజ్ ముందు, 11 నుండి 3 గంటల వరకు హనుమకొండ అదాలత్ కోర్టు ముందు, తిరిగి నాలుగు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పబ్లిక్ గార్డెన్ ముందు సాక్స్‌లు, కర్చీఫ్‌లు అమ్ముకుంటూ బతుకుతుంది. అంటే దాదాపు రోజంతా కష్టపడుతూ ఉంటుంది. ఇలా అమ్మగా వచ్చిన డబ్బు మీకు సరిపోతుందా అంటే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్ తనకు 2000, తన కూతురికి 2000 వస్తున్నాయని వాటితో పాటు ఇలా అమ్ముకుంటూ జీవితం వెల్లదీస్తున్నానని కన్నీళ్లు పెట్టుకుంది. ఉండడానికి సొంత ఇల్లు కూడా లేని తల్లీ, బిడ్డలు చిన్న రేకుల షెడ్డులో కిరాయికి ఉంటున్నారు. ప్రభుత్వం సహకరించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పిస్తే బాగుంటుందని ఆమె ఆశ. లేదా ఎవరైనా దాతలు తనను ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటుంది.

– రాజు, హన్మకొండ రిపోర్టర్, నవతెలంగాణ

ముందస్తు జాగ్రత్తలు



చుట్టూ పిల్లలంతా ఉత్సాహంగా కనిపిస్తుంటే మన పిల్లలు మాత్రం నిత్యం అనారోగ్యంగా ఉండటం ఏ తల్లిదండ్రులకైనా బాధగానే ఉంటుంది. పోషకాహారాన్నిస్తున్నా ఎందుకిలా అవుతున్నారో చాలా మందికి తెలియదు. అయితే పిల్లలు తరచూ అనారోగ్యానికి గురికావడానికి కారణాలెన్నో అంటున్నారు నిపుణులు. వాతావరణం మారినప్పుడల్లా రకరకాల ఇన్‌ఫెక్షన్లు సోకుతుంటాయి.

వీటిని తట్టుకొనేలా పిల్లల్లో బాల్యం నుంచి పోషకాహారం అందించడం, పరిశుభ్రత అలవరచడంతో వ్యాధినిరోధక శక్తిని పెంచొచ్చు. జలుబు, దగ్గు, జ్వరం వంటివి పిల్లలకు తేలికగా ఇతరుల నుంచి వచ్చే అవకాశం ఉంటుంది. వీటిని కూడా చిన్నారుల దరిదాపులకు రాకుండా చేయాలంటే వారిలో వ్యాధితో పోరాడే శక్తిని నింపాలి. ఇందుకోసం ముందస్తు జాగ్రత్తచర్యలు తీసుకోవాలి. లేదంటే తరచూ పిల్లలు అనారోగ్యాలకు గురవుతూనే ఉంటారు.

- పిల్లల్లో అనారోగ్యాలకు జీవనశైలి ప్రధాన కారణమంటున్నారు నిపుణులు. ఆహారపుటలవాట్లు, నిద్రా వేళలు వంటివన్నీ ఆరోగ్యానికి అనుసంధానమై ఉంటాయి. బయటి ఆహారంపై ఆసక్తి, ఎక్కువగా గ్యాడ్జెట్ల వినియోగం, టీవీ ముందు గంటలతరబడి సమయం వెచ్చించడం, క్రీడలకు ప్రాధాన్యతనివ్వక శారీరక శ్రమ లేకపోవడం, నిద్రలేమి వంటివన్నీ చిన్నారులను బలహీనులుగా మారుస్తాయి. ఇలా కాకుండా ఉండాలంటే ఆహారం, నిద్రవేళల్లో సమయపాలన పాటించేలా చేయాలి. అప్పుడే వారిలో జీవక్రియలు సవ్యంగా సాగుతాయి. అవయవాలన్నీ ఆయా సమయానికి తగినట్లు పనితీరును మెరుగుపరుచుకుంటాయి. దీంతో వ్యాధినిరోధక శక్తి పెంపొంది, తరచూ అనారోగ్యాలు వారిపై దాడి చేయలేవు.
- తోటివారితో ఆడుకోవడానికి పిల్లలను ప్రోత్సహించాలి. దగ్గర్లోని ఈతకొలనులో శిక్షణ, లేదా బ్యాడ్‌మెంటన్, క్రికెట్ క్లబ్స్‌లో చేర్చడం మంచిది. సైక్లింగ్ అలవాటుగా మార్చాలి. ఒకేచోట కూర్చొని ఉండటం అనారోగ్యమని చెప్పాలి. అప్పుడే కండరాల కదలికతో జీర్ణాశయం పనితీరు మెరుగుపడి, చిన్నారులకు ఆకలి వేస్తుంది. దీంతో ఆహారం తీసుకోవడంలో ఆసక్తి చూపిస్తారు. పోషకవిలువలున్న కూరగాయలపై అవగాహన పెంచడం, వాటినెలా వండుతారో దగ్గరుండి చూపించడం వంటివి చేస్తే వాటిని తీసుకోవాలనే ఆసక్తి పెరుగుతుంది. వ్యవసాయమెలా చేస్తారు, కూరగాయలు, ఆకుకూరల పెంపకాన్ని వీలున్నప్పుడు తీసుకెళ్లి చూపించగలిగితే మరీ మంచిది. అలాగే కంటినిండా నిద్రపోవడాన్ని ప్రోత్సహిస్తూ, కథలు చెప్పడంతో పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

న్యూఢిల్లీ : దేశంలోని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ ప్రతిపక్ష ఎంపీలు నినదించారు. అదానీ కుంభకోణంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలనీ, దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలనీ, ప్రతిపక్షాలపై కేంద్ర సంస్థలతో అణచివేత చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్‌కు మార్చ్ నిర్వహించారు. 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే బ్యానర్ పట్టుకొని, 'సేవ్ ఎల్ఐసి, జేపీసీ వేయాలి' అని ప్లకార్డులు చేబూని పార్లమెంట్ నుంచి ఎంపీలు ప్రదర్శనగా వెళ్లారు. విజయ్ చౌక్ వద్ద ఎంపీలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. అనంతరం వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మార్చ్‌ను అడ్డుకునేందుకు వేలాది మంది పోలీసులు

మార్చ్ ముందుకు కొనసాగకుండా మగ పోలీసుల బదులు మహిళా పోలీసులను బారికేడ్ల వద్ద ఉంచారు. ఎంపీలను అడ్డుకునేందుకు వేలాది మంది పోలీసులు, కేంద్ర బలగాలు, వందల సంఖ్యలో బారికేడ్ల ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, బీఆర్ఎస్, ఆప్, డీఎంకే, శివసేన, ఎస్పీ, జేడీయూతో పాటు ఇతర పార్టీల ఎంపీలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఉమ్మడిగా చేపట్టే ఆందోళనలకు టీఎంసీ మాత్రమే ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉన్నది.

వారి గురించి మోడీ ఒక్క మాటా మాట్లాడలేదు : ఖర్గే

దేశాన్ని దోచుకున్న లలిత్ మోడీ, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీల గురించి ప్రధాని ఒక్క మాట కూడా అనడం లేదనీ, స్పీకర్‌కు లేఖ ఇచ్చినా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడేందుకు అనుమతించలేదని కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. దేశంలో భావప్రకటనా స్వేచ్ఛ అంతమైపోయిందనీ, త్వరలోనే నియంతత్వ పాలన వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రజల గొంతులను అణచివేసేందుకు ప్రభుత్వం కేసులతో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుంటున్నదని ఆరోపించారు.

ఉభయ సభల్లో ఆందోళన

"మోడీ-అదానీ భాయ్ భాయ్, మాకు జేపీసీ కావాలి" వంటి ప్రతిపక్ష ఎంపిల నినాదాలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. పార్లమెంట్‌లో అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారం, రాహుల్ గాంధీకి జైలు శిక్ష తదితర అంశాలపై ప్రతిపక్ష పార్టీ ఎంపీలు శుక్రవారం ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే సభలు వాయిదా పడ్డాయి. ప్రతిపక్ష ఎంపీల ఆందోళన మధ్య లోక్‌సభ ఆర్థిక బిల్లుని ఆమోదించింది.

40% పెరిగిన బ్యాంక్ ఎగవేతలు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగియని ఓ ఆంగ్ల పత్రిక రిపోర్ట్ చేసింది. 2022 డిసెంబర్ ముగింపు నాటికి 15,778 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారులు 41.3 బిలియన్ డాలర్ల (రూ.3.4 లక్షల కోట్లు) అప్పులు ఎగవేశారు. ఇంతక్రితం ఏడాది ఇదే సమయానికి 14,206 మంది లేదా సంస్థలు 34.1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.80 లక్షల కోట్లు) రుణాలు కావాలని ఎగ్గొట్టారు. సిబిల్ గణంకాల ప్రకారం.. 2020 డిసెంబర్ ముగింపు నాటికి 12,911 మంది ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులు 29.8 బిలియన్ డాలర్ల (రూ.2.45 లక్షల కోట్లు) అప్పులను బ్యాంక్‌లకు చెల్లించలేదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను 1,883 మంది ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులు 9.6 బిలియన్ డాలర్ల (రూ.79వేల కోట్ల)కు ముంచారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు 4.6 బిలియన్ డాలరు (రూ.38వేల కోట్లు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 4.27 బిలియన్ డాలర్లు (రూ.35వేల కోట్లు) ఎగ్గొట్టారు. అనేక మంది కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తలకు తీసుకున్న రుణాలు చెల్లించే సామర్థ్యం ఉన్నప్పటికీ తిరిగి తీర్చడానికి ఆసక్తి చూపడం లేదు. చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా తీసుకుని డిఫాల్టర్లు లబ్ధి పొందుతున్నారు. వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ పలు బ్యాంక్‌లకు 951 మిలియన్ డాలర్లు (రూ.7800 కోట్లు) ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయారు. డిఫాల్టర్లలో చోక్సీ అగ్రస్థానంలో ఉన్నారు. ఎబిజి షిప్‌యార్డ్, రోటోమాక్ గ్లోబల్, ఎరా ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్, రే ఆగ్రో వంటి ఇతర పెద్ద కంపెనీలు, వాటి ప్రమోటర్లు బ్యాంక్‌లకు అధికంగా కన్నం వేసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. ఈ అప్పుల వసూలు కోసం రికవరీ ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఓ అధికారి పేర్కొన్నారు. దివాలా ప్రక్రియ కూడా నడుస్తుందన్నారు.

ప్రతిపక్షాల న్యాయ పోరాటం

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థలైన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రాజకీయ దుర్వినియోగంపై ప్రతిపక్షాలు న్యాయపోరాటానికి సిద్ధమైయ్యాయి. రాజకీయ కుట్రలో భాగంగా సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను మోడీ సర్కారు దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు తాజాగా ఈ విషయంపై ఉమ్మడిగా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు ఏజెన్సీల వివక్షపూరిత ప్రయోగానికి వ్యతిరేకంగా 14 రాజకీయ పార్టీలు శుక్రవారం అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అత్యవసర జాబితా కోసం ప్రస్తావించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతత్వంలోని ధర్మాసనం.. ఏప్రిల్ 5న విచారణ చేపట్టేందుకు అంగీకరించింది.ముందస్తు అరెస్టు మార్గదర్శకాలను అమలు చేయాలని రాజకీయ పార్టీలు కోరుతున్నాయనీ, నేడు సీబీఐ, ఈడీలు పూర్తిగా ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలకు వ్యతిరేకంగా ఉపయోగించబడుతున్నాయని అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. సీబీఐ, ఈడీ ఏకపక్ష చర్యలకు వ్యతిరేకంగా మార్గదర్శకాలను రూపొందించాలని కోరారు.

బీజేపీ ప్రత్యర్థులే లక్ష్యం

సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు కేవలం బీజేపీ ప్రత్యర్థులనే లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఈ పిటిషన్‌లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. " మొత్తం రాజకీయ ప్రతిపక్షాలను, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే పౌరులను లక్ష్యంగా చేసుకొని, వారి గొంతును అణచివేసి, ఎక్కువ కాలం జైలుకు పంపడానికి దర్యాప్తు ఏజెన్సీలు పని చేస్తున్నాయి. చాలా తక్కువ నేరారోపణలు ఉన్నప్పటికీ బెయిల్‌ను రాకుండా క్రూరమైన ప్రత్యేక చట్టాలను (మనీ లాండరింగ్ నిరోధక చట్టం, 2002 వంటివి) తరచుగా ఉపయోగిస్తున్నాయి" అని పిటిషన్‌లో పేర్కొన్నాయి. "2014 నుంచి ఈడీ నమోదు చేసిన కేసుల సంఖ్య విపరీతంగా పెరిగాయి. వీటిలో ఎక్కువ భాగం మోడీ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారిని లక్ష్యంగా చేసుకొని కేసులు నమోదు చేస్తున్నది. అయినప్పటికీ, నేరారోపణ రేటు చాలా తక్కువగా ఉన్నది. పీఎంఎల్ఏ కింద కేవలం 23 నేరారోపణలు మాత్రమే నమోదయ్యాయి. చాలా కేసులు ప్రీ-ట్రయల్, ట్రయల్ దశలో పెండింగ్‌లో ఉన్నాయి" అని పిటిషన్‌లో వివరించాయి. "2004-14 మధ్య కాలంలో 72 మంది రాజకీయ నేతలపై సీబీఐ దర్యాప్తు జరిపింది. వీరిలో 43 మంది ప్రతిపక్షాలకు చెందిన వారు ఉన్నారు. 2014 తర్వాత మొత్తం 124 మంది నేతల్లో 118 మంది ప్రతిపక్ష నేతలు ఉన్నారు. అంటే 95 శాతం కేసులు ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయి. 2014 తరువాత వేధింపుల సాధనంగా సీబీఐ, ఈడీ పనికిమాలిన దాడులను చేస్తున్నాయి" అని పిటిషన్‌లో ప్రతిపక్షాలు పేర్కొన్నాయి.

బీజేపీలో చేరితే కేసుల విచారణ ఉండదు

ఒకవేళ సీబీఐ, ఈడీ కేసులు ఎదుర్కొంటున్న నేతలు బీజేపీలో చేరితే ఆ తర్వాత వారిపై ఉన్న కేసులు ముగిసిపోతున్నాయని ప్రతిపక్షాలు తెలిపాయి. కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం, ఆప్ కీలక నేతలు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్, అప్పటి శివసేన ముఖ్య నాయకులు సంజయ్ రౌత్ తదితర ప్రతిపక్ష నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్టు చేశాయని పిటిషన్‌లో పేర్కొన్నాయి. కానీ అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, కేంద్ర మంత్రి నారాయణ్ రాణే, పశ్చిమ బెంగాల్ బీజేపీ నేత సువేందు అధికారి వంటి వారు బీజేపీలో చేరిన తర్వాత వారికి రహస్యంగా క్లీన్‌చిట్ ఇచ్చారనీ, వారిపై కేసుల విచారణ నత్త నడకగా సాగుతున్నదని వివరించాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌పై ఉన్న కేసుల విచారణ జరగటం లేదని పేర్కొన్నాయి. "95 శాతం కేసులు ప్రతిపక్షాలపైనే. అరెస్టుకు ముందు, తర్వాత దర్యాప్తు సంస్థలు పాటిస్తున్న మార్గదర్శకాలు ఏమిటి?" అని ప్రతిపక్ష పార్టీలు ఈ పిటిషన్‌లో కోరాయి. అరెస్టు, రిమాండ్, బెయిల్‌పై చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు, కోర్టులకు మార్గదర్శకాలను రూపొందించాలని కోరారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, బీఆర్ఎస్, టీఎంసీ, ఆప్, జేడీయూ, ఆర్జేడీ, ఎస్పీ, ఎన్సీపీ, డీఎంకే, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) పార్టీలు సంయుక్తంగా ఈ పిటిషన్ దాఖలు చేశాయి.

ఏ-1ప్రవీణ్, ఏ-2 రాజశేఖర్...

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ల లీకేజ్ కేసులో నిందితుల రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ అధికారులు కీలక అంశాలను చేర్చారు. ఇప్పటివరకు 12 మంది నిందితులను అరెస్ట్ చేసినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. అందులో నలుగురు టీఎస్‌పీఎస్‌సీ ఉద్యోగులుగా తెలిపింది. ఏ-1గా టీఎస్పీఎస్సీ సెక్రెటరీ పీఏ ప్రవీణ్, ఏ-2గా నెట్ వర్క్ అడ్మిన్ రాజశేఖర్, ఏ- 10గా ఏఎస్‌వో షమీమ్, ఏ-12గా డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజశేఖర్‌లను నిందితులుగా పేర్కొంది. నిందితుల్లో మరో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులని తెలిపింది. 19 మంది సాక్షులను విచారించినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ అధికారులు పేర్కొన్నారు. టీఎస్పీఎస్సీ ఉద్యోగి శంకర్ లక్ష్మిని ప్రధాన సాక్షిగా పేర్కొన్నారు. శంకర్ లక్ష్మితో పాటు టీఎస్పీఎస్సీ, తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్ ఉద్యోగులను సాక్షులుగా పేర్కొంది. కర్మన్‌ఘాట్‌లోని ఒక హోటల్ యాజమాని, ఉద్యోగిని సైతం సాక్షిగా చేర్చారు. ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు షమీమ్, రమేష్, సురేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి ఒక ల్యాప్ టాప్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సిట్ అధికారులు రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపారు.

నాంపల్లి కోర్టులో సిట్ పిటిషన్

టీఎస్‌పీఎస్‌సీ కేసులో ముగ్గురు నిందితుల కస్టడీ కోరుతూ నాంపల్లి కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. గురువారం రమేష్, సురేష్, షమీమ్‌లను సిట్ అధికారుల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ముగ్గురిని ఏడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు.

రాహుల్‌పై అనర్హత వేటు

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ఇలా చేస్తుందని ముందే తెలుసు : ఖర్గే

రాహుల్‌పై సూరత్‌కోర్టు ఇచ్చిన తీర్పుపై చట్ట ప్రకారం ముందుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. బీజేపీ ఇలా చేస్తుందని తాము ముందే ఊహించామన్నారు. రాహుల్ నోరు నొక్కడానికే ఇలా చేశారని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భాగేల్, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్‌లు రాహుల్ అనర్హత వేటుపై స్పందించారు. బీజేపీ రాహుల్ గొంతు నొక్కే యత్నం చేస్తున్నదని విమర్శించారు.

ఖండించిన సీఎంలు, మాజీ ముఖ్యమంత్రులు

తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, కేరళ సీఎం పినరయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వేందర్ సింగ్, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తదితరులు రాహుల్‌పై అనర్హత వేటును ఖండించారు.

బీజేపీ ప్రతీకార రాజకీయాలకు పరాకాష్ట : కేరళ సీఎం విజయన్

ఇది ప్రజాస్వామ్యంపై సంఘపరివార్ హింసాత్మకదాడి. బీజేపీ ప్రతీకార రాజకీయాలకు పరాకాష్ట.

ప్రజాస్వామ్య విలువలకు పాతర : ఎన్సీపీ చీఫ్ శరద్ పవర్

లోక్‌సభ ఎంపీలుగా రాహుల్ గాంధీ, ఫైజల్‌లపై అనర్హత వేటు వేయడం రాజ్యాంగం ప్రాథమిక సిద్ధాంతాలకు విరుద్ధం. ఇక్కడ ప్రజాస్వామ్య విలువలు తగ్గుతున్నాయి. ఇది ఖండించదగినది. రాజ్యాంగ సూత్రాలకే విరుద్ధం. ప్రజాస్వామిక సంస్థలను కాపాడుకోవడానికి అందరం కలిసి నిలబడాలి.

బీజేపీ టార్గెట్‌గా ప్రతిపక్ష నేతలు : పశ్చిమ బెంగాల్ సీఎం మమత

ప్రధాని మోడీ నవ భారత్‌లో ప్రతిపక్ష నేతలే బీజేపీ లక్ష్యంగా మారారు. నేర చరిత ఉన్న బీజేపీ నాయకులు క్యాబినేట్‌లో చేరుతుంటే, ప్రతిపక్ష నేతలు మాత్రం వారి ప్రసంగాలకు అనర్హత వేటుకు గురవుతున్నారు. ఈ రోజు మన రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి కొత్త పతనాన్ని మనం చూశాం.

ప్రతిపక్ష నాయకులే లక్ష్యం : జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్

రాహుల్ గాంధీపై అనర్హత వేటుతో కేంద్రం తన ప్రతీకార యుద్ధాలు ఎలా ఉంటాయో నిరూపిస్తున్నది. నేటి అమృత్ కాల్‌లో ప్రతిపక్ష నాయకులు బీజేపీకి ఏకపక్షంగా లక్ష్యంగా ఉన్నారు. అధికారాన్ని ఆయుధంగా ఉపయోగించి బలవంతంగా వారిని నిశ్శబ్దం చేస్తున్నది.

తొలుత ఫైజల్.. ఇప్పుడు రాహుల్ : ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే

పూర్తిగా నిరాశపర్చింది. తొలుత పి.పి మహ్మద్ ఫైజల్. ఇప్పుడు రాహుల్ గాంధీ.

రాష్ట్రపతికి అంతిమ నిర్ణయం తీసుకునే అధికారం

ఆర్టికల్ 103 ప్రకారం ఇలాంటి వివాదాల్లో అంతిమ నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్రపతికి ఉంటుందని రాజ్యాంగ నిపుణులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రపతి ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉన్నదని వారు చెప్పారు. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 ప్రకారం రెండేండ్లు, అంతకంటే ఎక్కువ కాలం శిక్షపడిన ప్రజా ప్రతినిధికి శిక్షాకాలంతో పాటు మరో ఆరేండ్లు పోటీ చేయడానికి వీలులేదు. ఈ లెక్కన రాహుల్ గాంధీకి 8 ఏండ్లు ఎన్నికల్లో పోటీకు అనర్హుడవుతాడని రాజ్యాంగ నిపుణులు కొందరు తెలిపారు.

2013లో ఆ ఆర్డినెన్సును రాహుల్ వ్యతిరేకించకుండా ఉంటే..

ప్రజా ప్రతినిధులకు శిక్ష పడిన వెంటనే అప్పీల్‌కు వెళ్లకుండా అనర్హత వేటు అమలులోకి వస్తుందని 2013లో సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. దీనిని నిలుపుదల చేసి, అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశం ఇస్తూ నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆ సమయంలో ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఆ ఆర్డినెన్స్ కాపీలను నాటి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ చించివేశారు. దాంతో ఆర్డినెన్స్ నిలిచిపోయింది. నాడు ఆర్డినెన్స్ చట్టంగా మారి ఉంటే, ప్రస్తుతం రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడకుండా అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండేదని నిపుణులు తెలిపారు. కానీ ఆర్డినెన్స్ కార్యరూపం దాల్చకపోవడంతో రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు అవకాశం లభించినట్టయ్యిందని చెప్పారు.

ఇప్పటి వరకు అనర్హతకు గురైన నేతలు

- తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత గతంలో అనర్హతకు గురయ్యారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఆమెకు నాలుగేండ్ల జైలుశిక్షతోపాటు రూ.100 కోట్ల జరిమానా పడింది. దీంతో ఎమ్మెల్యే పదవికి ఆమె అనర్హురాలయ్యారు. దీంతో ఏకంగా సీఎం పదవి నుంచే దిగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ కర్నాటక హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో జయలలితకు అవరోధాలన్నీ తొలగిపోయాయి.
- బీహార్‌లోని సరన్ ఎంపీగా ఉన్న సమయంలో ఆర్జేడీ నేత లాలూప్రసాద్ యాదవ్‌పై 2013 సెప్టెంబర్‌లో అనర్హత వేటు పడింది. దాణా కేసులో ఐదేండ్ల జైలుశిక్షపడడమే దీనికి కారణం.
- లక్షద్వీప్ ఎంపీ మహమ్మద్ ఫైజల్ (ఎన్సీపీ)పై ఈ ఏడాది జనవరి 23న అనర్హత వేటు పడింది. హత్యాయత్నం కేసులో అయనను సెషన్స్ కోర్ట్ దోషిగా తేల్చింది. రెండేండ్లకుమించి జైలుశిక్షపడటమే ఇందుకు కారణమైంది. అయితే కేరళ హైకోర్టు ఆ తీర్పును సస్పెండ్ చేసింది. అయినప్పటికీ ఆయనను లోక్‌సభకు రానీయకపోవటం గమనార్హం.
- రామ్‌పూర్ మాజీ ఎంపీ ఆజం ఖాన్ 2019లో విద్వేష ప్రసంగం కేసులో దోషిగా తేలారు. రెండేండ్ల కంటే ఎక్కువ జైలు శిక్ష పడడంతో ఆయనపై ఆ సమయంలో అనర్హత వేటుపడింది.
- ఈ జాబితాలో కమల్ కిశోర్ భగత్ (జార్ఖండ్ ఎమ్మెల్యే), సురేష్ హల్వాంకర్ (మహారాష్ట్ర ఎమ్మెల్యే), టి.ఎం సెల్వగణపతీ (తమిళనాడు ఎమ్మెల్యే), బాబన్‌రావ్ ఘోలప్ (మహారాష్ట్ర ఎమ్మెల్యే), ఎనోస్ ఎక్కా (జార్ఖండ్ ఎమ్మెల్యే), ఆశా రాణి (బీహార్ ఎమ్మెల్యే), జగదీష్ శర్మ (బీహార్ ఎమ్మెల్యే), పప్పు కలానీ (మహారాష్ట్ర ఎమ్మెల్యే)లు ఉన్నారు. వీరంతా వేర్వేరు నేరాల్లో దోషులుగా తేలి, జైలుశిక్షలు పడడంతో వీరంతా అనర్హతకు గురయ్యారు.

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటిరోజు..

(మొదటిపేజీ తరువాయి)

గర్హనీయం. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు ప్రమాదం దాపురించింది. మోడీ పాలన ఎమర్జన్సీని మించిపోతున్నది. ప్రతిపక్ష నాయకులను వేధించడం పరిపాటిగా మారిపోయింది. నేరస్థులు, దగాకోరుల కోసం ప్రతిపక్ష నాయకులపై అనర్హత వేటు వేయటం ద్వారా మోడీ తన పతనాన్ని కొని తెచ్చుకుంటున్నారు. పార్టీల మధ్య ఉండే వైరుధ్యాలకు ఇది సందర్భం కాదు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం కోసం బీజేపీ ప్రభుత్వ దుశ్చర్యను ప్రజాస్వామ్య వాదులందరూ ముక్త కంఠంతో ఖండించాలి. తద్వారా ఆ పార్టీ దుర్మార్గ విధానాలను ప్రతిఘటించాలి...' అని కేసీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

బిజినెస్

సామ్‌సంగ్ గెలాక్సీ 14 5జి ఆవిష్కరణ

ముంబయి : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా గెలాక్సీ ఎఫ్14 5జిని ఆవిష్కరించింది. శుక్రవారం దీన్ని భారత మార్కెట్లోకి విడుదల చేసింది. 5ఎన్ఎం ప్రాసెసర్, ఎక్సీనోస్ 1330 చిప్‌సెట్‌తో వస్తోందని పేర్కొంది. దీని బ్యాటరీ 2 రోజుల వరకు పని చేస్తుందని తెలిపింది. 50 ఎంపి ప్రధాన కెమెరా, 13 ఎంపి సెల్ఫీ కెమెరాతో దీన్ని ఆవిష్కరించింది. 4జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజ్ ధరను రూ.12,990గా, 6జి ర్యామ్, 128 జిబి స్టోరేజ్ ధరను రూ.14,490గా నిర్ణయించింది. మార్చి 30 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించనున్నట్లు పేర్కొంది.

జాక్‌డోర్సే సంపద రూ.4,300 కోట్లు ఫట్

వాషింగ్టన్ : అమెరికన్ మొబైల్ బ్యాంకింగ్ సేవల సంస్థ బ్లాక్ ఆర్థిక అక్రమాలపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలతో బ్లాక్ కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయి. దీంతో బ్లాక్ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే సంపద 526 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.4,300 కోట్లు) ఆవిరయ్యాయి. గురువారం ఇంట్రాడేలో బ్లాక్ షేర్లు 15 శాతం పతనం కాగా.. శుక్రవారం కూడా 3 శాతం పైగా నష్టాల్లోనే ప్రారంభమయ్యాయి. "బ్లాక్ ఇంక్‌నకు చెందిన అండర్ బ్యాంక్ తన ఖాతాదారుల్లో ఎక్కువమంది నేరస్తులు లేదా అక్రమ కార్యకలాపాలలో పాల్గొన్నవారే. మోసం, ఇతర స్కామ్‌ల నిమిత్తం ఖాతాలను భారీగా సష్టించడం, ఆపై అక్రమ నిధులను త్వర త్వరగా మళ్లించడం చేసింది. ఖాతాల్లోని 40 శాతం నుండి 75 శాతం నకిలీవి, మోసానికి పాల్పడినవీ లేదా ఒకే వ్యక్తితో ముడిపడి ఉన్న అదనపు ఖాతాలే. తప్పుడు లెక్కలతో పెట్టుబడిదారులను తప్పుదారి పట్టించింది." అని ఇండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే.

హన్మకొండలో రిలయన్స్ ట్రెండ్స్ ఏర్పాటు

హైదరాబాద్: వస్త్రాలు, పాదరక్షలు, యాక్ససరీస్ ఉత్పత్తుల రిటైల్ చెయిన్ రిలయన్స్ ట్రెండ్స్ కొత్తగా హన్మకొండలోని నక్కలగుట్ట వద్ద నూతన స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. 20,392 అడుగుల విస్తీర్ణం గల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్‌లో నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉందని పేర్కొంది. ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ.3999 షాపింగ్ చేస్తే రూ.249కి ఆకర్షనీయమైన బహుమతి పొందవచ్చని పేర్కొంది. అదే విధంగా రూ.3999 కొనుగోలుపై వినియోగదారులు రూ.2000 విలువగల కూపన్లు పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపింది.

న్యూట్రిషన్ భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి

- దబ్ల్యుపిపిఎస్ చైర్మన్ అజయ్ గోయల్



హైదరాబాద్: భారత దేశంలో ఆహార భద్రత దిశగా కృషి చేస్తున్న ప్రస్తుత సమయంలో న్యూట్రిషన్ భద్రతకు ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఉందని వీట్ ప్రొడక్ట్స్ ప్రమోషన్ సొసైటీ (డబ్ల్యుపిపిఎస్) చైర్మన్ అజయ్ గోయల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో గోధుమలు, గోధుమ ఉత్పత్తులపై డబ్ల్యుపిపిఎస్ ఓ సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా అజయ్ గోయల్ మీడియాతో మాట్లాడుతూ.. తమ సొసైటీ 50 ఏళ్ల నుంచి పని చేస్తుందన్నారు. ఐదేళ్ల తర్వాత తాము ఈ భౌతిక సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. గోధుమ ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. 150 పైగా ప్రతినిధులు సహా పలువురు న్యూట్రీషన్ విద్యార్థులు, 16 మంది నిపుణులు వివిధ అంశాలపై మాట్లాడుతున్నారన్నారు. ప్రపంచంలో 35 శాతం మంది గోధుమ ఉత్పత్తులు తింటున్నారన్నారు. దేశంలో ఈ ఏడాది 110 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమల దిగుబడి చోటు చేసుకోనుందన్నారు. గోధుమ దిగుమతులపై 40 శాతం పన్ను అమల్లో ఉందని.. ఎగుమతులపై నిషేధం కొనసాగుతుందన్నారు.

అసమ్మతి ప్రజాస్వామ్య జీవ లక్షణం..

- విశ్రాంత అడ్వకెట్ జనరల్ సీవీ మోహనరెడ్డి

నవతెలంగాణ - కల్చరల్

మన దేశంలో ఏ రాజకీయ పక్షాలతో ఏర్పడిన ప్రభుత్వం అయినా అది విమర్శ, అసమ్మతి, అనంగీకారం, అసంతుష్టిని సహించే పరిస్థితి లేదని విశ్రాంత అడ్వకెట్ జనరల్ సి.వీ.మోహనరెడ్డి అన్నారు. అసమ్మతి అనేది ప్రజాస్వామిక జీవ లక్షణం అని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్.టీ.ఆర్ కళా మందిరంలో సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కప్పు స్వామి స్మారక ప్రసంగ కార్యక్రమంలో పాల్గొన్న మోహనరెడ్డి 'ప్రజాస్వామ్యం, అసమ్మతి, భారత రాజ్యాంగం' అనే అంశంపై మాట్లాడారు. ఫ్రెంచ్ తత్వవేత్త నుడివిన 'నీ భావాలతో నేను ఏకీభవించను కానీ అలా చెప్పే నీ హక్కును గౌరవిస్తాను...' అనే మాటను నేటి పాలకులు విస్మరించారనీ, ఇది ప్రజాస్వామిక దేశాలకు పెను ప్రమాదమని హెచ్చరించారు.ప్రతి సమాజం కొన్ని నియమ నిబంధనలకు లోబడి ఉంటుందని చెప్పారు. అదే విధంగా కొన్ని నూతన ఆవిష్కరణలకు స్వేచ్ఛ అవసరమని అన్నారు. అలా లేకుంటే...బుద్ధుడు, జీసస్, మహావీరుడు, మార్టిన్ లూథర్ కింగ్,రామమోహనరాయ్, తెలుగు వాడైన వీరేశలింగం వంటి వారు వారి కాలం లోని అంధ విశ్వాసాలు, మత అసాంఘీక ధోరణులను ప్రశ్నించకపోతే అభ్యున్నతి సాధ్యపడేది కాదన్నారు. అసమ్మతి లేని ప్రజాస్వామ్యాన్ని శ్మశాన నిశ్శబ్దంగా ఆయన అభివర్ణించారు. మోహనరెడ్డి తన ప్రసంగంలో పలువురు న్యాయ మూర్తుల తీర్పులను ప్రస్తావిస్తూ జస్టిస్ కృష్ణ అయ్యర్ ఒక కేసు సందర్భంగా... స్వేచ్ఛ లేకుంటే అజంతా ఎల్లోరా లోని శిల్పాలు, కళా ఖండాలు ఉండేవి కావన్న వ్యాఖ్యను ఉటంకించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 124-ఏ కింద రాజద్రోహం కేసును ఎక్కువగా ఉప యోగించటమనేది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కార్యక్రమానికి జస్టిస్ రఘురాం అధ్యక్షత వహించగా పలువురు మేధావులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు

2025 నాటికి టీబీ నిర్మూలనే లక్ష్యం: మంత్రి హరీశ్

- ప్రతిభ కనబరిచిన వైద్య సిబ్బందికి అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీబీ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామనీ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 2025 నాటికి ఆ వ్యాధిని నిర్మూలించటమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రపంచ టీబీ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా ఉత్తర ప్రదేశ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ టీబీ అధికారులు నాలుగు అవార్డులను (నాలుగు జిల్లాలకు) అందుకున్నారు. నిజామాబాద్‌కు బంగారు, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండకు వెండి, ఖమ్మం జిల్లాకు కాంస్య పతాకాలు దక్కాయి. ఈ నేపథ్యంలో మంచి ప్రతిభ కనబరచటం ద్వారా రాష్ట్రానికి అవార్డులను తెచ్చిపెట్టిన వైద్యాధికారులను హరీశ్‌రావు అభినందించారు.

ఉద్యోగులను బెదిరించడం తగదు

- పాత పెన్షన్‌ను పునరుద్ధరించకుంటే బీజేపీకి గుణపాఠం తప్పదు : ఎస్‌సీకేఎస్ ప్రధాన కార్యదర్శి బి మధు హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలనీ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ ఆందోళనల్లో పాల్గొనే ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామంటూ కేంద్రంలోని బీజేపీ బెదిరింపులకు పాల్పడటాన్ని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (ఎస్‌సీకేఎస్) ప్రధాన కార్యదర్శి బి మధు తీవ్రంగా ఖండించారు. ఆందోళనల్లో పాల్గొనడం రాజ్యాంగం కల్పించిన హక్కనీ, దాన్ని కాలరాయడం సరైంది కాదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోరాటాలను అణచివేసేందుకు ఉద్యోగులను బెదిరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వరంగాన్ని నాశనం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని పేర్కొన్నారు. హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఉద్యోగులు, కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని తెలిపారు. హక్కులను కాలరాసే కేంద్ర ప్రభుత్వానికి ఉద్యోగులు, కార్మికులు పోరాటాలతోనే బుద్ధిచెప్తారని హెచ్చరించారు. నిరంకుశంగా వ్యవహరించిన అనేక మంది నియంతలు కాలగర్భంలో కలిసిపోయారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ చర్యలను మానుకుని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని కోరారు. లేదంటే గత పాలకులకు చెప్పిన విధంగా బీజేపీకి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

అదానీ కుంభకోణం నుంచి దృష్టి మరల్చేందుకే !

పాలక పార్టీ పార్లమెంట్‌ను స్తంభింపచేయడంపై ఏచూరి విమర్శ



హోషియార్‌పూర్ : సర్దార్ భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 92వ అమరవీరుల దినోత్సవం, గొప్ప కమ్యూనిస్టు నేత, సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ 107వ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవాల 75ఏండ్ల పండుగను పురస్కరించుకుని పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో గురువారం బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని, దేశభక్తులు, స్వాతంత్ర సమరయోధులకు ఘనంగా నివాళి అర్పించారు. బ్రిటిష్ కాలం నాటి పాత డిప్యూటీ కమిషనర్ ఆఫీస్ వద్ద బహిరంగ సభ జరిగింది. ఈ చారిత్రక ప్రదేశంలో ర్యాలీని నిర్వహించినందుకు పంజాబ్ పార్టీని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి అభినందించారు. సర్దార్ భగత్ సింగ్ యువ శక్తికి ప్రతీక అని, అనేక తరాలకు స్ఫూర్తిని అందించారని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు కూడా ఆయన నుండి స్ఫూర్తి పొందారని అన్నారు. మనం రాజకీయ స్వేచ్ఛ పొందవచ్చు కానీ, ప్రతి ఒక్క పౌరుడు ఆర్థిక స్వేచ్ఛ పొందనిదే రాజకీయ స్వేచ్ఛ సంపూర్ణం కాదని భగత్ సింగ్ ఎల్లప్పుడూ చెబుతూ వుండేవారని ఏచూరి పేర్కొన్నారు. అవిశ్రాంతంగా మనం జరిపే పోరాటాల ద్వారా ఈ స్వేచ్ఛను సాధించడానికి కమ్యూనిస్టులుగా మనం కృషి చేస్తూనే వున్నామన్నారు. సంపన్నులు, పేదల మధ్య చాలా వ్యత్యాసం వుందని, ఒక శాతం భారత కార్పొరేట్లు 44.5శాతం జాతీయ ఆస్తులపై నియంత్రణను కలిగివున్నారని అన్నారు. కార్పొరేట్ సంస్థల రుణాలను రూ.11లక్షల కోట్ల మేరకు మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు.

పార్లమెంట్ కార్యకలాపాలను పాలక పార్టీ స్తంభింపచేయడం ఇదే మొదటిసారని ఏచూరి అన్నారు. పార్లమెంట్ కార్యకలాపాలను బీజేపీ స్తంభింపచేయడం వెనుక గల అసలైన కారణం విదేశాల్లో రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ కాదని, అదానీ కుంభకోణాల నుంచి దేశం దృష్టిని మళ్ళించాలనీ, ఈ కుంభకోణంలో జేపీసీ దర్యాప్తును నివారించాలని వారు అనుకున్నారని ఏచూరి విమర్శించారు. మూతపడిన పరిశ్రమలను తిరిగి తెరిపించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్టైతే, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసినట్టైతే, కోట్లాదిమంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని ఆయన ఖండించారు. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ చర్య తీసుకున్నా దాన్ని జాతి వ్యతిరేక చట్టంగా బీజేపీ, పోలీసు బలగాలు పేర్కొంటున్నాయన్నారు. 'మోడీ హటావో దేశ్ బచావో' అన్న పోస్టర్లపై ఢిల్లీ పోలీసులు 200 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని ఏచూరి వెల్లడించారు. మొత్తంగా 3500 ఈడీ కేసుల్లో కేవలం 23 కేసులు మాత్రమే కోర్టు విచారణకు వెళ్ళాయని చెప్పారు. గో సంరక్షకుల ముసుగులో మతోన్మాద దుండగులు కారులో ఇద్దరు ముస్లిం యువకులను సజీవ దహనం చేసిన ఘాతుకాన్ని గుర్తు చేస్తూ, మతోన్మాదమనే విషాన్ని వ్యాప్తి చేస్తున్న ఫాసిస్ట్ సంస్థ ఆర్ఎస్ఎస్ అని ఏచూరి విమర్శించారు.

హిందూ ముస్లిం, సిక్, ఇసాయి, చారోమ్ భారత్ కే సిపాయి" వంటి నినాదాలను చేసేవారమంటూ ఏచూరి తన స్కూలు రోజులను గుర్తు చేసుకున్నారు. 1980ల్లో పంజాబ్‌లో మతోన్మాద, తీవ్రవాద శక్తులపై పోరాట సమయంలో 200మందికి పైగా సీపీఐ(ఎం) కార్యకర్తలు, నేతలు తమ ప్రాణాలను త్యాగంచేశారని అన్నారు. న్యాయవ్యవస్థపై నిరంతరంగా దాడి చేస్తున్న బీజేపీ మంత్రులను, నేతలను ఏచూరి విమర్శించారు. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల నియమకానికి సంబంధించి సుప్రీంకోర్టు నిర్ణయాన్ని చారిత్రకమైనదని, ఎన్నికల ప్రజాస్వామ్య క్రమాన్ని కాపాడేందుకు తీసుకున్న చర్య అని ఏచూరి వ్యాఖ్యానించారు. రైతాంగాన్ని అభినందిస్తూ, సంయుక్త కిసాన్ మోర్చా ఢిల్లీలో సాగించిన పోరాటం చారిత్రకమైనదని అభివర్ణించారు. ఇటీవల మహారాష్ట్ర రైతులు సాగించిన లాంగ్ మార్చ్‌ను కూడా ఆయన ప్రస్తావించారు. ఈ పోరాటాలు, ఉద్యమాలు ప్రభుత్వాలను తల వంచేలా చేశాయన్నారు. బీజేపీ, మోడీకి చెందిన కొద్దిమంది పెట్టుబడి దారులైన మిత్రులు గరిష్టంగా లాభాలు ఆర్జించేందుకుగానూ 80శాతానికి పైగా ప్రజలను ఆర్థిక దోపిడికి గురి చేస్తున్నారని, దీన్నుండి, మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడేందుకు ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలోని మతోన్మాద, కార్పొరేట్ కూటమికి వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలని ఏచూరి పిలుపిచ్చారు. బీజేపీకి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీల నాయకత్వం ఒకే వేదికపైకి వచ్చేలా ఒత్తిడి తీసుకువచ్చింది ప్రజలేనని, 1977లో జరిగింది అదేనని ఏచూరి గుర్తు చేసుకున్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ సుఖ్విందర్ సింగ్ షెకాన్, మాజీ కేంద్ర మంత్రి, దేశ్ భగత్ యాద్గర్ కమిటీ ప్రధాన కార్యదర్శి బల్వంత్ సింగ్ రామూవాలియాలు కూడా ర్యాలీనుద్దేశించి ప్రసంగించారు. సభకు అధ్యక్ష వర్గంగా కామ్రేడ్స్ భూప్ చంద్ చన్నో, గురుదర్శన్ సింగ్‌లు వ్యవహరించారు. కామ్రేడ్ గుర్నేక్ సింగ్ భజ్జాల్ కార్యక్రమాలను నిర్వహించారు.

1932 మార్చి 23న భగత్‌సంగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల మొదటి సంస్మరణ దినం సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కార్యాలయం పైన ఎగురుతున్న బ్రిటిష్ పతాకాన్ని తొలగించి, భారతీయ త్రివర్ణ పతాకాన్ని కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ ఎగురవేశారు. అప్పటికి సూర్జిత్ వయస్సు కేవలం 16సంవత్సరాలు.

ఈ సంఘటనతో డిసి ఆఫీసు అంతా గందరగోళం నెలకొంది. మిలటరీ సిబ్బంది ఆ యువకుడిని పట్టుకున్నారు. వెంటనే కాల్చేయాలని అనుకున్నారు. కానీ, అప్పటి డిప్యూటీ కమిషనర్, యువకుడైన సూర్జిత్‌ను కాల్చేయకుండా అరెస్టు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత డిప్యూటీ కమిషనర్ ఆ యువకుడిని ప్రశ్నిస్తూ పేరేంటని అడిగారు. దానికి లండన్‌తోడ్ సింగ్ (బ్రేకర్ ఆఫ్ లండన్) అని మన సూర్జిత్ బదులిచ్చాడు. ఆ తర్వాత సూర్జిత్‌కు మూడేళ్ళ జైలుశిక్ష విధించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగ్రెస్‌పార్టీ మాజీ మంత్రి, హాకీ ఒలింపియన్ పర్గత్ సింగ్ ప్రసంగిస్తూ, కామ్రేడ్ సూర్జిత్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బీజేపీని, కొన్నిసార్లు కాంగ్రెస్‌ను ఏకాకిని చేయడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకత్వాలను ఏకం చేసి ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఘనత సూర్జిత్‌దేనని పేర్కొన్నారు.

కమిటీ అంటే ఉద్యోగులను మోసగించడమే

- సీపీఎస్‌పై కాలయాపన వద్దు పాత పెన్షన్ ముద్దు
- పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలి : ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని 84 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల నుంచి పాత పెన్షన్ అమలుపై వచ్చిన వినతుల నేపథ్యంలో ఆర్థిక శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం ఉద్యోగులను మోసగించడమేనని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ, టీఎస్‌సీపీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ విమర్శించారు. సీపీఎస్‌పై కమిటీలతో కాలయాపన చేయొద్దనీ, పాతపెన్షన్‌ను పునరుద్ధరించడమే ముద్దని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకి పాత పెన్షన్ పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ కూడా ప్రభుత్వ పరిశీలనలో లేదని లిఖితపూర్వకంగా తెలిపిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు సీపీఎస్ ఉద్యోగుల పట్ల కమిటీ ప్రతిపాదించడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న కర్ణాటక, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, హర్యానాలో పాత పెన్షన్ అమలును పునరుద్ధరించకుంటే ఓటమి ఖాయమని బీజేపీ భావిస్తున్నదని పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో వచ్చిన తీర్పే రాబోతుందని ఊహించి కంటి తడుపు చర్యగా కమిటీ ప్రకటించడం ప్రభుత్వంలో చిత్తశుద్ధి లోపించిందని తెలిపారు. మొన్న కేంద్ర ప్రభుత్వం డీఓపీటీ అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ జరుగుతున్న నిరసనల్లో పాల్గొనకూడదంటూ నిరసన చేపట్టిన ఉద్యోగులకు వేతనాల కోతతో పాటు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామంటూ ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు సీపీఎస్ ఉద్యోగుల సంక్షేమం పట్ల కమిటీ వేయడం హాస్యాస్పదమని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల చేతుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల వాటా, ఉద్యోగుల వాటా కలిపి రూ.తొమ్మిది లక్షల కోట్ల పెన్షన్ ఫండ్‌ను తిరిగి చెల్లించాలని కేంద్రాన్ని కోరారు. పాత పెన్షన్ అమలు చేయటమనేది రాష్ట్రాలకు ఆర్థిక భారమని తెలిపే కేంద్రం, ఆర్థిక మేధావులు ఒక్కసారి ఈదేశంలోనే ఉన్న పశ్చిమ బెంగాల్‌లో పది లక్షలకు పైగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలుతో ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదని తెలిపారు.

జీవాయుధాలు వద్దు

- ప్రపంచశాంతి ముద్దు
- చిన్నారుల చిరు సందేశం



హైదరాబాద్ : ప్రపంచ శాంతి, ఆనందం, స్థిరమైన భవిష్యత్తు ప్రాధాన్యతను తెలియజేస్తూ గచ్చిబౌలిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు చిరు సందేశాన్ని పంపారు. ఐదో తరగతికి చెందిన యెలమర్తి ఆరాధ్య, సాయి సూర్యదేవర, అవ్యక్త్ సూర్పనేని, లక్ష్ అగర్వాల్‌లు కరపత్రాలతో డ్రైవ్‌ను చేపట్టారు. జీవాయుధాలు వద్దనీ, ప్రపంచ శాంతి ముఖ్యమనే సందేశాన్ని వారు ప్రచారం చేశారు. యుద్ధాలు, జీవాయుధాల ద్వారా వచ్చే నష్టం గురించి పలువురికి చిన్నారులు వివరించారు. ప్రత్యేక టీషర్టులు ధరించిన చిన్నారులు.. ఈ కరపత్రాలను వారికి అందించారు. చిన్నారుల ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

బీజేపీ ధర్నాకు అనుమతినివ్వండి..

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగ సమస్యలపై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఈనెల 25న బీజేపీ నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు అనుమతినివ్వాలని హైకోర్టు శుక్రవారం పోలీసులను ఆదేశించింది. ఇదే సమయంలో ధర్నాకు పలు షరతులను విధించింది. 500 మంది మాత్రమే హాజరుకావాలి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదు, ఉల్లంఘిస్తే పోలీసులు చర్యలు తీసుకోవచ్చు, ధర్నాలో పాల్గొనే కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ నేతల జాబితాను పోలీసులకు అందజేయాలంటూ ఆదేశించింది. ధర్నాకు భద్రతా ఏర్పాట్లు చేయాలంటూ పోలీసులకు సూచించింది. విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది.

ఎనిమిది వారాల్లోగా సమీక్ష చేయండి...

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులపై ఎనిమిది వారాల్లో సమీక్ష చేసి తగు నిర్ణయం తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విద్యుత్ సంస్థల్లో పదోన్నతుల్లో ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించి ఇచ్చిన ప్రమోషన్లన్నింటినీ సమీక్షించాలంటూ 2018లో హైకోర్టు విద్యుత్ సంస్థలను ఆదేశించింది. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలపై అప్పట్లో ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది. ఆ కేసును న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావలీ శుక్రవారం విచారించారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన ఆయన విచారణను వాయిదా వేశారు.

లోకల్‌బాడీల ఎన్నికలపై పిల్...

రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల స్థానాలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల కమిషన్, పంచాయతీ రాజ్ శాఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 27కు వాయిదా వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది రాపోలు భాస్కర్ కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు దుర్మార్గం

మోడీ కలియుగ నియంతలా వ్యవహరిస్తున్నారు

- పేపర్ లీకేజిపై కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది
- నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఏప్రిల్ 6 వరకు యాత్ర వాయిదా : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై లోక్‌సభ అనర్హత వేటు వేయడం దుర్మార్గమని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ కుంభకోణంపై చర్చ జరగకుండా బీజేపీ అన్ని రకాల ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ లోని తన నివాసంలో రేవంత్‌రెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తు న్నారని విమర్శించారు. ఇలాంటి వైఖరి దుర్మార్గమన్నారు. కోర్టు కూడా 30 రోజులు అప్పీల్‌కు సమయమిచ్చిందన్నారు. అలాంటప్పుడు అనర్హత వేటు ఎందుకు? అని ప్రశ్నించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేసిన పాదయాత్రలో ప్రభుత్వ వైఫల్యాలను రాహుల్ ఎండగట్టారనీ, దాన్ని మోడీ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మోడీ కలియుగ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ,మోడీ చీకటి స్నేహంపై రాహుల్ గాంధీ నిలదీశారన్నారు. అదానీ కంపెనీల వ్యవహారాలపై జేపీసీ వేయాలని పార్లమెంట్ వేదికగా రాహుల్ పోరాటం చేయడం ప్రధాని మోడీకి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయన్నారు. ఈ కుట్రను న్యాయపోరాటం ద్వారా కాంగ్రెస్ ఛేదిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమాల నేపథ్యంలో పాదయాత్రను ఏప్రిల్ 6 వరకు తన పాదయాత్రను వాయిదా వేసుకున్నట్టు తెలిపారు. పేపర్ లీకేజిపై కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందన్నారు.

ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు : మాణిక్‌ఠాక్రే

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడమంటే, ప్రజాస్వామ్యానికి చీకటి రోజులేనని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే అభిప్రాయపడ్డారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలో కాంగ్రెస్ నాయకులపై తీవ్ర నిర్బంధం, నియంత పాలన సాగుతున్నదన్నారు. మాజీ ఎంపీ మధుయాష్కీ, మహేష్‌కుమార్ గౌడ్, రోహిత్ చౌదరీ, వి హనుమంతరావు, కోదండరెడ్డి, జి. నిరంజన్, అజ్మత్, ఫహీంతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. న్యాయపరంగా, చట్టపరంగా పోరాటం చేస్తామన్నారు. 30 రోజుల గడువు ఉండగానే ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సీతక్క, జగ్గారెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మల్లు రవి, చామల కిరణ్‌రెడ్డి, అద్దంకి దయాకర్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

ఆందోళనలకు పిలుపు : రేవంత్

కాంగ్రెస్ శ్రేణులంతా ఓయూ నిరుద్యోగ నిరసన దీక్షలో పాల్గొనాలనీ, తాను పాల్గొనేందుకు శాయశక్తు లా ప్రయత్నిస్తానని రేవంత్‌రెడ్డి చెప్పారు. 27న జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేయాలనీ, ఏప్రిల్ 1 నుంచి అన్ని యూనివర్సిటీల విద్యార్థులను కలవాలని నిర్ణయించు కున్నట్టు తెలిపారు. ముఖ్య నాయకులతో ఢిల్లీకి వెళ్లి ఈడీ,సీబీఐ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

సంక్షోభ పాకిస్థాన్‌కు చైనా చేయూత

- 200 కోట్ల డాలర్ల రోల్ ఓవర్ డిపాజిట్లు

ఇస్లామాబాద్ : తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు చైనా చేయూతనందించింది. ఏడాది కాలంలో చైనా నుంచి పాక్ 200 కోట్ల డాలర్ల రోల్ ఓవర్ డిపాజిట్ల అందుకుంది. నగదు సంక్షోభంలో కూరుకుపోయిన పాక్.. తన ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసుకునేందుకు ఐఎంఎఫ్ నుండి బెయిలవుట్ ప్యాకేజీని పొందాలంటే ముందుగా చైనా నుండి ఈ డిపాజిట్లు తీసుకోవడం తప్పనిసరి అయిందని స్థానిక మీడియా పేర్కొంది. ప్రాథమికంగా రోల్ ఓవర్ అంటే రుణం కాదు. కానీ ఏడాది కాలం పాటు పాకిస్తాన్ కేంద్ర బ్యాంక్‌లో వుంచే ఆర్థిక డిపాజిట్. సిబ్బంది స్థాయిలో ఒప్పందం కుదుర్చుకునే దిశగా ముందుకు కదలాలంటే ఐఎంఎఫ్ బాహ్య ఆర్థికావసరాలను తీర్చడంలో ఈ రోల్‌ఓవర్ డిపాజిట్ ఒకటని ది న్యూస్ ఇంటర్నేషనల్ పేర్కొంది. పాక్ ఆర్థిక మంత్రి ఇషాక్ దర్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. 110 కోట్ల డాలర్ల రుణం కోసం ఫిబ్రవరి నుండి ఐఎంఎఫ్, పాకిస్తాన్ చర్చలు జరుపుతున్నాయి.

15 రోజుల్లోగా లొంగిపోండి : సుప్రీం

న్యూఢిల్లీ : కోవిడ్-19 మహమ్మారి సమయంలో విడుదలైన ఖైదీలు, విచారణ ఖైదీలందరూ 15 రోజుల్లోగా లొంగిపోవాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. అత్యవసర బెయిల్‌పై విడుదలైన విచారణ ఖైదీలు లొంగిపోయిన తరువాత రెగ్యులర్ బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. కరోనా సమయంలో విడుదలైన ఖైదీలందరూ లొంగిపోయిన తరువాత తమ శిక్షను రద్దు చేసుకోవడానికి న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చనని తెలిపింది.

మోడీ సొంత రాష్ట్రంలో పెరిగిన పేదరికం

బీపీఎల్ జాబితాలో కొత్తగా 1359 కుటుంబాలు

- 'అభివృద్ధి చెందిన గుజరాత్'లో రెండేండ్లలో ఇదీ పరిస్థితి
- ఇప్పటికీ 31.67 లక్షలకు పైగా బీపీఎల్ కుటుంబాలు
- రాష్ట్ర ప్రభుత్వం సమాచారం

అహ్మదాబాద్: అభివృద్ధి విషయంలో దేశానికి గుజరాత్ ఒక మోడల్ అంటూ ప్రధాని మోడీ తన సొంత రాష్ట్రం గురించి పలు సందర్భాల్లో, అనేక వేదికల్లో ప్రచారం చేసుకున్నారు. అయితే, ఆ రాష్ట్రంలో మాత్రం పేదరికం పెరుగుతున్నది. దారిద్ర్య రేఖకు దిగువ (బీపీఎల్) ఉన్న కుటుంబాల సంఖ్య గత రెండేండ్లలో పైకి ఎగబాకింది. శాసనసభలో గుజరాత్ ప్రభుత్వం అందించిన సమాచారంతో ఈ విషయం వెల్లడైంది.

రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ప్రకారం.. గత రెండేండ్లలో బీపీఎల్ జాబితాలో 1359 కుటుంబాలు వచ్చి చేరాయి. గుజరాత్‌లో 2023 జనవరి 31 నాటికి రాష్ట్రంలో 31.67 లక్షలకు పైగా బీపీఎల్ కుటుంబాలు ఉన్నాయి. 20 ఏండ్ల క్రితం నిర్వహించిన సర్వే ప్రకారం బీపీఎల్ కార్డు హోల్డర్ల సంఖ్య పెరగడంపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

అట్టడుగుకు చేరని ఆదాయం

గుజరాత్ ప్రభుత్వం ఈ సమయంలో కొత్త సర్వే నిర్వహిస్తే ప్రస్తుతం ఉన్న బీపీఎల్ కుటుంబాల సంఖ్య పెరగొచ్చని వారు తెలిపారు. " గుజరాత్ అభివృద్ధి చెందిన రాష్ట్రమనీ, ఈ రాష్ట్రాన్ని దేశానికి, ప్రపంచానికి మోడల్‌గా చూపుతున్నప్పుడు రాష్ట్రంలో ఇంత సంఖ్యలో పేద కుటుంబాలు ఉండటం బాధాకరం" అని ప్రొఫెసర్, ఆర్థికవేత్త హేమంత్ కుమార్ షా అన్నారు. గుజరాత్ ఆదాయం జాతీయ తలసరి ఆదాయం కంటే గణనీయంగా ఎక్కువగా ఉన్నదనీ, అయితే ఆ ఆదాయం గుజరాత్ సమాజంలోని అట్ట డుగు ప్రజలకు ఇంకా చేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే రాష్ట్రంలో బీపీఎల్ కుటుంబాల సంఖ్య పెరిగిందని చెప్పారు.

అమ్రేలీ జిల్లాలో బీపీఎల్ కుటుంబాలు అధికం

ప్రభుత్వ సమాచారం ప్రకారం అధికంగా అమ్రేలీ జిల్లాలో కొత్తగా 425 కుటుంబాలు బీపీఎల్ జాబితాలో వచ్చి చేరాయి. 2021లో ఈ సంఖ్య 309, 2022లో 116 గా ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానంలో గిరిజనులు అధికంగా ఉండే సబర్‌కాంత (301 కుటుంబాలు), బనస్కాంత (199), ఆనంద్ (168), జునాగఢ్ (149) జిల్లాలున్నాయి. భారత్‌లో గ్రామీణ ప్రాంతాలలో రోజువారీ ఖర్చు రూ. 27.2, పట్టణ ప్రాంతాల్లో రూ. 33.3 ను దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టుగా పరిగణిస్తారు.

20 ఏండ్ల క్రితం చివరి సర్వే

గుజరాత్ ప్రభుత్వం 20 ఏండ్ల క్రితం బీపీఎల్ కుటుంబాలపై చివరిసారిగా ఒక సర్వే నిర్వహించిందనీ, అయితే కోవిడ్ మహమ్మారి తర్వాత ఈ సర్వే చాలా అవసరమని సూచించారు. బీపీఎల్ జాబితా సర్వే 2002-2003లో పూర్తయిందన్న విషయాన్ని రాష్ట్ర శాసన సభలో గుజరాత్ ప్రభుత్వం అంగీకరించింది. "1999-2000లో పేద కుటుంబాల సంఖ్య 26.19 లక్షలు. ఇప్పుడు అది 31 లక్షలకు పెరిగింది. కాబట్టి 22 ఏండ్ల వ్యవధిలో బీపీఎల్ కుటుంబాల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం కొత్త సర్వే నిర్వహిస్తే నేను మరో ఐదు లక్షల కుటుంబాలు అదనంగా వచ్చి చేరుతాయని [illegible] అనుకుంటున్నాను. కరోనా మహమ్మారి కారణంగా మధ్యతరగతి పరిస్థితి క్షీణిస్తున్నది. వారు చాలా అప్పుల పాలయ్యారు" అని హేమంత్ కుమార్ షా అన్నారు.

నల్లధనం తెస్తామన్న హామీపై బీజేపీని నిలేయండి..

మునిగోడు నుంచి అచ్చిన ప్రశాంత్



విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ఒక్కో భారతీయుడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామంటూ చెప్పటం ద్వారా మోడీ గద్దెనెక్కారని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గుర్తు చేశారు. ఆ హామీపై ఇప్పుడు బీజేపీ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. గతంలో పన్నుల ద్వారా రాష్ట్రాలకు ఆదాయాలు లభించేవని, ఇప్పుడు జీఎస్టీ పేరుతో వాటి ఆదాయాలకు గండి కొట్టి బెదిరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రకంగా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం సరిగా పనిచేసుకోనివ్వడం లేదన్నారు. సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్యయాత్ర ఎనిమిదో రోజైన శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం వి.వెంకటాయపాలెంలో ప్రారంభమై ముదిగొండలో ముగిసింది. జన చైతన్యయాత్రకు ఊరూరా ప్రజలు ఘన స్వాగతం పలికారు. వందలాది మోటారు సైకిళ్లు, ఆటోలతో చేపట్టిన ప్రదర్శన యాత్రకు మంచి ఊపు తెచ్చింది. తిరుమలాయపాలెం, కూసుమంచి, తెల్దార్‌పల్లి, ముదిగొండ సభల్లో తమ్మినేని మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాల్లో ఒక్కదాన్ని కూడా మోడీ సర్కారు నెరవేర్చలేదని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ఎనిమిదిన్నరేండ్ల కాలంలో బీజేపీ సర్కారు మూడు కోట్ల ఉద్యోగాలకు కోతపెట్టిందని, ఉద్యోగాలు కొలువులు కోల్పోయిన వారందర్నీ రోడ్డుపాలుజేసిన తీరును వివరించారు. ఆర్టీసీ, విద్యుత్, రైల్వే, తదితర వ్యవస్థలను కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తున్న బీజేపీ విధానాలను ఎండగట్టారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడేందుకు బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తమ్మినేని ఈ సందర్భంగా అన్నారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు కేసీఆర్ సర్కారు రూ.20 వేల మేర నష్టపరిహారం ఇవ్వాలంటూ సీఎం కేసీఆర్ సూచించగా రూ.10 వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నారని తెలిపారు. కౌలు రైతులకు కూడా పరిహారం ఇవ్వాలనే డిమాండ్‌కు కూడా సీఎం అంగీకరించారని చెప్పారు. తెల్దార్‌పల్లి గ్రామ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, తెల్దార్‌పల్లి గ్రామంలో సీపీఐ(ఎం) కు పూర్వవైభవం తేవాలని పిలుపునిచ్చారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ..తెల్దార్‌పల్లి పోరాటాల గడ్డ అనీ, కమ్యూనిస్టు వారసత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధి గుజరాత్‌లోని ఏ ఒక్క గ్రామంలోనైనా కనిపిస్తుందా? అని మోడీని ప్రశ్నించారు. ప్రజాతంత్రవాదులంతా నాశనం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఆ పార్టీని ఎదుర్కోవడానికి అభ్యుదయవాదులంతా ముందుకు రావడం మంచి పరిణామం అన్నారు. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో దళితులను తీవ్రస్థాయిలో అణచివేస్తున్నారని వాపోయారు.

తెల్దార్‌పల్లిలో మాత్రం దళితులు, అన్ని సామాజిక తరగతుల వాళ్లు కలిసికట్టుగా ఉంటున్నారని చెప్పారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ...భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన గడ్డ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వంట గ్యాస్ ధరను మూడు రెట్లు పెంచిన మోడీ సర్కారుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కేంద్రం అనుసరిస్తున్న దుర్మార్గపు విధానాల వల్లే నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెప్పారు. బీజేపీ ఏలుబడిలో మహిళలపై దాడులు తీవ్రమయ్యాయని తెలిపారు. మహిళలపై వివక్ష చూపుతున్న ఆ పార్టీని గద్దెదింపాలని పిలుపునిచ్చారు.



ఖమ్మం జిల్లా కూసుమంచిలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రకు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టులకు ఆయన ఈ సందర్భంగా అభినందనలు చెప్పారు. బీఆర్ఎస్, కమ్యూనిస్టులు కలిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీట్లన్నీ బీఆర్ఎస్ కూటమికే దక్కుతాన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. 'బావ ఉపేందర్‌రెడ్డి తమ యాత్రకు సంఘీభావం తెల పటం సంతోషకరం...' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో పాలేరు సీటు సీపీఐ(ఎం)కు కేటాయిస్తే ఉపేందర్‌రెడ్డి మనస్ఫూర్తిగా ప్రచారం చేయాలని కోరారు. ఒకవేళ ఆ సీటును బీఆర్ఎస్‌కు ఇస్తే ఉపేందర్‌రెడ్డిని దగ్గరుండి గెలిపించు కుంటామని హామీ నిచ్చారు. ముదిగొండలో నిర్వహించిన సభలో బీజేపీ ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొని యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సభల్లో పాదయాత్ర బృంద నాయకుడు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబుతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పంట సాయం సరే...

- జూలై 2022లో పంట నష్టపోయిన రైతుల పరిస్థితి ఏంటి?: రైతు స్వరాజ్య వేదిక ప్రశ్న



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని రైతు స్వరాజ్య వేదిక నాయకులు చెప్పారు. కానీ జూలై 2022లో భారీ వర్షాలకు దెబ్బతిని లేక కొట్టు నష్టపోయిన తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు సాయం చేయరా? అంటూ బాధితుల పక్షాన ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రైతు స్వరాజ్యవేదిక నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రతి వైపరీత్యాల బాధిత రైతులు, కౌలు రైతులు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు విస్సా కిరణ్ కుమార్, బి. కొండలరెడ్డి, కన్నెగంటి రవి, ఎస్. ఆశాలత మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టానికి సంబంధించి పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కౌలు రైతుల ప్రస్తావన తెచ్చారని గుర్తు చేశారు. 2011 చట్టం ప్రకారం కౌలు రైతుల గుర్తింపుపై విధానపరమైన నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత మూడేండ్లలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, పటిష్టమైన పంట బీమా పథకం అమలు చేయాలని కోరారు. గత మూడేండ్లలో తీవ్ర పంట నష్టాన్ని చవిచూసిన దుర్గారెడ్డి, బాలయ్య, కుసుమ సంద్రం రమేష్ తమ ఆవేదన వ్యక్తం చేశారు.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే..టెక్స్‌టైల్ రంగం నిర్వీర్యం

- పోరాడి సాధించుకున్న పథకాలకు కేంద్రం మంగళం: వెబినార్‌లో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకే టెక్స్‌టైల్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని పూర్వ ఎమ్మెల్సీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ సమన్వయంతో 'తెలంగాణ టెక్స్‌టైల్ పార్కు ప్రధాని ప్రకటన నేపథ్యం- ప్రయోజనం' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన పథకాలను బీజేపీ సర్కార్ రద్దు చేస్తున్నదని చెప్పారు. నేషనల్ హండ్లూం బోర్డు,నేషనల్ టెక్స్‌టైల్ బోర్డు తదితర సంస్థలు, స్కీములను రద్దుచేయటంపై ఆందోళన వ్యక్తం చేశారు. నేతేశ్లకు ఉపయోగపడే పథకాలను రద్దు చేసి, కార్పొరేట్లకు లాభాలు తెచ్చి పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్త శుద్ధి ఉన్నా..టెక్స్‌టైల్ రంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలకు కేంద్రం మద్దతుగా ఉండాలన్నారు. రాష్ట్రంలో 11 టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. వాటి అందులో కొన్ని అసంపూర్ణంగా ఉన్నాయని వివరించారు. మౌలిక వసతుల ఏర్పాటులో నిర్లక్ష్యం జరుగుతున్నదని చెప్పారు. ఇవి సద్వినియోగంలోకి రావాలంటే..కేంద్రం కూడా సహకరించాలని సూచించారు. వరంగల్‌లోని ఆజంజాహీమిల్ ఎప్పుడో మూతపడిందన్నారు.

ఐదువేల మంది కార్మికుల బతుకులు బజారుపాలయ్యాయని వాపోయారు. బీజేపీ యేతర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలకు కేంద్రం సహకరించటం లేదన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం ఏ మాత్రం సహకరించలేదని విమర్శించారు.

దీనిని పట్టించుకోకపోవటానికి ఒకే ఒక కారణం పెద్దపెద్ద బట్టల మిలుల ప్రయోజనాలు కాపాడటమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు కూడా సిరిసిల్లకే పరిమితం చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. మిగతా రాష్ట్రాల్లో ఇలాంటి స్కీములను ఎందుకు అమలు చేయటం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వివిధ స్కీములను ప్రవేశ పెట్టేటప్పుడు ఆయా రంగాల నిపుణులతో, సంఘాలతో చర్చించాలని సూచించారు.తెలంగాణ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలన్న చిరకాల డిమాండ్ తలొగ్గి కేంద్రం ఎట్టకేలకు నిర్ణయం తీసుకోవటం మంచిదేనన్నారు.

బీజేపీ దుశ్చర్యకు పరాకాష్ట : లోక్‌సభలో బీఆర్ఎస్ పక్షనేత నామ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు కేంద్ర ప్రభుత్వ దుశ్చర్యకు పరాకాష్ట అని లోక్‌సభలో బీఆర్ఎస్ పక్షనేత నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమాలను ప్రశ్నిస్తారనే భయంతోనే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని విమర్శించారు. కేంద్రం ప్రజాస్వామ్య మూలాలను, రాజ్యాంగ విలువలను తిలో దాకలిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో నేడు చీకటి రోజుగా ఆయన అభివర్ణించారు. దర్యాప్తు సంస్థల అండతో ప్రతిపక్షాల గొంతు నొక్కు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్య ఖూని చేసేలా కేంద్రం చర్యలున్నాయని తెలిపారు. బీజేపీ దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారని, దేశ ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తప్పక తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రైల్వే ప్రాజెక్టులపై కేంద్రం శీతకన్ను

ఊసేలేని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక ప్రాజెక్టులు

- రైల్వే లైన్లకు దక్కని ప్రాధాన్యం
- రైలుకూతకు నోచని ఆరు నియోజకవర్గాలు




నవతెలంగాణ-సూర్యాపేట

కొత్త రైల్వే లైన్లు.. ప్రతిపాదిత లైన్లపైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపుతోంది. ప్రతి బడ్జెట్‌లోనూ నిరాశే మిగుల్చుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నో ఏండ్లుగా ప్రజలు పోరాడుతున్నా పాలకులు రైల్వే ప్రాజెక్టుల గురించి మాటైనా మాట్లాడటం లేదు. ఆమోదం పొందిన ప్రాజెక్టులకూ నిధులు కేటాయించడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానులను కలుపుతూ సికింద్రాబాద్ - విజయవాడ మార్గంలో హైస్పీడ్ రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. దీనిపై పార్లమెంట్‌లో ఎంపీలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం నుంచి ఉలుకు పలుకు లేదు.

యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఉన్న ఎన్‌హెచ్ 65 వెంట రైల్వే లైన్ నిర్మిస్తే ప్రజా, సరుకు రవాణాకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 93, షెడ్యూల్ 13లో చెప్పిన ప్రకారం తెలంగాణ-ఏపీ మధ్య ర్యాపిడ్ రైల్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. 2024వరకు పూర్తిచేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ ప్రారంభమే కాలేదు. సూర్యాపేట మీదుగా హైదరాబాద్-విజయవాడ మధ్య హైస్పీడ్ రైలు కనెక్టివిటీ కల్పించాల్సి ఉంది. జాతీయ రహదారి 65 వెంబడి సేకరించిన భూమిని ఉపయోగించుకొని ఈ రెండు నగరాల మధ్య హైస్పీడ్ రైలు మార్గం నిర్మించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎంపీలు పలుమార్లు లోక్‌సభ, రాజ్యసభ సమావేశాల్లో డిమాండ్ చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులూ చేయలేదు. ఉమ్మడి జిల్లాలో కీలక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండగా.. ప్రతి సంవత్సరం వీటిపై జిల్లా ప్రజలు తమ డిమాండ్లను వినిపిస్తూనే ఉన్నారు.

నల్లగొండ జిల్లా మీదుగా ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన బీబీనగర్ - నడికుడి రైల్వే లైను డబ్లింగ్ చేయాలని ఏండ్లుగా డిమాండ్ ఉంది. దీనికి 2019-20లో కేంద్ర ఆమోదించినా నిధుల కేటాయింపు జరపడం లేదు. మొత్తం 248 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గంలో రూ.2480 కోట్ల అంచనాతో డబ్లింగ్ పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే, దీనిని పూర్తి చేసేందుకు నిధుల కేటాయింపు అరకొరగానే ఉన్నది. ఈసారి బడ్జెట్‌లో రూ.60 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ లైన్లో డబ్లింగ్ పూర్తైతే మరిన్ని రైళ్ల రాకపోకలతో పాటు సమయం ఆదా కానుంది. ఆదేవిధంగా ఇదే రూట్లో 285 కిలోమీటర్ల పొడవైన పగిడిపల్లి, నల్లపాడు మధ్య విద్యుదీకరణ పనులకు రూ.32.8 కోట్లు కేటాయిస్తున్నట్టు ఐదేండ్ల బడ్జెట్లో ప్రకటించారు. ఇవి కూడా నామమాత్రమే.



జిల్లాకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలి

జిల్లాకు రైల్వే లైన్ సదుపాయం కలిపిస్తే వ్యాపార, వాణిజ్య పరంగా మరింత అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్ నుంచి విజయవాడకి కలుపుతూ సూర్యాపేట, కోదాడ మీదుగా రైల్వేలైను మంజూరు చేయాలి. దీని వల్ల రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సులభమవుతుంది. జిల్లాకు రైల్వే లైన్ ఏర్పాటు విషయంలో కొన్ని దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోంది. మా జిల్లాకు సంబంధించిన రైల్వే ప్రాజెక్టుల గురించి ఇటీవలి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణం.

- సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి


హైస్పీడ్ రైల్వే నిర్మాణం ఊసేది?

సికింద్రాబాద్- విజయవాడ మార్గంలో 256 కిలోమీటర్ల మేర హైస్పీడ్ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఉంది. అయినా దీని ఊసే ఎత్తడం లేదు. ప్రస్తుతం ఉన్న సికింద్రాబాద్- కాజీపేట రూట్లో ఉన్న డబుల్ లైన్‌కు అదనంగా మరో లైన్ వేస్తూ ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు 34 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ప్రస్తావనకు నోచు కోలేదు. కృష్ణా నది వెంట ఉన్న సిమెంట్ పరిశ్రమల కోసం ఏర్పాటు చేసిన మోట మర్రి- విష్ణుపురం 90 కిలోమీటర్ల పొడవున సింగిల్ లైన్ మాత్రమే ఉంది. దీనిని డబుల్ లైన్‌గా మార్చాల్సి ఉంది. రెండేండ్ల కిందట కేంద్రం ఆమోదం తెలిపినా ఆచరణకు నోచు కోలేదు. ఈ లైన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఉపయోగ పడుతుంది. 1997- 98లో స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా మంజూరైన మాచర్ల-నల్లగొండ, మచిలీపట్నం - మాచర్ల రైల్వే లైన్ పనులు ప్రస్తావన నేటికీ నోచుకోలేదు. ఐదారేండ్ల కిందట 170 కిలోమీటర్ల సూర్యాపేట-సిద్ధిపేట ద్వారా లైన్ సర్వే నిమిత్తం రూ.25.45 లక్షలు కేటాయించిన కేంద్రం తర్వాత పట్టించుకోలేదు. ఆదేవిధంగా గుంటూరు డివిజన్ పరిధిలో ఉన్న మిర్యాలగూడ, నల్లగొండ, విష్ణుపురం, చిట్యాల రైల్వే స్టేషన్ల నుంచి రైల్వే శాఖకు భారీగా ఆదాయం సమకూరుతోంది. కాగా బియ్యం, సిమెంటు వంటి సరుకుల రవాణాతోనే ఉత్తర్వులు ఏగుమతితో ఏటా సుమారు రూ.250 కోట్లకుపైగా ఆదాయం వస్తున్నట్టు అంచనా. కానీ, నేటికీ సింగిల్ లైన్ ఉండటం వల్ల సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రైళ్ల రాకపోకలకు ఆలస్యం అవుతోంది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఒక్క కీలక ప్రాజెక్టునూ ప్రస్తావించలేదు.

హైదరాబాద్ నుంచి విజయవాడకు సూర్యాపేట, కోదాడ మీదుగా బుల్లెట్ రైలు మంజూరు చేయాలని జిల్లా ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. అయినా కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మరోసారి మొండి చెయ్యి చూపారు. పోచంపల్లి బీబీనగర్ ఏర్పాటు, ఫ్లోరైడ్ మిటిగేషన్ రీసెర్చ్ సెంటర్ డిమాండ్లను పట్టించుకున్న పాపాన పోలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, నాగార్జునసాగర్, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాలు రైలు కూతకు నోచుకోలేదు.

బడ్జెట్‌లో మొండిచెయ్యి

రైల్వేశాఖ పరంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్రం నిర్లక్ష్యం చూపుతోంది. బీబీనగర్ - గుంటూరు లైన్ డబ్లింగ్‌కు మరోసారి మొండిచెయ్యి చూపింది. జిల్లా ప్రాజెక్టుల విషయంలో అనేకసార్లు కేంద్రమంత్రులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది. జిల్లాలోని కీలకమైన రాయగిరి ఎంఎంటీఎస్ పొడిగింపు, బీబీనగర్- నడికుడి డబ్లింగ్ పనులు, సికింద్రాబాద్- కాజీపేట మార్గంలో మూడోలైన్ నిర్మాణం, రెండు రాజధానుల మధ్య హైస్పీడ్ రైల్వేలైన్ వంటి కీలకమైన వాటిని కూడా కేంద్రం పెడచెవిన పెట్టింది. ఇప్పటికే పార్లమెంట్ సమావేశాల్లో వీటి గురించి ప్రస్తావించాం. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది.



- రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

ఇంటర్ పరీక్షల్లో ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా కరీంనగర్‌లో ఇద్దరు, సంగారెడ్డిలో ఐదుగురు చొప్పున మొత్తం ఏడుగురిపై మాల్‌ప్రాక్టీస్ కింద కేసులు నమోదు చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మ్యాథమెటిక్స్ పేపర్-2బి, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2 సబ్జెక్టులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రాతపరీక్ష రాశారని పేర్కొన్నారు. ఈ పరీక్షకు 3,41,013 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 3,30,920 (97.1 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 10,093 (2.9 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ పరీక్షల కోసం ఏ సెట్ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో ఇంటర్ బోర్డు పరిశీలకులు పర్యటించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారని తెలిపారు.

నయాహిట్లర్‌లా వ్యవహరిస్తున్న మోడీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం మోడీ ప్రభుత్వ ఫాసిస్టు, నిరంకుశ చర్యకు నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. నయా హిట్లర్ ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్షాలను చూస్తే ఆయన వణికిపోతున్నారని పేర్కొన్నారు. ఆదానీ కుంభకోణం నుంచి బయటపడేందుకే రాహుల్‌ను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. మోడీ గతంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు పేరుపెట్టి అనేక రకాలుగా అవమానాలు చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. దేశంలో నియంత పాలన సాగుతున్నదని విమర్శించారు. ప్రతిపక్షాలేకుండా పార్లమెంట్ ప్రజాస్వామ్యాన్ని హతమార్చే విధంగా బీజేపీ వ్యవహరిస్తున్నదని తెలిపారు. సూరత్ కోర్టు రాహుల్‌కు రెండేండ్ల జైలు శిక్ష విధించిన అప్పీలుకు నెలరోజుల గడువు ఇచ్చిందని, అయినా ఇంత హడావుడిగా అనర్హునిగా ప్రకటించడం వెనక కుట్ర దాగి ఉందని పేర్కొన్నారు. నియంతృత్వ మోడీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. అన్ని వ్యవస్థలనూ వారి ఆధీనంలోకి తీసుకుని ప్రశ్నించే గొంతుకలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. చరిత్ర కాలగర్భంలో కలిసి పోయిన వారిలాగే మోడీకి పతనుడని హెచ్చరించారు. ఆదానీ కుంభకోణం కేసు పక్కదారి పట్టించడానికే రాజ్యాంగ విరుద్ధంగా రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు వేశారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ఈటి నరసింహ విమర్శించారు.

ప్రజాస్వామ్యం గొంతు నొక్కే చర్య : ప్రజాపంథా

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై పార్లమెంటు సెక్రటేరియట్ అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యం గొంతు నొక్కే చర్య అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. సూరత్ కోర్టు విధించిన శిక్షను అప్పీలు చేసుకునే సమయం కూడా ఇవ్వకుండా ఆదరాబాదరగా మోడీ ప్రభుత్వం అనర్హత వేటు వేయడం ఫాసిస్టు చర్య అని విమర్శించారు. ప్రతిపక్షం గొంతు లేకుండా చేయాలని దుష్ట పథకంలో భాగాలక ప్రకారమే మోడీ ప్రభుత్వం ఈ చర్యకు పూనుకుందని పేర్కొన్నారు. అనర్హత వేటును రద్దు చేయాలని, న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా ఉండాలని కోరారు.

గీతం ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- టాప్ ర్యాంకర్లకు ఆకర్షణీయమైన స్కాలర్‌షిప్‌లు: ప్రోవీసీ డీఎస్ రావు వెల్లడి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌తోపాటు విశాఖపట్నం, బెంగళూరు ప్రాంగణాల్లో వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆ వర్సిటీ ప్రోవీసీ ప్రొఫెసర్ డీఎస్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. దేశవ్యాప్తంగా 48 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) పద్ధతిలో పరీక్షలను నిర్వహిస్తామని అన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీకి యూజీసీ ఏర్పాటు చేసిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ వచ్చిందన్నారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్, పబ్లిక్ పాలసీ వంటి కోర్సులను నిర్వహిస్తు న్నామని వివరించారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) ప్రకారం లిబరల్ ఆర్ట్స్ కోర్సులను అందిస్తున్నామని చెప్పారు. సైన్స్, మేనేజ్‌మెంట్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డొమైన్ల నుంచి 25 విభాగాల్లో మేజర్, మైనర్ సబ్జెక్టులను విద్యార్థులు ఎంచుకోవచ్చని అన్నారు. మొదటి సెమిస్టర్ విద్యార్థులందరికీ ఒకేలా ఉంటుందని, రెండో సెమిస్టర్ నుంచి సబ్జెక్టులను ఎంచుకుని చదవొచ్చని సూచించారు. గీతం అడ్మిషన్ టెస్ట్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఈనెల 31 నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు నిర్వహిస్తామని వివరించారు. గీతం ప్రవేశ పరీక్షతోపాటు జేఈఈ మెయిన్, ఈఏపీసెట్, తెలంగాణ ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ ర్యాంకర్లకు ఆకర్షణీయమైన స్కాలర్‌షిప్‌లను అందజేస్తామన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రవేశాల్లో ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తామని చెప్పారు. తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి లాయర్లు, ఉద్యోగుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామని అన్నారు. గీతం ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు రూ.1,200 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు ఉపయోగించే www.gitam.edu వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అడ్మిషన్స్ డైరెక్టర్ సి ఉదయ్ కుమార్, అధ్యాపక విభాగాధిపతి కె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ల కోసం ఉద్యమం ఉధృతం

- వివిధ రూపాల్లో దేశవ్యాప్తంగా కార్యక్రమాలు
- యూనివర్సిటీలు, కాలేజీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు:

కార్యాచరణ ప్రకటించిన కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడానికి వీలుగా మహిళా బిల్లును తీసుకురావాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.ఈ మేరకు ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్టు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు. మిస్డ్ కాల్ కార్యక్రమాన్ని మొదలుపెట్టడంతోపాటు దేశంలో యూనివర్సిటీలు, కాలేజీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చాగోష్ఠులను నిర్వహించనున్నారు. వచ్చే నెలలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా ఆమె ప్రణాళిక రూపొందించారు. మహిళా బిల్లుకు మద్దతు కోసం దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఆలోచనపరులు, మేధావులకు కవిత పోస్టు కార్డులు రాయనున్నారు. మహిళా బిల్లు ఉద్యమాన్ని విస్తరించడంలో భాగంగా ఆమె శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టర్ ను విడుదల చేశారు. "మహిళలకు సాధికారత కల్పిద్దాం, దేశానికి సాధికారత కల్పిద్దాం. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి...మహిళా రిజర్వేషన్ బిల్లు ఎందుకు ప్రాధాన్యం కాకూడదు" అని పోస్టర్ లో పేర్కొన్నారు.

ఉగాది పురస్కారం అందుకున్న డాక్టర్ రామచంద్రరావు



నవతెలంగాణ - సరూర్ నగర్

వేదహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసారంలో వేదహిత ఫౌండేషన్ ప్రాంగణం నందు శోభకృత్ నామ ఉగాది వేడుకల సందర్భంగా చండీ హెూమం, పంచాంగ శ్రవణం, ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగాయి. ఆర్కే పురం డివిజన్ చిత్రా లేఅవుట్‌కు చెందిన ఎస్. ఆర్. ఆర్.చారిటబుల్ ట్రస్టు చైర్మెన్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. రామచంద్ర రావు చేస్తున్న సేవలను గుర్తించి వేదహిత ఫౌండేషన్ చైర్మెన్ మన్యురింద్ర శర్మ అందజేశారు. అనంతరం ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ ఎస్. రామచంద్రరావును శాలువా, మొమెంటో, ప్రశంసాపత్రం, మెడల్‌తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మహాలక్ష్మి, రచయిత కె.మురళీమోహన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలి'



నవతెలంగాణ-మీర్ పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 29వ డివిజన్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ లలో వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిక్ జైన్‌కు కార్పొరేటర్ నీలా రవి నాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు సంవత్సరం దాటినా ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో మంచినీటి సౌకర్యం కల్పించకపోడం దారుణమన్నారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్, హౌసింగ్ బోర్డ్ అధికారుల దష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. పేద ప్రజలు ప్రతీరోజు మంచినీటిని కొనుక్కొని తాగుతున్నారని తెలిపారు. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ బీజేపీ ఎస్టీ మోర్చ అధ్యక్షుడు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ కేంద్రంగా సైబర్ మోసాలు

- రిలయన్స్ క్యాపిటల్ ఫైనాన్స్ పేరుతో ఆపరేషన్స్
- దేశవ్యాప్తంగా రూ.5 కోట్లమేర వసూళ్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రిలయన్స్ క్యాపిటల్ ఫైనాన్స్ పేరుతో లోన్స్ ఫ్రాడ్ చేస్తున్న ముఠా గుట్టును సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. ఢిల్లీ కేంద్రంగా కాల్‌సెంటర్ నిర్వహిస్తున్న నలుగురు నిందితులను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కంప్యూటర్, 17 సెల్‌ఫోన్స్, 7 ల్యాప్‌టాప్స్ స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా రూ.5కోట్లకు పైగా మోసాలు చేసినట్లు గుర్తించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ప్రసాద్‌తో కలిసి డీసీపీ స్నేహ మెహ్రా వివరాలను వెల్లడించారు. హరియాన ఫరీదాబాద్‌కు చెందిన తరుణ్ ఓజా, గురు చరణ్ సింగ్, యోగేందర్ సింగ్, జార్ఖండ్‌కు చెందిన షహదత్ అన్సరీలు సులువుగా డబ్బులు సంపాదించాలని ఆలోచించారు. ఇందులో భాగంగా ఢిల్లీలో నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. రిలయన్స్ క్యాపిటల్ ఫైనాన్స్ కంపెనీ పేరుతో ఫేక్ వెబ్‌సైట్ క్రియేట్ చేశారు. లోన్స్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేసేవారిని టార్గెట్ చేశారు. ఆన్‌లైన్‌లో వారి ఫోన్ నంబర్స్ సేకరించేవారు. వారికి కాల్స్ చేసేందుకు 10మందికి పైగా టెలికాలర్స్‌ను నియమించారు. టెలికాలర్స్‌కి అనుమానం రాకుండా ఉండేందుకు నిజమైన రిలయన్స్ క్యాపిటల్ ఫైనాన్స్ కంపెనీ విధంగా ఆపరేషన్స్ చేసేవారు. సైబర్ చీటింగ్ గురించి టెలికాలర్స్‌కు తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వారికి అనుమానం వచ్చేలోగా ఉద్యోగాల నుంచి తొలగించేవారు.

గూగుల్‌లో సెర్చ్ చేస్తే కాల్స్ టార్గెట్

గూగుల్ సెర్చ్ ఆధారంగా లోన్ కస్టమర్లకు కాల్స్ చేసి లోన్ అప్లికేషన్ ప్రొఫార్మా పంపించేవారు. డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ సహా రుణాలు ఇచ్చేవరకు వివరాలతో ట్రాప్ చేసేవారు. ఆ తరువాత రుణం మంజూరైందని.. ప్రాసెసింగ్ ఫీ, జీఎస్‌టీ, ఇన్‌కమ్ ట్యాక్స్ సహా ఇతర ఛార్జీలను వసూలు చేసేవారు. ఇలా హైదరాబాద్‌కు చెందిన ఓ సీనియర్ సిటీజన్ నుంచి రూ.32 లక్షలు వసూలు చేశారు. రుణం అప్రూవల్ అయిందని ఫేక్ మెయిల్ పంపించారు. అయితే వారు చెప్పిన విధంగా డబ్బులు డిపాజిట్ కాకపోవడంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఢిల్లీలో కాల్ సెంటర్‌పై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. 10 మంది టెలికాలర్స్‌కి నోటీసులు అందించారు. నిందితుల డేటాబేస్‌లో 27 మంది బాధితులున్నట్టు గుర్తించాలమని డీసీపీ తెలిపారు.

ఉత్తమ గ్రామాలకు అవార్డులను అందజేసిన మంత్రి



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో (దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కర్) జాతీయ గ్రామ పంచాయతీ అవార్డుల్లో భాగం గా ఘట్కేసర్ మండల గ్రామపంచాయతీ సర్పంచ్, ఎంపీ టీసీ, పంచాయతీ కార్యదర్శులకు అవార్డుల ప్రధానోత్సవం, సన్మానం శుక్రవారం జరిగింది. కొర్రెముల గ్రామానికి నేషనల్ పంచాయతీ నాలుగు అవార్డులను మంత్రి మల్లారెడ్డి సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్‌ను అభినందించి శాలువతో సన్మానించి నాలుగు అవార్డులు సెక్యూర్డ్ పంచాయతీలో మొదటి బహుమతి రెండో బహుమతి పవర్టి ఫ్రీ పంచాయతీ, మూడో బహుమతి చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, నాలుగో బహుమతి క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఎంపీడీఓ అరుణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు

'నిరంకుశ బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి'



నవతెలంగాణ-మీర్‌పేట్

నిరంకుశ బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని డీసీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీని పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ జిల్లెలగూడలో మౌన దీక్ష నిర్వహించి మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక దొంగదారిలో కేసు పెట్టారని విమర్శించారు. అంతటితో ఆగకుండా పార్లమెంట్ సభ్యత్వాన్ని సైతం రద్దు చేయడం బీజేపీ నిరంకుశ పాలనను తెలియజేస్తుందని పేర్కొన్నారు. పరువు నష్టం కేసులో రెండేండ్లు జైలు శిక్ష విధించటాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపీకి ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పీసీసీ సభ్యులు ఎల్మేటి అమరేందర్ రెడ్డి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు బాబు, మీర్ పేట్ అధ్యక్షుడు సామిడి గోపాల్ రెడ్డి, చల్లా బాల్ రెడ్డి, సిద్దాల శ్రీశైలం, కీసర యాది రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తులకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలం

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో ఎండ,వాన,చలి అనే తేడాలేకండా ఎంతో కష్టపడి పని చేసే వడ్డెర కులస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్, మల్లాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో తెలంగాణ వడ్డెర యువజన సంఘం అధ్యక్షులు ఐలమల్లు ఆదేశం మేరకు బాలాపూర్ మండల వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు.అనంతరం మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షలపైన జనాభా ఉన్న వడ్డెర కులస్తులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కనీసం సబ్సిడీ, రిజర్వేషన్లు అంతగా లేకపోవడంతో ఉపాధి పనులు సైతం కరువైనట్టు తెలిపారు. వడ్డెర కులస్తులను బీసీ జాబితా నుంచి తొలగించి ఎస్టీలో జాబితాలో చేర్చాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్న వారి ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకుని వారికి న్యాయం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నేనవత్ బాలు నాయక్, మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి, జెనిగ శ్రీనివాస్ యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.నాగేష్, బాలాపూర్ మండల అధ్యక్షుడు గండికోట యాదయ్య కమిటీ సభ్యులు వి.పెద్ద యాదయ్య,యం.భీమయ్య,వి. చిన్న యాదయ్య, వి.మల్లేష్, జి.వెంకటేష్, పి.రమేష్, వి.శివ, కె.సత్యనారాయణ, వి.శ్రీనివాస్, డి.గోపాల్, జి.రంగయ్య, జి.అంజయ్య, వి.నర్సింహ, వి.విగ్నేశ్వర్, ఆర్.శ్రీనివాస్,వి.అంజయ్య, వి.నారాయణ, వి.శ్రీకాంత్, వి.శ్రీను, జి.గోపి తదితరులు పాల్గొన్నారు.



వాహనాలు వేరే చోటుకు తరలిస్తాం

- ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురంలో పోలీస్ స్టేషన్ వెనక రోడ్డుకు ఇరువైపులా సీజ్ చేసిన వాహనాలు ఉన్న ప్రాంతంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం వనస్థలిపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పురుషోత్తం, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ కే సత్యనారాయణలతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు కొన్ని సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు.దానిలో భాగంగా పక్కనే ఉన్న హుడా పార్క్ నందు ఉదయం, సాయంత్రం వాకింగ్ కు వచ్చే వారికి రోడ్డు చిన్నగా అయి వచ్చి పోయే వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అలాగే అట్టి రోడ్డు పక్కనే మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వస్తోందని తెలిపారు. కావున సీజ్ చేసిన వాహనాలు ఇంకోచోటుకు తరలించాలని కోరారు. దానికి స్పందించిన సుధీర్ రెడ్డి తప్పకుండా కొన్ని రోజుల్లో రోడ్డు పక్కన ఉన్న వాహనాలు వేరే చోటుకు తరలిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వాహనాలు తరలించిన తరువాత రోడ్డు వేయించడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని.శ్రీధర్ గౌడ్,సంజయ్ కుమార్,రమణ,ఆనంద్ రాజ్,సంతోష్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు

మతాలకతీతంగా అందరూ సోదర భావంతో మెలగాలి

- వనస్థలిపురం సీఐ కే సత్యనారాయణ



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో వివిధ మతాల పెద్దలతో వనస్థలిపురం సీఐ కే సత్యనారాయణ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి , గుడ్ ఫ్రైడే పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి , మతసామరస్య విశిష్టత, గొప్పతనం గురించి వివరించారు. అందరూ చట్టాలను గౌరవించాలని, వాటిని ఎవరూ అతిక్రమించరాదని, కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఐకమత్యంతో మెలిగి పండుగల జరుపుకోవాలని సూచించారు. ఏదైనా వదంతులను సోషల్ మీడియా నందు ఏదైనా వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వదంతులు నమ్మవద్దన్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రజాశాంతికి భంగం కలిగించే అల్లరిమూకలపై నిఘా ఉంచామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. అలాగే మత పెద్దల నుంచి స్థానిక నాయకుల నుంచి, శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకునేందుకు సలహాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.హెచ్.ఓ కే సత్యనారాయణ, డీఐ వెంకట్, అడ్మిన్ ఎస్ఐ స్వామి, ఎస్సైలు జగన్, రవి, మాధవరెడ్డి , పరమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ శ్రీ చైతన్యలో ఘనంగా ఫ్యామిలీ గ్లోరీ



నవతెలంగాణ-సంతోష్‌నగర్



లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ శ్రీ చైతన్య హై స్కూల్‌లో నిర్వహించిన స్మార్ట్ లివింగ్ ప్రోగ్రా మ్‌లో భాగంగా ఫ్యామిలీ గ్లోరీ వేడుకలు వైభవంగా జరిగా యని ప్రిన్సిపల్ సయ్యద్ ఖాసిమ్ అలీ హర్షం వ్యక్తం చేసా రు. ముఖ్య అతిథిగా వచ్చిన టీనేజ్ యూల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జె. పూర్ణచంద్రరావు విద్యార్థుల చేత ఘనంగా వారి తల్లిదండ్రులకు పాద పూజ చేయించారు. పిల్లలకు కావాల్సిన సౌకర్యాలు కాకుండా అవసరమైన సౌకర్యాలు మాత్రమే ఇచ్చి సరైన క్రమశిక్షణతో పెంచాలని వారు సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఏ.జి.యం. టీ.సతీ ష్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా పరిపూర్ణ మానవతావాదులుగా తీర్చిదిద్దడం తమ యాజమాన్యం లక్ష్యమన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను, తమ గురువుల సమక్షంలో సన్మానించుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని ఎగ్జిక్యూటివ్ డీన్ కె.ప్రవీణ్ అన్నారు. తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తంచేసి వారి పిల్లలను ఆశీర్వదించిన ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ రఘువండీ, ఆర్.ఐ.లు రవీందర్ రెడ్డి, వెంకటరెడ్డి, వైస్ - ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, అకడమిక్ డీన్ వెంకటరమణ, ఇన్‌చార్జులు సతీష్, లక్ష్మి సత్యనారాయణ, విద్యారాణి, సంధ్య, ఉపాధ్యాయులు వెంకటేశం, కష్టారెడ్డి, రఫీ, ప్రవీణ్, రాజ్, నాగరాజు, వీరబ్రహ్మం, మల్లీశ్వరి, స్వాతి, జయశ్రీ, రమాదేవి, మానస, లలిత్, భారతి, శైలజ, అంబిక -వాణి, భవాని, సోనియం తదితరులు పాల్గొన్నారు.



జన చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఉప్పల్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్రలో ప్రజలు, కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వినోద, సీపీఐ(ఎం) ఉప్పల్ కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్, సీపీఐ(ఎం) నాయకులు వెంకన్నలు అన్నారు. ఈనెల 28న యాత్ర మేడ్చల్ జిల్లాలో ప్రవేశిస్తుందని సంబంధిత పోస్టర్‌ను ఉప్పల్‌లో ఆవిష్కరించారు. నాయకులు స్వామి, ఎండి గౌస్ కుమార్, ఎస్ నాగరాజ్, వెంకటేశ్వర్లు, భీష్మ చారి, వెంకటేష్, కిరణ్ కుమార్, ఊర్మిళ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'పన్నులు పెంచడంతో ప్రజలపై తీవ్ర భారం'

నవతెలంగాణ-ఘట్కేసర్



రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీలకు ఇవాల్సిన నిధులు ఇవ్వకుండా ఆస్తి పన్నులు మాత్రం విపరీతంగా పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురుచే స్తున్నదని పోచారం మున్సిపాల్టీ మొదటి వార్డు కౌన్సిలర్, బీజేపీ ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షుడు గొంగళ్ల మహేష్ మండిపడ్డారు. ఇస్మాయిల్ ఖాన్ గూడలో విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీల నుండి మున్సిపాల్టీగా మారి 5ఏండ్లు అవుతున్నా మారిందేమి లేదన్నారు. కేవలం పన్నుల బాదుడు మాత్రం డబుల్ చేశారని విమర్శించారు. మున్సిపాల్టీలకు రావాల్సిన నిధులు సహితం రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించి మున్సిపా ల్టీలకు మొండి చేయ్యి చూపిస్తుందని, మున్సిపాలిటీ నిధులు సహితం వాడుకుంటున్న దౌర్భాగ్యం స్థితి నేడు రాష్ట్రంలో దాపురించిందని అన్నారు. రూ.2 వేలు ఉన్న పన్నులు నాలుగు వేలకు పెంచడం దురదష్టకరమని వాపోయారు. ప్రతీ సంవత్సరం 10 నుంచి 15 శాతం పన్నులు పెంచితే ప్రజలపై ఇంత భారం పడేది కాదని, ఒక్క సారిగా వందశాతం పన్నులు పెంచడం ఏమిటని, దీనిపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

సర్పంచులకు సన్మానం కాదు కాళ్లు మొక్కాలి

- ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ ఘట్కేసర్



ఘట్కేసర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ అవార్డుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి చామకూర మల్లరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షులు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుద ర్శన్ రెడ్డి మాట్లాడారు. 2018 సంవ త్సరం తర్వాత గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించకుండా సర్పంచ్‌ల పరిస్థితి ఎట్లా ఉందనేది ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి వర్గానికి తెలుసా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ గ్రామ సర్పంచ్ కాళ్లు మొక్కినా తక్కువే అని, వాళ్ల జీవితాలను పణంగా పెట్టి, రాత్రి పగలు కష్టపడ్డారని తెలిపారు. ప్రభుత్వం నిధులు కేటాయించకున్నా సొంత డబ్బులు ఖర్చు పెట్టి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో దాదాపుగా 70 మంది సర్పంచ్‌లు చనిపోయా రని వారి కుటుంబాలను ఇంతవరకు ఆదుకోలేదని గుర్తు చేశారు దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే ఈ పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల కోసమే సర్పంచులకు సన్మాన కార్యక్రమాలు పెట్టారన్నారు. అవార్డు అనేది ఒక్క గ్రామానికి లేదా రెండు గ్రామాలకు ఉంటుందని అన్ని గ్రామాలకు అవార్డు ఇవ్వడం ఒక విచిత్రమన్నారు. సన్మానానికి ఎటువంటి నిధులు ఏర్పాటు చేయకుండా చందాలు అడుక్కొని సన్మా నానికి సంబంధించిన శాల్వాలకు, మెమొం టోళ్లకు, సర్టిఫికెట్లు, చాయ్, బిస్కెట్లకు, అడుక్కొచ్చి మరీ కార్యక్రమం ఏర్పాటు చేశారని గ్రామాల్లో సర్పంచులు ఎంపీటీసీలు ఎందుకు ఉన్నామో తెలియకుండా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేసి పని చేయించుకుంటుందని అన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పులికంటి భాస్కర్ రెడ్డి, కొమ్మిడి శోభారాణి తదితరులు పాల్గొన్నారు

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-సంతోష్ నగర్



చార్మినార్ మండలానికి చెందిన ముగ్గురు లబ్దిదారులకు షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అహ్మద్ బిన్ శుక్రవారం అందజేశారు. అలాగే ఇద్దరికి ముఖ్య మంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) కింద మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసీ పత్రా లను అందజేశారు. మంగళవారం రాత్రి చార్మినార్ పంజేషాలోని క్యాంప్ కార్యాల యంలో వాటిని లబ్దిదారులకు ఎమ్మెల్యే అందజేశారని కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. ఈ కార్యక్రమంలో చార్మినార్ మండల తహసీల్ కార్యాల యం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యూనుస్, ఎంఐఎం నేత మహమ్మద్ రిజ్వాన్, లబ్దిదారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి సాధించాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆకాంక్షించారు. బుధవారం ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని పద్మానగర్ సామాజిక భవనంలో సలార్-ఏ-మిల్లత్ కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలు ఆర్తిక స్వాలంబన కోసం స్వయం ఉపాధి రంగాలను ఎంచుకోవాలన్నారు. ఎంఐఎం నాయకులు షఫీయుద్దీన్, నజ్మా పాల్గొన్నారు..

ప్రతీ నీటి బొట్టు.. ప్రగతికి మెట్టు..

- లార్డ్స్ విద్యాసంస్థల చైర్మెన్ సిద్ధాల బీరప్ప

నవతెలంగాణ-మీర్‌పేట్



ప్రతీ నీటి బొట్టు ప్రగతికి మెట్టు అని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జిల్లెలగూడ లార్డ్స్ హై స్కూల్లో నీటి పొదుపు - నీటి ఆవశ్యకత అనే అంశంపై గాయత్రి ఫౌండే షన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగైపోతున్న భూగర్భ జలాలను కాపాడుకునే బాధ్యత మన అందరి పైన ఉందని తెలిపారు. నీటి బొట్టును ఒడిసి పట్టుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన పైన ఉందని చెప్పారు. సేవ్ వాటర్- సేవ్ లైఫ్ అనే స్లోగన్ విద్యార్థులతో చేయించారు. ప్రతీ నీటి బొట్టును వృధా చేయకుండా కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఫౌండేషన్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఫౌండేషన్ మేనేజర్ ప్రమోద్ రెడ్డి, స్వాతి, డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, ప్రిన్సిపల్ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధిని నివారించవచ్చు

- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి రాఘవరెడ్డి



నవతెలంగాణ- సరూర్ నగర్

మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధిని నివారిం చవచ్చునని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి రాఘవరెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సరూర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజే శారు.ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ టీబీ నివారణకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓలు, ప్రయివేటు రంగ సంస్థలు కషి చేసి బాధితులకు సహకారం అందిం చాలని కోరారు. రెండు వారాలు దగ్గు, జ్వరం ఉండటం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడంతో పాటు బరువు తగ్గడం వంటి లక్షణాలు రోగిగా గుర్తించి చికిత్స అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, శైలేష్ బాబు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు హాజరైన మంత్రి

నవతెలంగాణ-ఘట్కేసర్



మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మెన్ శ్రీ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ప్రతాప్ సింగారం గ్రామంలో నిర్వహించిన కొబ్బరి గుట్ట మైసమ్మ ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టపన, శిఖర ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ దయాకర్ రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్‌లు కొండల్ రెడ్డి, ప్రణీత గౌడ్, సర్పంచులు శివశంకర్ వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లో గల లాలన ఫౌండేషన్ బాలికల అనాథాశ్రమంలో శుక్రవారం రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ.శ్రీదేవి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలెంటైర్ బాల్రెడ్డి సహకా రంతో వంట సామా గ్రిని, నిత్యవసర వస్తువులను అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీకు ఎటువంటి సహాయం చేయడానికి అయినా రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముందుంటుందని తెలిపారు.

శివాలయం ప్రారంభోత్సవంలో ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ-నాగోల్



హైదరాబాద్‌లోని నాగోల్, బండ్లగూడలో శుక్రవారం శివాలయం ప్రారం భోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్, ఐవీఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూరి ,రాజు గౌడ్, జంగయ్య గౌడ్, సత్యనారాయణ గౌడ్, రాము, గౌడ సంఘం నాయకులు,బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'మహేశ్వరం నుంచి పోటీ చేస్తా'

నవతెలంగాణ-మీర్ పేట్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చినా ఇవ్వకపోయినా పోటీ చేస్తానని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కొత్త మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లెలగూడలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం ఉద్యమ సమయం నుండి పనిచేస్తున్నానని తెలిపారు. 2014 సంవత్సరంలో పోటీ చేసి కొద్ది తేడాతో ఓడిపోయినా పార్టీని బలోపేతం చేసేందుకు నిరంతరం కషి చేస్తున్నానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని నుంచి పోటీ చేసి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తాననే నమ్మకం ఉందని దీమా వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి చెరువులను, భూకబ్జాలను ప్రోత్సహిస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. భూ కబ్జాలపై విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు త్వరలో 10వేల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మెన్ పాండు రంగారెడ్డి, గుళ్ల సంతోష్ ముదిరాజ్, వేద భవాని, నరేష్ చారీ, శేషిపాల్, చిర్ర లింగన్న, శంకర్ నాయక్, శ్రీనివాస్ ముదిరాజ్, వారికిప్పల లింగం, అశోక్, చందు, దుసకంటి రవి, కుమార్, కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దోబీ ఘాట్‌ల నిర్మాణానికి రూ 2 కోట్లు కేటాయింపు

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

దోబీ ఘాట్‌ల నిర్మాణం కోసం రూ 2 కోట్లు కేటాయించడం జరిగిందని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మెన్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. నాగారం పురపాలక సంఘం పరిధిలో జిల్లా కలెక్టర్ వార్డు నెంబర్ 9 శాంతినగర్‌లోని సర్వేనెంబర్ 346లో ఉన్న 1.00 ఎకరం ప్రభుత్వ భూమిలో ఆధునిక దోబీ ఘాట్‌ల నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ నిధుల నుండి రెండు కోట్ల రూపాయలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి రెడ్డి ,వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్ , కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు రావాలి'



నవతెలంగాణ -నేరేడ్ మెట్

రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రయివేటు పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వెంకటాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన దర్పన్ కిడ్స్ ప్లే స్కూల్‌ను ఆమె ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేద ,మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సునీత శ్రీధర్, డివిజన్ అధ్యక్షురాలు కవిత, అరవింద్, రాజేందర్ ,ఫిలిప్స్, రాజేశ్వర్, ప్లే స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా చేపడుతున్నాం

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- సీఎస్ శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా చేపడుతున్నామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, సమగ్ర మహిళా ఆరోగ్య కార్యక్రమం, ప్రభుత్వ ఉత్తర్వులు 58, 59, 76, 118 కింద రెగ్యులరైజేషన్, పట్టాలు పంపిణీ, సోషల్ వెల్ఫేర్ హౌస్ సైట్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, పోడు భూములు, వేసవి వేడి తరంగాల కోసం సంసిద్ధత- అగ్ని ప్రమాదాల నివారణ, ఐడీవోసీల ఆక్యుపెన్సీ, నిర్వహణ, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ వార్షిక పరీక్షలు, హరితహారం తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేస్తున్నామని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) 58, 59, 118కి సంబంధించి మార్చి 30వ తేదీ వరకు పూర్తి స్థాయిలో క్లియర్ చేస్తామని ఈ విషయమై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండలాల తహశీల్దార్లతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సీఎస్‌కు తెలిపారు. ఈ విషయాలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించడంతో పాటు వారిని క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు వివరించేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు పర్యటించిన వివరాలకు సంబంధించి సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూస్తున్నామనన్నారు. ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో జిల్లాను ముందు నిలపాలని సంకల్పంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, సూచనలు తప్పకుండా పాటిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో ఉన్నవారికి కడుపునిండా భోజనం పెట్టడం ఎంతో గొప్ప సేవ

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- మధ్యాహ్న మిత భోజన కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

ఆకలితో ఉన్న వారికి కడుపునిండా భోజనం పెట్టడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమం అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సనత్ నగర్‌లోని బీకే గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న మిత భోజన కేంద్రం, చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురికి భోజనం వడ్డించిన మంత్రి తాను కూడా భోజనం చేసి ఎంతో రుచికరంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వేసవికాలంలో 60 రోజుల పాటు ఉచితంగా భోజనం వడ్డించే కేంద్రాన్ని గత 12 సంవత్సరాలుగా నిర్వహిస్తుండటం పట్ల నిర్వాహకులను అభినందించారు.ఉద్యోగ విరమణ అనంతరం అనేకమంది వయసు రిత్యా కుటుంబ సభ్యులతో సమయం గడిపేందుకే ఆసక్తి చూపుతుంటారని, కానీ సనత్ నగర్‌లోని సీనియర్ సిటీజన్స్ సమాజానికి సేవ చేయాలనే తలంపుతో అనేక సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణపై శ్రద్ధ చూపడం ఆనందంగా ఉందన్నారు. దాతల సహకారంతో ప్రతి సంవత్సరం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న శ్రీనివాస సమాజ సేవా సమితి అధ్యక్షులు పార్థసారధి, ఇతర కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. గడచిన 8 సంవత్సరాల కాలంలో సనత్ నగర్ లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని చెప్పారు. బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, పరిసరాలు 2014కు ముందు ఎలా ఉండేవి, ఇప్పుడు ఎలా ఉన్నాయో మీకు అందరికీ తెలుసన్నారు. ప్రతీ సంవత్సరం అమ్మవారి కళ్యాణం భక్తుల సమక్షంలో కన్నులపండువగా జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ బాల్ రెడ్డి, సీనియర్ సిటీజన్స్ పార్థసారధి, మానిక్ పటేల్, ప్రసాద్, సహదేవ్ గౌడ్, రజని రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి సురేందర్ సింగ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో...

మోడల్ కాలనీలో మానవ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కేంద్రం, చలివేంద్రాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ బాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాంత్రి పలువురు పేదలకు అన్నం వడ్డించారు. నిర్వహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండల్ రావు, బుచ్చిబాబు, మనెమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధులు హరికిషన్ సింగ్ సూర్జిత్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ కమ్యూనిస్టు యోధులు హరికిషన్ సింగ్ సూర్జిత్ 107 జయంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో విప్లవ స్ఫూర్తి కార్యక్రమం జరిగింది. ముందుగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జే చంద్రశేఖర్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ శ్రీనివాస్‌లు హరికిషన్ సింగ్ సూర్జిత్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ హరికిషన్ సింగ్ సూర్జిత్ బాల్యంలోనే బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. బ్రిటిష్ పతాకాన్ని కిందకు దించి, భారతీయ జెండాను ఎగరవేయడంతో ఆయనను జైలులో వేశారన్నారు. తర్వాత జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా స్వాతంత్ర పోరాటంలో భాగమై, కమ్యూనిస్టు భావాలతో మమేకమై బ్రిటిష్ వ్యతిరేక పోరాటాన్ని ఉద్ధతంగా చేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి కూడా తన సహాయ సహకారాలు అందించారని చెప్పారు. 1952లో జరిగిన ఆంధ్ర ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ తరఫున నిలబడి ప్రచార కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం అయ్యా రని.. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఏర్పాటు చేయ టంలోనూ, పార్టీ కార్యక్రమం రూపొందించ డంలోనూ వారు సుందరయ్యతో కలిసి ప్రధాన భూమికను నిర్వహించారని చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలోనూ ముఖ్యభూమికను నిర్వహించా రని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్ర శేఖర్ మాట్లాడుతూ హరికిషన్ సింగ్ సూర్జిత్ పార్టీని బలోపేతం చేయడంలో గొప్ప కృషి చేశారని చెప్పారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు గొడుగు యాదగిరిరావు అధ్యక్ష వహించారు. పార్టీని బలోపేతం చేయడంలో ఆయన చేసిన కషి మనకందరికీ ఆదర్శమని చెప్పారు. అనంతరం హాజరైన సభ్యులందరూ హరికిషన్ సూర్జిత్ చిత్రపటానికి పూలను అర్పించి వారి ఆశయాలను ఆచరణలో ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు.పార్టీ స్ఫూర్తి కార్యక్రమాల్లో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, పార్టీ ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాసరావు , జి శివరామకష్ణ, ఉదయభాస్కర్, గౌసియా, జాన్, సోమయాచారి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ ఆదాము, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక శాఖ అవగాహన సదస్సు

నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్ ఇటీవల జరుగుతున్న అగ్ని ప్రమాదాలను దష్టిలో ఉంచుకుని అగ్నిమాపక శాఖ, జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమైంది. ఈ మేరకు సికింద్రాబాద్ సీటీసీ కంప్యూటర్స్ కాంప్లెక్స్‌లో అగ్నిమాపక శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ పోలీసులు సంయుక్తంగా అగ్నిమాపక భద్రత సంబంధించి దుకాణాలలో తనిఖీలు నిర్వహించామని అగ్నిమాపక అధికారి మధుసూదన్ రావు అన్నారు. శుక్రవారం సీటీసీలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యాపారస్తులు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన అగ్నిమాపక భద్రత అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మహంకాళి ఏసీపీ రమేష్ మాట్లాడుతూ కొన్ని దుకాణాలలో అగ్నిమాపక భద్రతకు సంబంధించిన యంత్రాలు లేవని, సెల్లార్‌లో అక్రమంగా గోదాములు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అగ్నిమాపక భద్రతలను పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటామని దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పదిహేను రోజుల్లో నోటీసులు జారీ చేస్తామని ఈ లోగా సేఫ్టీ యంత్రాలను తెచ్చుకోవాలని లేకపోతే దుకాణాలను సీజ్ చేస్తామని తెలిపారు. అసిస్టెంట్ డివిజన్ అధికారులు సురేష్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, ఫైర్ సేఫ్టీ అధికారి మోహన్‌రావు డీఆర్ఎఫ్ అధికారి, సీటీసీ అధ్యక్షులు కొండల్ రెడ్డి దుకాణాల యజమానులు పాల్గొన్నారు

హత్ సే హత్ జోడోయాత్ర ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ డివిజన్‌లో హత్ సే హత్ జోడోయాత్రను ముఖ్యఅ తిథులుగా హాజరైన కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం నాయ కులు రాగిడి లక్ష్మారెడ్డి ,ఉప్పల్ నియోజకవర్గం బీబ్లాక్ అధ్య క్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మేకల శివారెడ్డి, హత్ సే హత్ జోడో ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి అవినాష్ రాయ్, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ పత్తి కుమార్‌లు ప్రారంభించారు. హౌసిం గ్ బోర్డ్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ పొలిపాక అంజ య్య కాంగ్రెస్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ ప్రెసిడెంట్ సము ద్రాల కష్ణమూర్తి ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ డివిజన్ రాజీవ్ గాంధీ పార్క్ ఫస్ట్ ఫేస్ నుంచి మొదలైన పాద యాత్ర కృష్ణానగర్, మంగాపురం, ఇందిరానగర్, కైలాసగిరి, రాజీవ్ నగర్ నవోదయ నగర్, లక్ష్మీ నగర్, వెంకటేశ్వర కాలనీ వరకు కొనసాగింది. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి యాత్రను ప్రారంభించారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి ,సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలు మాట్లా డుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేద వర్గాలకు న్యాయం జరుగు తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యవసర సరు కులు ధరలు గ్యాస్ పెట్రోల్ ధరలు పెరిగాయన్నారు. పేదో డు ఆత్మగౌరంగ బతకాలంటే ఈ రాజ్యం పోవాలి ఇందిరమ్మ రాజ్యం రావాలి అన్నారు. కార్యక్రమంలో జలగం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

- కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

మల్లపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్‌లో ప్రాధమిక పాఠశాలలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నింటికీ ఆధారం ఆధార్ అని అన్నారు. ప్రజలకు మరింత అందుబాటులో ఉండే విధంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజాసేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఆధార్ కేంద్రం నిర్వాహకుడు మహేష్ మాట్లాడుతూ ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సుభాష్‌నగర్ ప్రాధమిక పాఠశాలలో ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం గోకుల్‌నగర్‌లోని మసీదు వద్ద టీఎస్ ఆన్‌లైన్ కేంద్రంలో ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఆధార్ కేంద్ర సేవలను మల్లాపూర్ సూర్య నగర్, సుభాష్ నగర్, గోకుల్ నగర్, చాణిక్యపురి, బాబా నగర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ స్థానిక నాయకులు, ఆధార్ కేంద్రం నిర్వాహకులు ఎం మహేశ్, సౌజన్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి తన నివాసంలో రూ. 52,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్దిదారుడు కిరణ్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుడుగు మహేందర్ రెడ్డి, మేకల ముత్యం రెడ్డి, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

'ఇంటింటికీ తెలుగుదేశం'



నవతెలంగాణ-మల్కాజిగిరి

టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆదేశానుసారం పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం కోఆర్డినేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి తెలిగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు ప్రొఫెసర్ తిరుగునని జ్యోష్ణ పాల్గొన్నారు, ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన మల్కాజిగిరి కోఆర్డినేటర్‌లు, జిల్లా శంకర్ గుప్తా, చిత్రాల సంతోష్ సాగర్, బ త్తిన నరసింహ గౌడ్ ,చింతల నరేష్ ముదిరాజ్‌లు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, చేసిన కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు' నినాదంతో 29 మార్చి 1982న తెలుగుదేశం పార్టీని హైదరాబాద్ నడిబొడ్డున ఎన్టీఆర్ స్థాపించారన్నారు. చైతన్యరథంపై సుడిగాలి పర్యటన చేసి 9 నెలల్లోనే అధికారం లోకి తెచ్చారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పించి బీసి సాధికారతకు, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ఎన్నో వినూత్న పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. 'ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు- మహిళా సాధికారతకు కృషి-మహిళలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు' కల్పించి రాజకీయంగా, సామాజికంగా ప్రోత్సహించారన్నారు. తెలంగాణలో అడుగడుగునా ఎన్టీఆర్, చంద్రబాబు చేసిన అభివద్ధి కార్యక్రమాలే కనిపిస్తాయన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వరల్డ్ బ్యాంక్స్ ఫండ్స్ ద్వారా, అండర్ గ్రౌండ్ వాటర్ ఫెసిలిటీ గాని అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఫెసిలిటీ, గానీ రైలు ఓవర్ అండర్ బ్రిడ్జెస్ గాని, పెన్షన్స్ ,గ్యాస్లు , వ్యాంబి గహని స్కీన్స్ ద్వారా గహ నిర్మాణాలు ప్రాథమిక పాఠశాలలు ,మున్సిపల్ బిల్డింగ్స్, పోలీస్ స్టేషన్స్ , నిర్మాణం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై తెలుగుదేశం పార్టీ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా ఎక్స్ కౌన్సిలర్ రాములు యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు పితాని సత్యనారాయణ, బాలరాజు యాదవ్, కష్ణ, వెంకటరమణ, రియాజ్ , తెలుగు యువత నాయకుడు సాయి నాగార్జున,రాము, విజయ్, బత్తిని పద్మ ,విజయలక్ష్మి, అమీనా బి, పద్మ, ప్రమీల, జ్యోతి, లావణ్య, పద్మ ,హేమ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల ఆహారంతో ఆరోగ్యం పదిలం

- అంగన్వాడీ టీచర్ జయ



నవతెలంగాణ-జవహర్‌నగర్

చిరు ధాన్యాల ఆహారంతో ఆరోగ్యం పదిలం అని, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తేనే రోగనిరోధక శక్తి పుష్కలంగా లభిస్తుందని అంగన్వాడీ టీచర్ జయ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో పోషణ పక్షంను పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యానికి పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, చిరుధాన్యాలతో రోగాలు ధరిచేరవని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అంగ న్వాడీ పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందిస్తుందని, చిన్నప్పటి నుంచే పిల్లలకు మంచి ఆహారం అందిస్తే భవిష్యత్తులో అనారోగ్యానికి గురుకాకుండా బలంగా ఉంటారని తెలిపారు. అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనా రాయణ, అంగ న్వాడీ టీచర్లు వనజాక్షి, మనోహార, సరస్వతి, అనురాధ, రజిత, మనిషా, విద్యార్థులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో మసీదుల వద్ద చెత్త చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కంటోన్మెంట్ బోర్డ్ అధికారులను కోరారు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభమైందని, కంటోన్మెంట్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉన్న మసీదుల వద్ద తాగు నీటి సదుపాయంతో పాటు ప్రార్థనలు చేసుకునే విధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కంటోన్మెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరజ్, అజయ్ ముదిరాజ్, రవి, పెరుకా మహేందర్, దఫెదర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యశోద ఆస్పత్రిలో ఊబకాయంపై అవగాహన

నవతెలంగాణ-బేగంపేట

సోమాజిగూడలోనియశోద ఆస్పత్రిలో సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ బేరియాట్రిక్ సర్జన్, డాక్టర్. కోన లక్ష్మి కుమారి నేతృత్వంలో ఒబేసిటీ (ఊబకాయం)పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్, డాక్టర్. పవన్ గోరుకంటి మాట్లాడుతూ, 'ఊబకాయం.. ఇది మనిషి జీవితాన్నే భారంగా మారుస్తున్న బరువైన శారీరక జబ్బు. ఇప్పుడీ జబ్బు రోజురోజుకూ పిల్లల్లోనూ అధికమవుతోంది. ప్రధానంగా, కరోనా కారణంగా ఇండ్లకే పరిమితమవడంతో చాలా మందిలో ఈ మరింత పెరిగింది. సాధారణంగా ఊబకాయ సమస్య ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చాలా రకాల అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రోగి ఒకచోట నుంచి మరోచోటికి సులువుగా కదల లేడు. చిన్న పనికి కూడా ఆయాసపడటం, నీరసించి పోవడం జరుగుతుంది. ఊబకాయ సమస్య వల్ల ప్రధానంగా మధుమేహం, అధిక రక్తపోటు, గుండెపోటు తదితర జబ్బులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంది' అన్నారు.



డాక్టర్. కోన లక్ష్మి కుమారి, మాట్లాడుతూ.. 'ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, జన్యుసమస్యలు... కారణాలేమయితేనేం. ఈ శతాబ్దంలో అధిక మంది ఎదుర్కొంటోన్న అతిపెద్ద సమస్య స్థూలకాయం. కీళ్ల నొప్పులు, వంధ్యత్వం, శ్వాస సమస్యలు, గుండె సంబంధిత సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఊబకాయం ప్రధాన కారణం, ఇప్పుడు పెద్దప్రేగు, రొమ్ము, ఎండో మెట్రియంకు సంబంధించిన అనేక క్యాన్సర్‌లకు ఒబేసిటీ (ఊబకాయం) కారణమౌతుంది. ప్రతి వ్యక్తి రోజువారీ వ్యాయామం, సమతుల్య ఆహారంతో మంచి శరీర ఆరోగ్యం కొనసాగించాలి. అయినప్పటికీ, కొందరు వ్యక్తులు ఆహారం, వ్యాయామాలను ప్రయత్నించినప్పటికీ బరువు పెరుగుతుంటారు. కొందరు బరువు తగ్గడానికి వ్యాయామం చేయలేకపోవటం వలన బరువు మరింత పెరుగుతుంటారు. ఇలాంటి వారికి బేరియాట్రిక్ సర్జరీ అనేది వారికి ఒక ముఖ్యమైన ఎంపిక, బేరియాట్రిక్ సర్జరీ వారు బరువు తగ్గడానికి సహాయపడటమే కాకుండా అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు... వంటి అన్ని ప్రధాన ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందేందుకు, సమాజంలో ఆత్మగౌరవాన్ని పొందేందుకు కూడా వారికి సహాయం చేస్తుంది.ఒబేసిటీ అండ్ బేరియాట్రిక్ సపోర్ట్ గ్రూప్ మీటింగ్ అనేది బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్న వారికి ఆహారం, శారీరక శ్రమ లేదా మానసిక సమస్యలు ఏవైనా ఉంటే సరైన మార్గంలో మార్గనిర్దేశం చేసేందుకు, వారిని ప్రోత్సహించడానికి ఒక ముఖ్యమైన వేదిక. ఊబకాయం ఉన్నవారు మంచి ఆహారం, కార్యాచరణ ఆధారిత జీవనశైలిని అనుసరించమని, శస్త్రచికిత్స గురించి వారి సందేహాలు, అపోహలను క్లియర్ చేయడానికి శస్త్రచికిత్సకు సిద్ధంగా ఉన్న ఊబకాయం ఉన్నవారిని ప్రోత్సహించడం ఇలాంటి వేదికల ముఖ్యోద్దేశం' అని తెలిపారు

పొలిటికల్ కార్టూనిస్ట్ 'నారు'కు కీర్తి పురస్కారం!



నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రముఖ కార్టూనిస్ట్ నారు (మంగలి నారాయణ)కు 2020కి గానూ తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి, కృష్ణా పత్రికల్లో కార్టూనిస్టుగా పని చేశారు. ప్రస్తుతం సూర్య దిన పత్రికలో చీఫ్ కార్టూనిస్ట్‌గా ఉన్నారు. నారు భార్య హరిపుష్ప ఆర్టీసీ ఉద్యోగిని. విశేషం ఏమంటే.. అమెరికాలో ఉండే పెద్దబ్బాయి హరీశ్ దగ్గరకు వెళ్ళి 15 రోజుల క్రితమే ఇండియా తిరిగి వచ్చారు. వచ్చీ రావడంతోనే కీర్తి పురస్కార ప్రకటన జరిగింది. మరో అబ్బాయి కార్తీక్ ఇంజినీరింగ్ చేస్తున్నాడు. 1998లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కార్టూనిస్ట్‌గా ఇందిరాగాంధీ అవార్డు అందుకున్న నారును, 2020 జనవరిలో ఉత్తమ కార్టూనిస్ట్‌గా తెలంగాణ విశ్వవిద్యాలయం సత్కరించింది.

ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

- ఉస్మానియా మెడికల్ కాలేజీ వైద్యురాలు ఉమారాణి

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఉస్మానియా మెడికల్ కాలేజీ వైద్యురాలు ఉమారాణి అన్నారు. గురువారం దారుషిఫా అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని జేజే నగర్ స్లమ్ బస్తీలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీబీ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. టీబీ రోగులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదనీ, మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యశ్విని, మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు డాక్టర్ హర్షిత, సుష్మ, ఉస్మానియా (అర్ఎన్టీసీపీ) టీబీ డిపార్టమెంట్ స్టాఫ్ ఖలీల్ అహ్మద్, కె.నవీన్, అమరావతి, గోపినాథ్, సుభద్ర, ఆశావర్కర్ మహేశ్వరి, ఏఎన్ఎం మంగాదేవి, పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి

- జనచైతన్య యాత్రలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో/మెహిదీపట్నం

బీజేపీ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్రను చేపట్టామని ఎం.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని భోజగుట్టలో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నగరవ్యాప్తంగా బస్తీలు, కాలనీలు, చౌరస్తాల్లో సభలు నిర్వహించి బీజేపీ విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ 9 ఏండ్ల కాలంలో దేశంలో ప్రజల మధ్య మతం పేరుతో వైశమ్యాలను తీసుకొచ్చిందనీ, హిందువులు ప్రమాదంలో ఉన్నారనే పేరుతో మైనారిటీ మతస్తులపై దాడులు చేయిస్తుందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగాయనీ, వంట గ్యాస్ ఎన్నో రెట్లు పెంచిందనీ, పెట్రోల్, డీజిల్ నిత్యావసర సరుకుల ధరలను కూడా పెంచి ప్రజలపై మోయలేని భారాలను మోపిందన్నారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో శతకోటీశ్వరుల సంఖ్య ఒకవైపు పెరిగి మరోవైపు దేశంలో కోట్లాది మంది ప్రజలు పేదరికంలోకి నెట్టివేయబడ్డారన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతూ, విమానాశ్రయాలు పోర్టులు తదితర ప్రభుత్వ సంస్థలను పెట్టుబడిదారులకు కారు చౌకగా మోడీ ప్రభుత్వం అప్పగిస్తున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కోల్పోతున్నట్టు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. ఇప్పటి వరకు దేశంలో ఒక్క అధికార పార్టీ నాయకుడిపై కూడా దాడులు జరగలేదన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరుగుతున్న జనచైతన్య యాత్రల ముగింపు సందర్భంగా ఈ నెల 29వ తేదీన ఇందిరా పార్క్ వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు ఎస్.మారన్న, ఆర్.వెంకటేష్, నాంపల్లి జోన్ కన్వీనర్ సి.మల్లేష్, నాయకులు శంకర్, వెంకటస్వామి, యాదయ్య, కుమార్, ఇబ్రహీం, ప్రజానాట్యమండలి నాయకులు రాజు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎండీ అబ్బాస్



నవతెలంగాణ-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎండీ అబ్బాస్ అన్నారు. చాంద్రాయణగుట్ట జోన్‌లో ప్రజాసంఘాల జీప్ జాత గురించి డీఆర్డీఓ, బీడీఎల్, మీధాని తదితర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విధానాలు అవలంభిస్తూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. ఈ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు క్యాజువల్ కార్మికులు కార్మిక చట్టాలకు దూరంగా ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ క్యాజువల్ లీవులు, గ్రాడ్యూటీ తదితర సమస్యలు పరిష్కరించని పరిస్థితి కంపెనీ యజమానులకు ఉందన్నారు. సంస్థలో పని చేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ మజ్దూర్ కిసాన్, సంఘర్ష ర్యాలీలో పాల్గొని తమ సమస్యల పరిష్కారానికి పాటుపడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జిల్లా కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్, శశికళ, బాలు నాయక్, అబ్దుల్ సత్తార్, కృష్ణ నాయక్, బృందం సభ్యులు, ప్రజాసంఘాల జిల్లా నాయకులు లక్ష్మమ్మ, మీనా, లోక్సాని, కోటిరెడ్డి, ఎస్.కిషన్, వి.రామ్ కుమార్ నాయక్, సత్తన్న మురళి, బాబురావు, దానకర్ణ చారి పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని అడ్డుకోవాలంటే భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

- అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్
- చార్మినార్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశంలో ఉపాధి, మతోన్మాదాన్ని అడ్డుకోవాలంటే భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 92వ వర్ధంతి సందర్భంగా నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం తన చిన్నతనంలోనే పోరాటం చేసిన విప్లవ కెరటం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ అన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి చిన్నతనంలోనే ఉరికంబాన్ని ఎక్కిన మహావీరులన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ మాట్లాడుతూ యువత భగత్ సింగ్ స్ఫూర్తిని తీసుకోవాలన్నారు. దేశ స్వతంత్రం కోసం పోరాటం చేసి ప్రాణాలు వదిలిన వ్యక్తులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ అన్నారు. ఆ రోజు సమానత్వం, విద్య, ఉపాధి, హక్కుల కోసం పోరాటం చేస్తే ఈ రోజు దేశంలో బీజేపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక మత ఘర్షణలు, కులాల పేరుతో దాడులు చేస్తుందన్నారు. వీటిని ఎదుర్కోవాలంటే విప్లవ పోరాట యోధుడు భగత్ సింగ్ స్ఫూర్తి తీసుకోవాలనీ, మతోన్మాదం- కులోన్మాదం, డ్రగ్స్, మద్యం మాఫియా పై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రావణ్, కార్యదర్శి మీనా, ఉపాధ్యాయులు కిషన్, కోటయ్య, మహిళా సంఘం ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మమ్మ శశికళ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలు నాయక్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రీను, ఆంజనేయులు, రాజేష్, మహేష్, భరత్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు రాజ్యాంగ విరుద్ధం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులను నిండా ముంచి, అక్రమ పత్రాలతో డొల్ల కంపెనీలు సృష్టించి లక్షల కోట్లను దోపిడీ చేసిన అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు లోపల, బయట పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనీ, దీనికి సమాధానం చెప్పలేని బీజేపీ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించడానికి రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం దుర్మార్గమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ఈ.టి.నరసింహ అన్నారు. అనేక మంది పార్లమెంటు సభ్యులపై నేరపూరిత కేసులు నమోదయ్యాయనీ, కింది కోర్టులు వారికి శిక్ష విధించినా పైకోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకుని సభ్యులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ఎక్కువ మంది బీజేపీకి చెందిన ఎంపీలు, ప్రజా ప్రతినిధులు కావడం గమనార్హం అని తెలిపారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును అవకాశంగా తీసుకుని కుట్రపూరితంగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో చీకటి రోజు అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఏకమై మోడీ నిరంకుశ విధానాలపై ఆదానీ కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేసే వరకు పోరాటాలు కొనసాగించే సందర్భం ఆసన్నమైందన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై నిరసన తెలుపకపోతే భవిష్యత్తులో ప్రతిపక్ష పార్టీలను గుర్తింపును రద్దు చేసి ఏక పార్టీ వ్యవస్థను బలపరిచే చర్యలకు మోడీ సర్కార్ దిగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎస్పీఎస్సీ పరీక్ష పత్రం లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

టీఎస్పీఎస్సీ పరీక్ష పత్రం లీకేజీపై హైకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బీసీ మహిళా నాయకులతో విద్యా నగర్ బీసీ భవన్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ టీఎస్పీఎస్సీలో అవకతవకలకు పాల్పడుతూ ప్రశ్నాపత్రాలు లీక్ చేస్తూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. రాజకీయ పార్టీలు టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై ఒకరిపై మరొకరు బురదజల్లడం మానుకుని ఈ మొత్తం వ్యవహారంలో ఎవరెవరి హస్తముందో పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హస్తముందని ఆరోపిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీసీ ఎంబీసీ కార్పొరేషన్ 12 బీసీ కులాల ఫెడరేషన్లు నామమాత్రపు ఉత్సవ విగ్రహాల వలె తయారయ్యాయి అన్నారు. ఐదేండ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న 5 లక్షలా 77 వేల మందికి సబ్సిడీ రుణాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రతి బీసీ కులానికి ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే స్కీములకు గ్యారంటీ ఇచ్చి కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ నిరసన దీక్షలో నీల వెంకటేష్, జిల్లపెల్లి అంజి, గుజ్జా సత్యం, లాల్ కృష్ణ, వేముల రామకృష్ణ, వెంకటేష్, మహిళా నాయకులు తారా, వాణి పాల్గొన్నారు.

'ఉన్నత విద్య-సుస్థిర అభివృద్ధి'పై అంతర్జాతీయ సదస్సు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఉన్నత విద్య, సుస్థిర అభివృద్ధి" అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు జరుగుతుంది. రెండో రోజు ఈ సదస్సుకు విభాగాధిపతి డా.చంద్రు కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యా రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాభివృద్ధి కోసం మేధావుల అభిప్రాయాలను తీసుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. ఉన్నత విద్య ప్రాధాన్యత గురించి తెలియజేశారు ఉన్నత విద్య దేశంలోని గ్రామీణ ప్రాంతంలోని సమస్యలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా విద్యారంగం తన దిశను మార్చుకోవాలన్నారు. ప్రొఫెసర్ నాయుడు అశోక్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం చాలా ప్రాధాన్యతమైందన్నారు. విద్యార్థులు, మేధావులు భవిష్యత్ తరాల కోసం ఉపయోగపడే విద్యను తయారు చేయాలన్నారు. పాశ్చాత్య దేశాల విద్యా విధానాన్ని అనుసరిస్తూ భారతదేశం విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తూ ఉపాధి అవకాశాలు లభించే విధంగా విద్యను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ ప్రొఫెసర్, ముత్తయ్య, డాక్టర్ శ్రీలత, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ చలమల, వెంకటేశ్వర్లు, డాక్టర్ సుజాత, డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ రామాచారి, ప్రొఫెసర్ మొత్తాన్ని డాక్టర్ వేగం ప్రొఫెసర్, బి.మురళీధర్ ఆధ్వర్యంలో పరిశోధక పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వివిధ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన లక్ష్మణ్‌రావు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



వచ్చే నెల 6వ తేదీన నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్ర కోసం బైకు ర్యాలీ అనుమతి కోసం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు తెలంగాణ రాష్ట్ర బజరంగ్ సేన వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఆర్ లక్ష్మణరావు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బజరంగ్ సేన మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రజిని, జాయింట్ సెక్రెటరీ మనోజ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ హనుమాన్ వ్యాయామశాల నుంచి సికింద్రాబాద్ తాడ్‌బాండ్ హనుమాన్ టెంపుల్ వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

క్రీడాలతో మానసిక ఉల్లాసం కలుగుతుందనీ, ఆరోగ్యం పటిష్టంగా ఉంటుందని నగర డిప్యూటీ మోతె శ్రీలతారెడ్డి అన్నారు. పీజేఆర్ ఇండోర్ స్టేడియంలో కార్పొరేటర్స్ స్పోర్ట్స్ క్రీడను ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పటిష్టమైన ఆరోగ్యం మానసిక ఉల్లాసానికి క్రీడలు చాలా ముఖ్యం అన్నారు. అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షులు హైమద్ భాయ్, సరిత పాల్గొన్నారు.

ఉపవాసాలు పాటించే కూలీలకు సడలింపులు కల్పించాలి



నవతెలంగాణ-హైదరాబాద్

మండుటెండల్లో ఉపవాసాలు పాటిస్తూ కూలి పనులు, ఇతరత్రా దినసరి వేతన కార్మికులుగా పని చేస్తున్న వారికి పనుల్లో సడలింపునివ్వాలని ఎంపీజే స్టేట్ ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్ విజ్ఞప్తి చేశారు. రంజాన్ ఉపవాస మాసాన్ని పురస్కరించుకుని చెత్త బజార్ లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ముస్లిం ఉద్యోగులకు ప్రభుత్వం పని వేళల్లో సడలింపులు ఇచ్చిందనీ, ఆ తరహాలోనే ప్రయివేటు సంస్థలు, యాజమాన్యాలు యోచించాలన్నారు. సంపన్న ముస్లింలు విధిగా జకాత్ సొమ్మును నిరుపేదల కోసం కేటాయించాలని కోరారు. దీంతో నిరుపేదలు కూడా ఎలాంటి చీకూచింతా లేకుండా ఉపవాసాలు పాటిస్తారని తెలిపారు. ఉపవాసాలు పేదల ఆకలి బాధను తెలియజేస్తాయన్నారు.

జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ప్రశంసా పత్రాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించిన జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ప్రత్యేక చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ ప్రశంసా పత్రాలను అందజేశారు. సీడీఎంఏ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మున్సిపల్ పరిపాలన శాఖలో ఉన్నత సేవలు అందించిన మహిళా ఉన్నతాధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవంలో జీహెచ్ఎంసీకి చెందిన ఉన్నతాధికారులు, అడిషనల్ కమిషనర్లు శృతి ఓజా, ప్రియాంక అలా, హెచ్ఆర్డీసీఎల్ ఎస్ఈ సరోజదేవి, అడిషనల్ కమిషనర్‌లు విజయలక్ష్మి సరోజ, మమత, పంకజ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.పద్మజ, హెల్త్ అండ్ శానిటేషన్ జాయింట్ కమిషనర్‌లు ఉమా ప్రకాష్, శశిరేఖ, సంధ్య, డీసీలు అరుణకుమారి, మంగతాయారు, ఉమాదేవి, రిచాగుప్త, ప్రశాంతి, శైలజ, కె.ఎం.మంగతాయారు, నాగమణికి అందజేశారు.

గోడ కూలి ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-మెహిదీపట్నం

లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాషం నగర్ కాలనీలో శుక్రవారం గోడ కూలి కూలీ మరణించగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. లంగర్ హౌస్ సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం హాషం నగర్ నివాసి ఇఫ్తాకార్ అలీ వృత్తి రీత్యా లాయర్. మజీద్ ఎదురుగా ఉన్న తన ఇంటి నిర్మాణం పనుల కోసం ఆరుగురు జీహెచ్ఎంసీ కూలీలను పిలిచాడు. ఇంటి పునాది నిర్మాణం జరుగుతూ ఉండగా ఒక్కసారిగా గోడ కూలిపోవడంతో అప్పన్న, కామరాజు అనే ఇద్దరు కూలీలు, దగ్గర ఉండి నిర్మాణ పనులను చూస్తున్న మహబూబ్ పాషా అనే స్థానిక ఎంఐఎం నాయకుడు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆ ముగ్గురిని సమీపంలోని ఆలివ్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ కామరాజు (50) అనే కూలీ మరణించాడు. ఇతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ లోని విజయ నగరం. ప్రస్తుతం అతడు అత్తాపూర్ లో నివాసం ఉంటున్నాడు. తీవ్రంగా గాయపడిన అప్పన్న, మహమూద్ పాషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గోషామహల్‌లో నేడు జీపు జాత

నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ప్రజా సంఘాలు, సీఐటీయూ, మహిలా సంఘం (ఐద్వా), ఆవాజ్, గిరిజన సంఘం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జీపు జాత, ఈ నెల 23 నుండి 27వ తేదీ వరకు జరుగుతుందని సీఐటీయు జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, గోషామహల్ జోన్ కన్వీనర్ కె.జంగయ్య అన్నారు. నేడు గోషామహల్ జోన్‌లో ఉదయం 7-45 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ నియోజకవర్గ ప్రాంతంలో జీపు జాత సంజయ్ నగర్‌లో ప్రారంభమై గౌలిగూడ చమన్ లేబర్ అడ్డా, బేగంబజార్ లేబర్ అడ్డా, మొఠ్రం బస్తీ, కొల్సువాడి బస్తీ, దేవీనగర్, అంబేద్కర్ నగర్, బీదర్వాడి, ఇందిరానగర్, ఫీల్ ఖానా, అల్బెలా హోటల్, సిండికేట్ బ్యాంక్ వద్ద కొనసాగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి మహబూబ్ గంజ్, ముక్తార్ గంజ్, కిషన్ గంజ్ వరకు కొనసాగించి, కిషన్ గంజ్‌లో భహిరంగ సభ సాయంత్రం 4గంటలకు అఫ్జల్‌గంజ్, ఆటోస్టాండ్, కోటి ఆటోస్టాండ్, బిర్లా టెంపుల్ ఆటోస్టాండ్, గిరిజన బస్తీ లో జరుగుతుందన్నారు. స్థానిక ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థినులకు ఆయుష్ న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు కింగ్‌కోఠి పాలి క్లినిక్ (ఆయుర్వేద) ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం సుల్తాన్‌బజార్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఆయుష్ న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల మానసిక ఒత్తిడిని తగ్గించి జ్ఞాపకశక్తిని పెంచేందుకు ప్రభుత్వం ద్వారా తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఈన్యూట్రీషన్ కిట్లు, రాగి లడ్డులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఆయుర్వేద ప్రాముఖ్యతను విద్యార్థినులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాందాస్, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం నేత శ్రావణ్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర కార్యదర్శి ఏ.శ్రావణ్ కుమార్‌పై తపాలశాఖ యాజమాన్యం విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం గ్రూప్ -సీ రాష్ట్ర అధ్యక్షులు యు.మహేందర్ డిమాండ్ చేశారు. శ్రావణ్ కుమార్ పై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం అబిడ్స్‌లోని డాక్ సదన్ ఆవరణలో సర్కిల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డివిజన్‌లో అధ్యక్ష, కార్యదర్శులు. తపాలా ఉద్యోగులు సామూహికంగా విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారు. శ్రావణ్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని తపాలాశాఖ యాజమాన్యం నిరంకుశ వైఖరిని నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ మాట్లాడుతూ శ్రావణ్ కుమార్ పై విధించిన సస్పెన్షన్ ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదనీ, అది ఉద్యోగ సంఘంపై జరిగిన దాడిగా వారు అభివర్ణించారు. తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు నిరసన తెలియజేసి, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంలో ఎన్ఎఫ్‌పీఈ యూనియన్ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ మధ్యకాలంలో తపాల యజమాన్యం ఆచరణ సాధ్యం కానీ లక్ష్యాలని ఉద్యోగులకు విధించి ఆ లక్ష్యాలను చేరుకోలేదన్న సాకుతో శిక్షలు విధించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డాక్ సదన్‌లో నిర్వహిస్తున్న హైదరాబాద్ హెడ్ క్వార్టర్ రీజియన్ కార్యాలయాన్ని జమై ఉస్మానియాకు తరలించడాన్ని ఎన్ఎఫ్‌పీ ఈ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. సర్కిల్లో జరుగుతున్న అనేకమైన బడ్జెట్ విషయాలపై ప్రశ్నించినందుకే యూనియన్‌పై కుట్ర పనీ, నాయకత్వాన్ని అణచివేసే ఉద్దేశంతో ట్రేడ్ యూనియన్ నాయకులపై, ట్రేడ్ యూనియన్ హక్కులపై పథకం ప్రకారం దాడి చేస్తున్నారని ఆరోపించారు. శ్రావణ్ కుమార్‌పై అక్రమంగా కుట్ర పూరితంగా విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, లేనిపక్షంలో సోమవారం నుంచి దేశ వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన తెలియజేయడంతో పాటు సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆర్ ఫోర్ మాజీ ప్రధాన కార్యదర్శి పి.సురేష్. కో-ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ జలాలుద్దీన్, అడ్మిన్ స్టేషన్ సర్కిల్ కార్యదర్శి సుజిత్, ఆర్ ఫోర్ రాష్ట్ర కార్యదర్శి ముక్తార్ హమ్మద్, డీపీపీ అకౌంట్స్ సర్కిల్ కార్యదర్శి డిఎస్ మూర్తి, పీఫోర్ రాష్ట్ర కార్య దర్శి ఎం.మధుసూదన్ రావు, జీడీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేవిఎస్ చారి, పి ఫోర్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కుమార్, ఆర్ త్రీ రాష్ట్ర కార్యదర్శి జీఆర్ రెడ్డి, ఎస్‌బీసీఓ సర్కిల్ కార్యదర్శి ఎల్.కిషన్ సింగ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-హైదరాబాద్

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రజాసంఘాల సీఐటీయూ కార్యదర్శి శ్రావణ్ కుమార్ అన్నారు. రెండో రోజు ప్రజాసంఘాల జీపు జాత జోన్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ జాతా లాల్ దర్వాజా, కోకాకి తట్టి, కిషన్ బాగ్, తాడపన్, అడ్డాలపై నిర్వహించారు. ఈ జాతాలో ఐదు ప్రజాసంఘాల నాయకులు ఐద్వా కార్యదర్శి శశికళ, ఆవాజ్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, టీజీఎస్ కార్యదర్శి బాలు నాయక్, డీవైఎఫ్ఐ కార్యదర్శి కృష్ణతో కలిసి ఆయన మాట్లాడుతూ కార్మికుల పట్ల వివక్ష తగదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. అడ్డాలపై కనీస వసతులు కల్పించాలన్నారు. సీఐటీయూ నాయకులు కిషన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించారు. అర్హులైన కార్మికులకు అందరికీ డబల్ బెడ్ రూం ఇండ్లివ్వాలన్నారు. ఎం. మీనా అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సమతా రాజ్యాన్ని నిర్మించడానికి రాజకీయ ఎన్నికల పోరాటానికి సిద్ధం కావాలి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ కార్పొరేట్ మాఫియా దోపిడీ మనువాద పాలనకు చమరగీతం పాడి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమతా రాజ్యాన్ని నిర్మించడానికి రాజకీయ ఎన్నికల పోరాటానికి సిద్ధం కావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ సూచించారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఈ నెల 29వ తేదీన అంబేద్కర్ స్ఫూర్తి భవన్ లో నిర్వహించే దళిత బహుజన పార్టీ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో లిక్కర్, ల్యాండ్, సాండ్ మాఫియా అయిన మనువాద రాజకీయాలను ఓడించి, దళిత బహుజన పార్టీని గెలిపించాలని సూచించారు. దళిత బహుజనులకు రక్షణ, సామాజిక న్యాయం, విముక్తి జరగాలంటే అంబేద్కర్ వాదులైన దళిత బహుజన పార్టీ అభ్యర్థులను అసెంబ్లీ, పార్లమెంట్ చట్ట సభలకు పంపించాలని తెలంగాణ పౌర సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్‌శాఖ అధ్యక్షులు మద్దెల ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, నేషనల్ డెమోక్రటిక్ సెక్యూలర్ ఫ్రంట్ జాతీయ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ వి.ఎల్.రాజు, జాతీయ మీడియా సెల్ కన్వీనర్ సి.శ్యామ్ కుమార్, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, బహుజన్ జర్నలిస్ట్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ పి.విజయ్ నాగరాజు, పార్టీ నాయకులు పెంద్యాల సుచంద్రరావు, కీర్తి, రజనీకాంత్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు నిర్ణయం హేయమైన చర్య

- టీపీసీసీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పై లోక్ సభ సెక్రటేరియట్ అనర్హత వేటు విధించడం హేయమైన చర్య అని టీపీసీసీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పై లోక్ సభ సెక్రటేరియేట్ ఇచ్చిన నోటిఫికేషన్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదో తప్పుడు నిర్ణయమన్నారు. రాష్ట్రపతి దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. అది కూడా ఎన్నికల సంఘంతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందన్నారు. పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా రాహుల్ గాంధీకి మద్దతుగా దర్నా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థి నాయకుల అరెస్టు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద లక్షలాదిమంది నిరుద్యోగులతో ఉస్మానియా యూనివర్సిటీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబోయే విద్యార్థి నిరుద్యోగ మార్చ్ చేస్తున్న విద్యార్థి నాయకుడు భీంరావు నాయక్, మిడతన పల్లి విజయ్, బండి నరేష్, కె.వెంకట్ యాదవ్‌లను అక్రమ అరెస్టు చేసి స్థానిక ఓయూ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. టీఎస్పీఎస్సీ పరీక్ష పత్రాలు లీకేజీకి మూలకారకులైన చైర్మన్, సభ్యులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 క్వాలిఫై అయిన అభ్యర్థులను వెంటనే నష్ట పరిహారం ప్రకటించి న్యాయం చేయాలన్నారు. పేపర్ లీకేజీ బ్యాధులను వెంటనే భర్తరఫ్ చేయాలన్నారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్ రావును విచారిస్తే లీకేజీ వ్యవహారం పూర్తిగా బయటకి వస్తుందన్నారు. వెంటనే వీరిని అరెస్ట్ చేసి ఓయూ పీఎస్‌కు తరలించారు.

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి
- బాచుపల్లిలో పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం



నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శం అని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లిలో అరబిందో ఫార్మా వారి సౌజన్యం రూ.2.65 కోట్లతో రూపుదిద్దుకున్న బాచుపల్లి పోలీస్‌స్టేషన్ భవనంను శుక్రవారం ప్రారంభించారు. ఈ పోలీస్ స్టేషన్‌ను సుమారు రెండెకరాల సువిశాలమైన స్థలంలో 21 వేల చదరపు అడుగుల్లో జీ౦2 అంతస్తుల్లో నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పోలీసులు ప్రజలతో మెరుగైన సంబంధాలు ఏర్పరచుకుని వారి సమస్యలను పరిష్కరించడంలో విజయం సాధించారన్నారు. గడిచిన ఏడేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం స్నేహపూర్వక పోలీసింగ్ సహా పోలీసు శాఖలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పోలీసు శాఖకు ప్రాధాన్యతను కల్పించారనీ, గడిచిన ఏండ్లలో తెలంగాణ పోలీసులు అద్భుతమైన పనితీరుతో దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారన్నారు. తెలంగాణ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించడం ద్వారా కేసులను చేదించగలుగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ నవీన్ రావు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ మధన్ మోహన్ రెడ్డి, స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్, స్థానిక ఎస్‌హెచ్‌ఓ నర్సింహా రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్ కాసాని సుధాకర్, ప్రజా ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం

- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పార్టీ అభివృద్ధికి, నిజాయితీగా పనిచేసే కార్యకర్తలను సముచిత స్థానం కలిపిస్తామని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన హైదర్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందన్నారు. సాధించుకున్న రాష్ట్రంలో రెండు సార్లు అధికారం చేపట్టి తెలంగాణ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి నేడు దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. పరిపాలనలో దేశానికే తెలంగాణ దిక్సూచిగా మారిందన్నారు. యావత్ దేశం మొత్తం తెలంగాణ వైపు చూసే విధంగా ఉందన్నారు. తప్పుడు కథనాలు సృష్టించే ప్రతిపక్ష పార్టీల నాయకుల దుశ్చర్యలను తిప్పికొట్టే బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కోట్ల నిధులు వెచ్చించి శేరిలింగంపల్లి నియోజకవర్గంను అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఎనిమిదేండ్లలో ఏం చేశామనీ, రాబోయే రోజుల్లో ఏం చేయబోతున్నాం అని ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తని కంటికి రెప్పలా చూసుకుంటామన్నారు. క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. పార్టీ నియమ నిబంధనలకు లోబడి పని చేసి పార్టీ గౌరవాన్ని మరింత ఇనుమడింప చేసేలా చేయాలన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం సిపాయిల్లాగ కష్టపడాలన్నారు. పని చేసిన ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టు కొమ్మలు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లాపూర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అల్లాపూర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయనతో పాటు కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్వత్ నగర్ లోని ముస్లీం స్మశాన వాటికను, రామారావు నగర్‌లోని హిందూ స్మశాన వాటికను ప్రారంభించారు. అనంతరం సెంటర్ అల్లాపూర్ మసీదును పరిశీలించి మౌలిక సదుపాయాలుకు ఇబ్బంది ఉంటే తెలపాలని సూచించారు. ఇక్కడికి వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం రామారావు నగర్, కబీర్ నగర్ నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందల కోట్లతో ఎక్కడికక్కడ రోడ్లు, మంచినీరు, విద్యుత్, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం వంటి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు పూర్తి చేశామన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం ఎంతో అస్తవ్యస్తంగా ఉండేదనీ, నేడు అల్లాపూర్ ప్రాంతం అన్ని వర్గాల ప్రజలు నివసించడానికి, చుట్టుపక్కల ప్రాంతాలైన హైటెక్ సిటీ, కూకట్‌పల్లి ఎక్కడికి వెళ్లాలన్నా ప్రధాన కేంద్రంగా మారిందన్నారు. ఇందుకు కావాల్సిన రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ బ్రిడ్జిలు కూడా పూర్తి చేశామని తెలిపారు. అక్కడక్కడ ఉన్న నాలా సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. నాలా పనులు జరిగే విషయంలో నిరుపేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలా పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అల్లాపూర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు ఐలయ్య, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ధనరాజ్ మృతి పట్ల పద్మారావుగౌడ్ సంతాపం



నవతెలంగాణ-ఓయూ

బౌద్ధనగర్‌లోని అంబర్ నగర్ ప్రాంతంలో గురువారం గుండెపోటుతో హఠాత్తుగా మరణించిన బీఆర్ఎస్ యువ నాయకుడు ధనరాజ్ మృతి పట్ల డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సంతాపం తెలిపారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. చిన్న వయసులోనే దనరాజ్ మరణించడం బాధాకరమని పేర్కొన్నారు.



ముస్లింలకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం

నవతెలంగాణ-ఓయూ

రంజాన్ మాసంలో ముస్లి ంలకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికిం ద్రాబాద్ పరిధిలో లాలాగూడ, వారసిగూడ ప్రాంతాల్లో రెండు హలీం కేంద్రాలను డిప్యూటీ స్పీకర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం చిలకలగూడ ఈద్గాను సందర్శించారు. రాష్ట్రంలోనే మోడల్‌గా నిలిచేలా ఈద్గాను తీర్చిదిద్దామన్నారు. నిర్వహణకు ఏర్పాట్లు జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, జహంగీర్, నీలా ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ మాక్స్' కార్మికులకు అండగా ఉంటా

- మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సూపర్ మ్యాక్స్ కార్మికులకు అండగా ఉంటానని మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. 20 రోజులుగా జీడిమెట్ల పారిశ్రామిక వాడలో గల సూపర్ మ్యాక్స్ కంపెనీ ఆవరణలో కార్మికులు చేస్తున్న దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కంపెనీలు, కార్మికులకు ఎంతో భరోసా ఉండేదనీ, ప్రస్తుతం మనుగడ లేకుండా పోయిందన్నారు. ఇది ముమ్మాటికీ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల అసమర్థతే అన్నారు. కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేసే యాజమాన్యాల భరతం పడతామన్నారు. ఇన్నేండ్లుగా కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకున్న పరిశ్రమ యాజమాన్యం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకునేంతవరకు అండగా ఉంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సువ్వారి శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్రావణ్, కంపెనీ నాయకులు టీవీ రమణ, వై.సుధాకర్ బాబు పాల్గొన్నారు.

మానే ఏ ద సెలూన్ ప్రారంభం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మహిళలు ముందుకు వచ్చి స్వశక్తిని ఆధారంగా చేసుకుని ముందుకు వెళ్ళాలని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేస్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మానే ఏ ద సెలూన్‌ను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. నిమ్మ శిరీష ఫ్రాంచైజీ తీసుకుని సెలూన్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఒకరిని బట్టి మరొకరు స్ఫూర్తి పొందాలన్నారు. మహిళలకు తన ప్రోత్సాహం ఎల్లపుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు సీహెచ్ ప్రభాకర్ గౌడ్, జీవ, జ్యోతి, శిరీష, జిమ్ గోపాల్, సుశీల్, భాస్కర్ రావు, శారద, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్.పి.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గురుమూర్తి నగర్ కమిటీ హాల్ ఆవరణలో ఎస్.పి.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. పేదలకు ఇలాంటి వైద్య శిబిరాలు వరమన్నారు. కొన్నేండ్లుగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశామనీ, భవిష్యత్తులో కూడా పేదల సంక్షేమం కోసం సేవలను విస్తృతం చేస్తారని తెలిపారు. సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ డి.స్వాతి 200 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ ఆడియాలజిస్ట్ కేథరిన్ చెవి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ సంక్షేమ సంఘం నాయకులు ఓంకార్ రెడ్డి, తారక రాణి, సామాజిక కార్యకర్తలు ధనలక్ష్మి, శ్రీలత, ఆసుపత్రి సిబ్బంది నీలం, బీజోయ, బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ ధర్మేంద్ర, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మద్దిలేటి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : ఐసీడీఎస్ సూపర్‌వైజర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పోషక విలువ గల పౌష్టికాహారం తీసుకుంటే చిన్నారులు, కిషోర బాలలు, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎన్.తిరుమల తెలిపారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి రంగారెడ్డి నగర్‌లో గల బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన (పోషణ్ పక్వాడ) చిరుధాన్యాలపై అవగాహనా సదస్సులో పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ వినోద్ కుమార్ జాదవ్‌తో కలిసి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమం అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించనున్నట్టు తెలిపారు. చిన్నారుల తల్లులు అంగన్వాడీ కేంద్రాల నుంచి అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పక తీసుకుని చిన్నారులకు అందజేయాలన్నారు. బాలింతలు సైతం పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నారులకు నూనె వస్తువులు కాకుండా సహజ సిద్ధమైన పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి.రమాదేవి, కె.లీల, ఎం.రమాదేవి, పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జూబ్లిహిల్స్ జోన్‌లో జన చైతన్య యాత్ర



నవతెలంగాణ-జూబ్లిహిల్స్

జన చైతన్య యాత్ర జూబ్లీహిల్స్ జోన్‌లో సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి 8 ఏండ్లు గడుస్తున్నా ఆ వాగ్దానాలను అమలు చేయకుండా అధిక ధరలను పెంచి ప్రజల నడ్డి విడుస్తుందన్నారు. గ్యాస్, పెట్రోల్, నిత్యవసరాల వస్తువుల ధరలను పెంచుతున్నారన్నారు. దేశ సంపద మొత్తం అదానీకి దోచి పెడుతున్నారన్నారు. మొత్తం పబ్లిక్ సెక్టార్లను ప్రయివేటీకరణ చేస్తున్నారన్నారు. ప్రజలను మతం, కులం పేరిట విడగొట్టి పాలిస్తున్నారన్నారు. ఈనెల 29వ తేదీన జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మారన్న, అశోక్, స్వామి, భిక్షపతి, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్లలోని శ్రీ వెంకటేశ్వర, శివ, శ్రీ రామాంజనేయ స్వామి ఆలయ 19వ బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్‌ని సత్కరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టి.కృష్ణారావు, రాఘవేంద్ర రావు, శ్రవణ్ కుమార్, మహిపాల్ రెడ్డి, గోపాల చారి, వీరేష్ గౌడ్ పాల్గొన్నారు.

దేశం కోసం చిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసి భగత్‌సింగ్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భగత్‌సింగ్ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణ త్యాగం చేశాడని సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ అన్నారు. హైదర్‌నగర్ లోని హైదర్ నగర్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో జేఎన్టీయూ ఆటో స్టాండ్ వద్ద భగత్ సింగ్ 92వ వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ కార్యదర్శి వి.శివ ప్రసాద్, సభ్యులు రాజారావు హెల్దీ ప్రసాద్ భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాలన్నారు. భగత్ సింగ్ చిన్న వయసులోనే జలియన్ వాలాబాగ్ చూసి చలించిపోయిన బ్రిటిష్ వాళ్ళను దేశం నుండి వెళ్లగొట్టాలని స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నాడని తెలిపారు. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే లాలాజపతి రాయ్‌ని పోలీసులు లాఠీచార్జ్ చేసి తల పగలగొట్టి చంపేసి భగత్ సింగ్ హత్య చేశాడని బ్రిటీష్ ప్రభుత్వం రాజ్ గురు సుఖదేవ్ భగత్ సింగ్‌లకు ఉరిశిక్ష వేసిందన్నారు. అతి చిన్న వయసులోనే భగత్ సింగ్ రాజ్ గురుదేవులు ఈ దేశం కోసం తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, కృష్ణ నాయక్, సత్తయ్య, నాగేశ్వరరావు, వీరయ్య, ఎల్ డీ ప్రసాద్, మహేష్, శ్రీను, నరసింహ పాల్గొన్నారు.



టీడీపీ ఆవిర్భావ సభను విజయవంతం చేద్దాం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈనె 29వ తేదీన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేస్తామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు పి.సాయిబాబా తెలిపారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ స్థాపించి 41 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ అధ్యక్షులు కాసాని నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయడుతోపాటు ఇరు రాష్ట్రాల పార్టీ నాయకులు, పొలిట్ బ్యూరో సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున కదలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజ్ గౌడ్, పెద్దోజు రవీంద్రాచారి, నాగు నగేష్, కట్ట రాములు, ఎస్.ప్రకాష్, జోగిందర్ సింగ్, సత్యనారాయణ, యాదగిరి, రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'జిస్మత్ జైల్ మండి అండ్ థీమ్ రెస్టారెంట్' ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

భోజన ప్రియులకు నోరూరించే వంటకాల రుచులను ఆతిథ్యం అందించేందుకు మదీనగూడలోని శ్రీ దుర్గా కాలనీ ప్రధాన రోడ్డులో గల ఏకేఎం ధర్మరావు సిగ్నేచర్‌లో ఏర్పాటైన "జిస్మత్ జైల్ మండి అండ్ థీమ్ రెస్టారెంట్" ను దక్షిణాది నటి హనీ రోస్ ప్రారంభించారు. ఈ సందర్భంలో హనీ రోస్ మాట్లాడుతూ విభిన్న ఆహార రుచులకు హైదరాబాద్ కేరాఫ్‌గా నిలుస్తుందన్నారు. బోజన ప్రియులకు విభిన్న రకాల వంటకాల రుచులను అందించేందుకు, జైల్, నవాబ్ థీమ్ ఇక్కడ ఎంతో విభిన్నంగా ఉందన్నారు. జిస్మత్ మండి నిర్వాహకులు, ప్రముఖ యూట్యూబర్ గౌతమి మాట్లాడుతూ ఈ మండిలో జైల్, నవాబ్ డిజైన్ థీమ్ ప్రత్యేకం అన్నారు. ఖైదీల వేషధారణలో కారాగారం డైనింగ్‌లో కూర్చునే ఆహార ప్రియులకు ఫుడ్ సర్వ్ చేస్తారన్నారు. విజయవాడ, గుంటూరు, వైజాగ్, నెల్లూరులో బ్రాంచీలు కలిగిన తమ జిస్మత్ మండి త్వరలో సన్ సిటీలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఫ్రాంఛైజీ నిర్వహకులు దినేష్ మాట్లడతూ నవాబ్, జైల్ థీమ్ తో ఏర్పాటైన ఈ మండి రెస్టారెంట్‌లో ఛెఫ్‌లు ప్రత్యేకమైన జూసి మటన్ మండి, అల్ఫాహం మండి, అరబిక్ ఫిష్ వంటి అనేక రకాల వంటకాలను అందిస్తున్నామని వివరించారు. టాలీవుడ్ నటుడు ధర్మా, శ్రీని ఇన్ ఫ్రా ఎండీ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఛాందసవాద శక్తులను నిలువరించండి

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. కేంద్ర సర్కార్ బాధితుల పక్షాన ఉండకుండా దాడులు చేసే వారికి మద్దతుగా నిలుస్తోందని అన్నారు. బీజేపీయేతర రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్ అనుకూల గవర్నర్లను నియమించి రాష్ట్ర పాలనలో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రాష్ట్ర గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాలపై సంతకాలు చేయాల్సి ఉండగా.. ఆ బిల్లులను తొక్కి పెడుతున్నారని విమర్శించారు. కేరళలోనూ ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అయితే కేరళలో కేంద్ర సర్కారు తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేయడం లేదని అన్నారు. కేరళలోని వామపక్ష సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా పేదల సంక్షేమానికి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. పింఛను రూ.3200 ఇస్తున్నామని, పేదలకు 20 కిలోల బియ్యం, కూరగాయలు ఇస్తున్నామని తెలిపారు. వామపక్ష సర్కారు.. పది లక్షలు వెచ్చించి డబుల్ బెడ్‌రూం ఇండ్లు సకల సౌకర్యాలతో నిర్మించి ఇస్తున్నదని వివరించారు. కానీ బీజేపీ సర్కారు ఇందుకు విరుద్ధంగా పేదలను గాలికొదిలి, కార్పొరేట్లకు బడా పెట్టుబడి దారులకు ఎర్రతివాచి పరుస్తోందని విమర్శించారు. పేదలను విస్మరించి, అసమానతలు పెంచే సర్కారును మార్చాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. బీజేపీ సర్కారును నిలువరించాలంటే పోరాటమార్గం ఎంచుకోవాలన్నారు. బీజేపీ రాజకీయ విధానాలపై, మతోన్మాద చర్యలపై ప్రతి గ్రామంలో ప్రజలు సంఘటితమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు నగరంలో బైక్ ర్యాలీ జరిగింది. కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. పాటల సీడీని విజయరాఘవన్ ఆవిష్కరించారు.



నిజామాబాద్ నుంచి కామారెడ్డి వరకు ర్యాలీ

నిజామాబాద్ నుంచి బైక్ ర్యాలీతో పాటు సాగిన యాత్రకు కామారెడ్డి జిల్లా పద్మాజివాడి ఎక్స్‌రోడ్డు వద్ద సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కమిటీ స్వాగతం పలికింది. పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్.. యాత్రీకులకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీతో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో ఎస్. రమ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మెతిరాం నాయక్, చంద్రశేఖర్, కొత్త నర్సింలు, రాజనర్సు, ఎస్ఎఫ్ఐ అరుణ్, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీసీఐ నిర్వీర్యంతో పత్తికి ధరలేదు : సాగర్

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్ మాట్లాడుతూ.. ఓ వైపు ధరలు పెంచుతున్న సర్కారు.. అందుకు తగ్గట్టు వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయడం లేదన్నారు. సీసీఐని నిర్వీర్యం చేశారని, ఫలితంగా మార్కెట్‌లో పత్తికి ధర లేక మళ్లీ రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి బీజేపీది బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. ఎంపీ అరవింద్ పసుపు బోర్డుతో పాటు చెరుకు ఫ్యాక్టరీ గురించి కూడా హామీనిచ్చారని గుర్తు చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం చెరుకు ఫ్యాక్టరీ తెరవకపోతే తానే ఓ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కవితను మూడు సార్లు ఈడీ ప్రశ్నించిందని, తప్పుడు షేర్ల విలువలతో 17 లక్షల కోట్లు ఆవిరి చేసిన అదానీని ఈడీ ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు.



రాష్ట్ర కార్యదర్శి రమ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు 33 శాతం మహిళలకు రిజర్వేషన్ అమలు చేస్తామని హామీనిచ్చిన మోడీ సర్కారు.. అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అయినా అమలు చేయడం లేదని అన్నారు. పార్లమెంట్‌లో పూర్తి మెజార్టీ ఉన్నా 33 శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీడీ రంగాన్ని మొత్తంగా నాశనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, రాష్ట్ర నాయకులు రమణ, పెద్ది వెంకట్రాములు, అరుణజ్యోతి, నూర్జహాన్, రమేష్‌బాబు, సబ్బని లత, వెంకటేష్, శంకర్‌గౌడ్, గోవర్ధన్, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు



బీజేపీ యత్నాలను తిప్పికొడతాం

రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది సంవత్సరాల్లో ధరలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికితోడు హిందూత్వ అజెండాతో బీసీ, ఎస్సీ, ఎస్టీలను ద్వితీయశ్రేణి పౌరులుగా ఆంక్షలు విధించేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రాజ్యాంగం మారుస్తామని కారుకూతలు కూస్తున్నాడని, ఇలాంటి వ్యక్తిని ఈ సారి ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని, డిపాజిట్ కూడా దక్కనీయొద్దని సూచించారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని బాండ్ రాసిచ్చి, మాట మార్చిండని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం), వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య, లౌకిక శక్తులతో కలిసి బీజేపీయత్నాలను తిప్పికొడతామని అన్నారు. దేశంలో ఒకే ట్యాక్స్, ఒకే యాక్ట్ ఉండాలంటున్న కేంద్రం.. మరి ఒకే కులం ఉండాలని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ బంగారు తెలంగాణ అని, ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే, ప్రజా సమస్యలు విస్మరిస్తే నడిరోడ్డుపై ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ





వసూళ్ల రాజ్యంగా మోడీ పాలన

మతాల పేరుతో చిచ్చుపెట్టడమే బీజేపీ విధానం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జనచైతన్యయాత్రకు నీరాజనం



ఆసిఫాబాద్ జిల్లా జెండాగూడ వద్ద యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి
(మెడపట్ల సురేష్)

మోడీపాలన వసూళ్ల రాజ్యంగా తయారైందని మంచిర్యాల నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్ వరకు చేపడుతున్న జాతీయ రహదారే ఇందుకు ఉదాహరణ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. రోడ్డునిర్మాణం పూర్తికాకముందే వసూళ్లు మొదలు పెట్టారని విమర్శించారు. ఎస్.వీరయ్య నేతృత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగుతున్న జనచైతన్యయాత్ర రెండో రోజు శుక్రవారం నిర్మల్ నుంచి బయలుదేరి ఉట్నూర్, ఆసిఫాబాద్ ప్రాంతాల మీదుగా కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా దారిపొడవునా పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ యాత్రకు ఘన స్వాగతం పలికారు. కాగజ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వీరయ్య మాట్లాడారు. మోడీ పాలనలో దేశంలో పేదరికం 23కోట్లకు పెరిగిందని, ఆహార పదార్థాల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయని పేదలు తిండి తినడమే కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంపాదన తిండికే సరిపోవడంలేదని అన్నారు. ధనికుల సంపద పన్ను రద్దు చేసి సాధారణ వ్యాపారులపై జీఎస్‌టీ భారాలు మోపుతోందని మండిపడ్డారు.

ఆదానీపై సీబీఐ, ఈడీ దాడులు జరగవని, పన్నులు కట్టకపోయినా ఐటీ అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల నాటికి పీఎం పదవి పోతుందనే భయంతో మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకొనే ప్రయత్నం బీజేపీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మోడీ, షాలు కార్పొరేట్ విధానాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మతసామరస్యం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలను కాపాడటం కోసమే సీపీఐ(ఎం) జన చైతన్యయాత్ర చేపట్టిందని వివరించారు. ప్రజలు ఐక్య ఉద్యమాల వైపు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జయలక్ష్మీ, స్కైలాబ్‌బాబు, జగదీష్, వెంకటేశ్వర్లు, అడివయ్య, ఆశయ్య, జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న పాల్గొన్నారు.

సర్‌ప్రైజ్ చేసే ఎలిమెంట్..

రవితేజ నటిస్తున్న కొత్త సినిమా 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకుడు. అభిషేక్ పిక్చర్స్, ఆర్ టీ టీమ్ వర్క్స్‌పై అభిషేక్ నామా, రవితేజ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 7న సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో రచయిత శ్రీకాంత్ విస్సా మీడియాతో మాట్లాడుతూ, 'ఇదొక యాక్షన్ థ్రిల్లర్. రవితేజ సినిమాలో ఉండే అంశాలన్నీ ఉంటూనే ఒక డిఫరెంట్ ఎలిమెంట్ సర్‌ప్రైజ్ చేస్తుంది. 'హీరోస్ డోంట్ ఎగ్జిస్ట్' అంటే హీరోలు అనే వాళ్ళే ఉండరని అర్థం. ప్రతి హీరోలో ఒక విలన్ ఉంటాడు. ప్రతి విలన్‌లోనూ హీరో ఉంటాడు. అదే కాన్సెప్ట్. దర్శకుడు సుధీర్ వర్మతో పని చేయడం కంఫర్ట్ బుల్‌గా ఉంటుంది. ప్రస్తుతం కళ్యాణ్ రామ్ 'డెవిల్', 'టైగర్ నాగేశ్వరరావు', 'పుష్ప 2' కోసం వర్క్ చేస్తున్నా' అని తెలిపారు.



శ్రీకాంత్ విస్సా

దుమారం మొదలైంది

జి ఎల్ బి సినిమా బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం 'దుమారం'. ఉగాది పండుగ నేపథ్యంలో శ్రీనగర్ కాలనీలోని సంధ్య మోషన్ స్టూడియోస్‌లో స్క్రిప్ట్ పూజ జరిగింది.

ఒక మారుమూల గ్రామం నుండి హైదరాబాద్‌కి వచ్చిన ఒక నాయిని బ్రాహ్మణ కుర్రాడు కటింగ్ షాపుతో జీవనం కొనసాగి స్తుంటాడు. ఓసారి అనుకోని సంఘటన వల్ల నగరంలోని ఒక మాఫియా వాళ్లతో ఇరుక్కుంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది అనేదే ఈ సినిమా. హీరోగా మల్లిక్ బాబు, హీరోయిన్‌గా ఇషాని పరిచయం చేస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభం కానుంది.



ఇషా, మల్లిక్ బాబు

సత్యం వధ.. ధర్మం చెర రిలీజ్‌కి రెడీ

వి శ్రీనివాస్ ఆర్ట్ క్రియేషన్స్, త్రిదేవ్ క్రియేషన్స్ పతాకాలపై బాబు నిమ్మగడ్డ దర్శకత్వంలో ఎదుబాటి కొండయ్య నిర్మిస్తున్న చిత్రం 'సత్యం వధ ధర్మం చెర'. ఈనెల 31న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ, 'మన నిజజీవితంలో ప్రతిరోజూ జరిగే సంఘటనలే ఈ చిత్రకథ. అలాగే చట్టం ఎలా పనిచేయాలో ఇందులో చూపించాం. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ సినిమా చాలా బాగా వచ్చింది' అని తెలిపారు. 'ప్రతి ఒక్కరూ ఈ సినిమాకి కనెక్ట్ అవుతారు' అని హీరోయిన్ పూజ అన్నారు. 'మంచి కాన్సెప్ట్‌తో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.



పూజ

నవచిత్రం

కుటుంబం బాగుంటేనే..

'ఓ మంచి సినిమా తీస్తే ట్రెండ్‌కి భిన్నమైనా సరే కచ్చితంగా బ్రహ్మరథం పడతారనే నా నమ్మకాన్ని నిలబెట్టినందుకు తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. 'రంగమార్తాండ'కి మంచి ఆదరణ లభించడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు కృష్ణవంశీ చెప్పారు. ఆయన దర్శకత్వం వహించిన 'రంగమార్తాండ' విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, 'కుటుంబం బాగుంటేనే, దేశం బాగుంటుంది అనే కాన్సెప్ట్ నచ్చి 'నట సామ్రాట్'ని రీమేక్ చేశా. డబ్బు సంపాదన, ఉద్యోగాల్లో పడి మన సొంత కుటుంబాన్నే నిర్లక్ష్యం చేస్తున్నాం. అలా చేస్తే ఏం జరుగుతుంది అనేదే మా సినిమా. బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ నటనకి మంత్రముగ్ధులవుతున్నారు. అలాగే ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ అమ్మానాన్నల్ని గుర్తు చేసుకుంటున్నారు' అని అన్నారు.



కృష్ణవంశీ



- వృద్ధాప్య కారణాల రీత్యా హీరో అజిత్‌కుమార్ తండ్రి సుబ్రహ్మణ్యం శుక్రవారం కన్నుమూశారు. నేడు ఆయన అంత్యక్రియలు చెన్నైలోని బెసంత్ నాగ శ్మశానవాటికలో జరుగనున్నాయి. ఆయనకు భార్య మోహిని, ముగ్గురు కుమారులు ఉన్నారు. అజిత్ రెండో తనయుడు.



- గత కొద్ది రోజులుగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న బాలీవుడ్ దర్శకుడు ప్రదీప్ సర్కార్ (67) తుదిశ్వాస విడిచారు. 'హెలి కాప్టర్ ఈలా, పరిణీత, మర్దానీ', అలాగే పలు మ్యూజిక్ ఆల్బమ్స్‌కి కూడా డైరెక్ట్ చేశారు.

ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ

'కృష్ణగాడు అంటే ఒక రేంజ్' చిత్రాన్ని శ్రీ తేజస్ ప్రొడక్షన్ ప్రై.లి బ్యానర్ పై పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పిఎన్‌కే శ్రీలత నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా నూతన దర్శకుడు రాజేష్ దొండపాటి, హీరో, హీరోయిన్లు రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ పరిచయం అవుతున్నారు. ఉగాది సందర్భంగా డైరెక్టర్ శ్రీవాస్ రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ టీజర్‌లో కామెడీ, రొమాన్స్, యాక్షన్ ఇలా అన్ని జోనర్లను చూపించారు. సాబు వర్గీస్ ఆర్ఆర్, ఎస్‌కే రఫి ఫొటోగ్రఫీ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.



రిష్వి తిమ్మరాజు, రాజేష్ దొండపాటి, శ్రీవాస్, విస్మయ శ్రీ

ఇంగ్లాండ్, శ్రీలంక, యుఏఈ!

ఆసియా కప్‌లో భారత్ మ్యాచ్‌ల ఆతిథ్య రేసులో మూడు దేశాలు

దుబాయ్ : భారత్, పాకిస్థాన్ ముఖాముఖి పోరు. ప్రపంచ క్రికెట్‌లో ఈ దాయాది జట్ల సమరానికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇప్పుడు ఈ దిగ్గజ పోరాటానికి ఆతిథ్యం అందించేందుకు మూడు దేశాలు సిద్ధంగా ఉన్నాయి. 2023 ఆసియా కప్ పాకిస్థాన్‌లో జరగనుండగా.. భారత జట్టు తలపడే మ్యాచులను పాకిస్థాన్‌కు ఆవల నిర్వహించేందుకు ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఏసీసీ సమావేశంలో నిర్ణయించారు. ఆసియా కప్‌ను పాకిస్థాన్ బయట నిర్వహిస్తే.. టోర్నీ నుంచి బాయ్‌కాట్ చేసేందుకు ఆతిథ్య పాకిస్థాన్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆసియా కప్‌ను పాక్‌లోనే నిర్వహిస్తూ.. భారత జట్టు మ్యాచులను మాత్రం తటస్థ వేదికలకు మార్చనున్నారు. యుఏఈ, శ్రీలంక, ఇంగ్లాండ్‌లు ఆసియా కప్‌లో భారత జట్టు మ్యాచులకు వేదికగా నిలిచేందుకు పోటీపడుతున్నాయి. 2023 ఆసియా కప్‌లో ఆరు జట్లు పోటీపడనుండగా.. గ్రూప్ దశలో భారత్, పాకిస్థాన్ సహా ఓ క్వాలిఫయర్ జట్టు ఆడనున్నాయి. బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్గనిస్థాన్ మరో గ్రూప్‌లో ఉన్నాయి. గ్రూప్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 4కు చేరుకుంటాయి. సూపర్-4లో టాప్-2 జట్లు ఫైనల్లో తలపడతాయి. ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ కనీసం రెండు సార్లు తలపడనుండగా.. ఫైనల్స్‌కు చేరుకుంటే మూడోసారీ ఢీకొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఆసియా కప్ జరుగనుంది. షెడ్యూల్, వేదికలు ఖరారు కోసం ఏసీసీ ఇటీవల ఓ కమిటీ నియమించింది. పాకిస్థాన్‌లో ఆసియా కప్ నిర్వహణపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మొండి పట్టుదలకు వెళ్లింది. గత నెలలో బహ్రెయిన్‌లో జరిగిన సమావేశంలో పీసీబీ చైర్మెన్ టోర్నీ బహిష్కరణకు సిద్ధమంటూ వ్యాఖ్యానించాడు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఐసీసీ సమావేశానికి హాజరైన ఏసీసీ ప్రతినిధులు.. అక్కడే ఆసియా కప్ నిర్వహణపై భేటీ అయ్యారు. 2018 ఆసియా కప్ ఆతిథ్య హక్కులు భారత్ కలిగి ఉన్నా పాకిస్థాన్ జట్టు పర్యటించేందుకు ద్వైపాక్షిక సంబంధాలు అడ్డుగా నిలుస్తుండగా..ఆ టోర్నీని యుఏఈ వేదికగా బీసీసీఐ నిర్వహించింది. ఇదే తరహాలో పీసీబీ సైతం ఆలోచన చేయాలని బీసీసీఐ కార్యదర్శి జై షా సూచించారు. ఓ దశలో 2023 ఆసియా కప్ ఆతిథ్య హక్కులను శ్రీలంక క్రికెట్ బోర్డు తీసుకునేందుకు మొగ్గు చూపగా.. అందుకు పీసీబీ నిరాకరించింది. ఆసియా కప్ పాకిస్థాన్‌లో నిర్వహిస్తూ.. భారత్ ఆడే మ్యాచుల తటస్థ వేదికకు మార్చేందుకు పీసీబీ, బీసీసీఐ సహా ఏసీసీ సభ్య దేశాలు అంగీకరించాయి. యుఏఈలో సెప్టెంబర్ మాసంలో ఎండలు తీవ్రంగా ఉంటాయి. దీంతో శ్రీలంక, ఇంగ్లాండ్‌లో నిర్వహణపై దృష్టి పెట్టారు. ప్రసారదారు ఏర్పాట్లు, లాజిస్టికల్ ఇబ్బందులను సైతం గమనంలో ఉంచుకుని సరైన వేదికను త్వరలోనే ఎంపిక చేయనున్నారు. భారత్ ఆసియా కప్ ఫైనల్స్‌కు చేరుకుంటే.. అప్పుడు టైటిల్ పోరును సైతం తటస్థ వేదికకు మార్చాల్సిందే.



ఆటలు



సింధు పరాజయం

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్

బసెల్ : భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు వైఫల్యం కొనసాగుతుంది. గాయం నుంచి కోలుకుని షటిల్ కోర్టులో రీ ఎంట్రీ ఇచ్చిన తెలుగు తేజం.. ఫామ్ అందుకునేందుకు ఇబ్బందులు పడుతోంది. నాల్గో సీడ్ సింధు స్విస్ ఓపెన్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోనే నిష్క్రమించింది. మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో ఇండోనేషియా షట్లర్ కుసుమ చేతిలో మూడు గేముల పోరులో ఓటమి పాలైంది. 15-21, 21-12, 18-21తో క్వార్టర్స్ బెర్త్‌ను సింధు చేజార్చుకుంది. రెండో గేమ్‌ను అలవోకగా నెగ్గిన సింధు.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో అంచనాలను అందుకోలేదు. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ వరుస గేముల్లో ఓటమి పాలయ్యాడు. ఫ్రాన్స్ షట్లర్ క్రిస్టో 21-8, 21-8తో ప్రణయ్‌పై ఏకపక్ష విజయం సాధించాడు.

మెస్సి @ 800 గోల్స్

పనామాపై అర్జెంటీనా గెలుపు

బ్యూనోస్‌ఎయిర్స్ : సాకర్ సూపర్ స్టార్ లియోనల్ మెస్సి మరో రికార్డు బద్దలు కొట్టాడు. కెరీర్ 800 గోల్స్ సాధించిన రెండో ఆటగాడిగా నిలిచాడు. పోర్చుగల్ హీరో క్రిస్టియానో రొనాల్డో 800 కెరీర్ గోల్స్ చేసిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా.. ఫ్రాన్స్‌తో ఫైనల్ అనంతరం తొలిసారి బరిలోకి దిగింది. సొంతగడ్డపై పనామాను 2-0తో చిత్తు చేసి ఫిఫా ప్రపంచకప్ విజయాన్ని మరోసారి సెలబ్రేట్ చేసుకుంది. మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనాకు ఆఖరు వరకు గోల్ నిరాకరించిన పనామా.. లియోనల్ స్కాలోని శిబిరంలో ఉత్కంఠకు తెరతీసింది. 78వ నిమిషంలో 21 ఏండ్ల యువ మిడ్ ఫీల్డర్ థియాగో ఆల్మాడా గోల్ చేసి అర్జెంటీనాను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. 89వ నిమిషంలో ఫ్రీ కిక్‌ను గోల్‌గా మలిచిన లియోనల్ మెస్సీ.. అర్జెంటీనా అభిమానులకు సూపర్ కిక్ ఇచ్చాడు. మెస్సీ గోల్‌తో ఆ జట్టు ఆటగాళ్లు, కోచ్ కుటుంబంతో సహా మైదానంలోకి వచ్చి సంబురాలు చేసుకున్నారు. ఈ గోల్‌తో మెస్సి కెరీర్ రికార్డు గోల్ నమోదు చేశాడు.



రుద్రాంక్ష్ కాంస్య గురి

- ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్

భోపాల్ : ఇటీవల కైరోలో జరిగిన ప్రపంచకప్‌లో పసిడి నెగ్గిన రుద్రాంక్ష్ పాటిల్.. భోపాల్‌లో గోల్డ్ రేసులో ఫేవరేట్‌గా నిలిచాడు. ఇటీవల టోర్నీల్లో ఎన్నడూ 9 స్కోర్లు నమోదు చేయని రుద్రాంక్ష్ పాటిల్ భోపాల్ ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో తడబాటుకు గురయ్యాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం తొలి రౌండ్లోనే 9.9, 10.1 స్కోర్లతో మొదలెట్టిన రుద్రాంక్ష్ ఓ దశలో ఎలిమినేషన్ ప్రమాదంలో ఎదుర్కొన్నాడు. 20 షాట్ల అనంతరం నాల్గో స్థానంలోకి చేరుకున్న రుద్రాంక్ష్ తక్కువ స్కోర్లు నమోదు చేసినా చివర్లో పుంజుకుని కాంస్య పతకం దక్కించుకున్నాడు. చైనా షూటర్ షెంగ్ లియావో పసిడి పతకం సాధించగా, చైనాకే చెందిన డు లిన్షు సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. టోర్నీలో ఓవరాల్‌గా చైనా ఐదు స్వర్ణాలు, ఓ రజతం, రెండు కాంస్య పతకాతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. భారత్ ఓ పసిడి, ఓ రజతం, మూడు కాంస్య పతకాలతో ద్వితీయ స్థానంలో నిలిచింది.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.